www.andhrajyothy.com
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 178
పేజీలు: 12
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

వెల (Price) : Rs. 6.50



3వ తరగతి నుంచే ఏఐ పాఠాలు

వచ్చే ఏడాది నుంచి సీబీఎస్ఈ బడుల్లో అమలు

3, 4, 5 తరగతుల్లో ప్రాథమిక అంశాలు

ఆరో తరగతి నుంచి స్కిల్ సబ్జెక్టుగా కొనసాగింపు

ఏఐ సాయంతో భాషా నైపుణ్యాల కల్పన కూడా..

ఇప్పటికే 18 వేల స్కూళ్లలో పైలట్ ప్రాజెక్టు

2



యువత.. పాతికేళ్ల భవిత కోరుతున్నారు

ఉచితాలు, పథకాలు కాదు!

పవన్ కల్యాణ్ సంచలన ట్వీట్

సోమవారం | 13-10-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి మ.12:25 తదుపరి అష్టమి, నక్షత్రం: ఆర్ద్ర మ.12:27 తదుపరి పునర్వసు, వర్జ్యం: రా.12:10-1:44, దుర్ముహూర్తం: మ.12:24-1:11, మ.2:44-3:31, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 6:11, సూర్యాస్తమయం: 5:51

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అమరావతిలో సోమవారం ప్రారంభించనున్న మునిసిపల్ శాఖ ప్రధాన కార్యాలయం

అమరావతిలో తొలి హెచ్‌వోడీ

నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి.. 'ఏ' అక్షరంతో భవనానికి ఎలివేషన్

4.32 ఎకరాల్లో 7 అంతస్థుల్లో నిర్మాణం.. మునిసిపల్ శాఖ పనులన్నీ ఇక ఇక్కడి నుంచే

కొలువుదీరనున్న మునిసిపల్ మంత్రి, డైరెక్టర్, సీఆర్‌డీఏ, ఏడీసీ కార్యాలయాలు

రాజధాని రైతులకు చేరువలో అధికారులు 12

ప్రభుత్వ బడులు మళ్లీ కళకళలాడను న్నాయి. సీఎం చంద్రబాబు నేతృత్వం లోని ప్రస్తుత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యా యులు సోమవారం విధుల్లో చేరను న్నారు. సుమారు 15,500 మంది కొత్త టీచర్లు నేటి నుంచి పాఠాలు చెప్పను న్నారు. విధుల్లో చేరేందుకు నెల రోజుల గడువు ఉన్నప్పటికీ చాలా మంది టీచర్లు సోమవారమే స్కూళ్లలో చేరనున్నారు.

ప్రభుత్వ బడికి మళ్లీ కళ



నేటి నుంచి విధుల్లోకి కొత్త టీచర్లు

సుమారు 15,500 మందికి పోస్టింగ్

పాఠశాల విద్య పరిధిలో 13,089 మంది


ఇతర మేనేజ్‌మెంట్లలో సుమారు 2,500

విద్యార్థులకు తీరిన టీచర్ల కొరత సమస్య

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కొత్త గురువులతో సరికొత్త కళ సంతరించుకోనున్నాయి. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉత్తీర్ణులై ఉద్యోగాలు సొంతం చేసుకున్న 15,500 మంది ఉపాధ్యాయులు సోమవారం

మిగతా 2వ పేజీలో...





గూగుల్-రైడెన్‌తో రేపు ఒప్పందం

2029 నాటికి విశాఖలో డేటా సెంటర్ పూర్తి

దేశంలోనే అతిపెద్ద డేటా హబ్‌గా విశాఖ

విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నాం

ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నాం

గత తప్పిదాలు పునరావృతం కానివ్వను

పాలనతో పాటు రాజకీయమూ చేస్తున్నా: సీఎం

నకిలీ మద్యంపై సిట్!

త్వరలోనే కుట్ర బయటపడుతుంది: సీఎం

ఇది సాధారణంగా జరిగిన నేరం కాదు

నకిలీ గుట్టు తేల్చేలా ఎక్సైజ్ సురక్ష యాప్

ఈనెల 16 నుంచి అందుబాటులోకి

ప్రజారోగ్యమే నాకు ముఖ్యం

యాచకుల మరణాలనూ 'నకిలీ' ఖాతాలో వేస్తున్నారు

తప్పుడు ప్రచారం సహించం

సీఎం చంద్రబాబు హెచ్చరిక

'సిట్'లో ఏలూరు ఐజీ అశోక్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్

అమరావతి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించను న్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇది సాధారణంగా జరిగిన నేరం కాదని... భారీ కుట్ర ఉందని తెలిపారు. కుట్రదారులెవరో త్వరలోనే బయటపడుతుందని అన్నారు. ఇందులో దిగ్భ్రాంతికరమైన అంశాలు వెలుగు చూసే అవకాశముందని తెలిపారు. ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు 'ఎక్సైజ్ సురక్ష' పేరుతో కొత్త యాప్‌ను ఆవిష్కరిం చారు. మద్యం సీసాపై ఉన్న బార్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే ఆ సీసా ఉత్పత్తి నుంచి అమ్మకం వరకు అన్ని వివరాలు తెలుస్తాయని... కోడ్ స్కాన్ కాకపోతే అది నకిలీగా నిర్ధారణ అవుతుందని వివరిం చారు. ఈ యాప్ పనిచేసే తీరుపై ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. మరిన్ని వివరాలు చంద్రబాబు మాటల్లోనే...

గత ప్రభుత్వ పాపం...

నకిలీ మద్యం అనేది కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిన సమస్య. 2019-24 మధ్య నకిలీ మద్యం

మిగతా 9వ పేజీలో...

సీఎం చెబితే చేయాలంతే!

'కాదు' అన్నందుకే నాడు ఎల్వీపై జగన్ వేటు



చెప్పింది చేయకుంటే ఇక నేనెందుకని జగన్ అన్నారు

కోపంతోనే వీఆర్ఎస్ తీసుకున్నా

వెనక్కి తీసుకోవాలనుకున్నా కానీ చంద్రబాబు అంగీకరించలేదు!

అపాయింట్‌మెంట్ కోసం చాలా ప్రయత్నించా

సీఎం నాపై కోపంగా ఉన్నారట

జగన్‌కు మొకరిల్లలేదు..

నోటి దుర్వాసన వస్తుందనే మోకాళ్లపై కూర్చుని మాట్లాడా

ఆర్‌కేతో 'బిగ్ డిబేట్'లో రిటైర్డ్ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్

"ముఖ్యమంత్రే సర్వాధికారి.. ఆయన చెప్పినట్లు అధికారులు పనిచేయాల్సిందే! అలా చేయనందుకే నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎల్వీ సుబ్రహ్మణ్యంపై జగన్ వేటు వేశారు" అని స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ స్పష్టంచేశారు. సచివాలయంలో అన్ని ఫైళ్లకూ సీఎం ఆమోదం కచ్చితంగా ఉండా లన్నారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యంను నాడు సీఎంగా ఉన్న జగన్ ఎందుకు సాగనంపారనే రహస్యాన్ని బయటపెట్టారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ వేమూరి రాధాకృష్ణ ఆదివారం నిర్వహించిన 'బిగ్ డిబేట్'లో ప్రవీణ్ ప్రకాశ్ పాలుపంచుకున్నారు. కోపంతోనే స్వచ్ఛంద పదవీవిరమణ (వీఆర్ఎస్) దరఖాస్తు పెట్టుకున్నానని అంగీకరించారు. తర్వాత మళ్లీ వెనక్కి వద్దామనుకున్నా.. సీఎం చంద్రబాబు సమ్మతించలేదని చెప్పారు.

'బిగ్ డిబేట్' ముఖ్యాంశాలు...11లో..



సిఫీ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్. చిత్రంలో విశాఖ మేయర్ పీలా శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న తదితరులు

హైదరాబాద్‌కు దీటుగా విశాఖ

భాగ్యనగరంలో ఐటీ అభివృద్ధికి 30 ఏళ్లు

విశాఖను పదేళ్లలోనే ఆ స్థాయికి తీసుకెళ్తాం

'సిఫీ'ని ఏపీకి రప్పించడానికి ఎనిమిదేళ్లు: మంత్రి లోకేశ్

2047 నాటికి విశాఖలో ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల్లో సగం విశాఖలోనే

సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు భూమి పూజ చేసిన మంత్రి

విశాఖపట్నం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో హైదరాబాద్‌కు దీటుగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేశ్ అన్నారు. హైదరాబాద్‌లో ఐటీ అభివృద్ధికి 30ఏళ్లు పడితే విశాఖను పదేళ్లలోనే ఆ స్థాయికి తీసుకెళతామని ప్రకటించారు. విశాఖలో మొట్ట మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నం.3లో సిఫీ ఇన్ఫినిటీ స్పేసెస్ లిమిటెడ్‌కు ఏపీఐఐసీ కేటాయించిన 3.6 ఎకరాల స్థలంలో ఆదివారం భూమి పూజ

మిగతా 12వ పేజీలో...

4 జిల్లాలతో గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్: లోకేశ్



చౌక కాదు.. నాణ్యమైన వైద్యం కావాలి

అవసరమైతే అదనంగా చెల్లిస్తాం

జవాబుదారీతనం, మంచి శ్రద్ధ ఉండాలి

దేశవ్యాప్తంగా 90% రోగుల అభిప్రాయం

నాణ్యత ధ్రువీకరణ పొందిన ఆస్పత్రులు 10% లోపే.. ల్యాబ్‌లైతే 2% లోపే!

తొలిదశలో రోగాల గుర్తింపులో వెనకడుగే

ఫిక్కీ-ఈవై పార్థెనాన్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే తూతూమంత్రపు వైద్యం కాదు.. నాణ్యమైన, జవాబుదారీతనంతో కూడిన వైద్యం కావాలి.. వైద్య సేవల్లో పారదర్శకత, ప్రామాణికత పెరగాలి.. అవసరమైతే ఇందుకోసం కాస్త ఎక్కువ సొమ్ము చెల్లించేందుకు కూడా సిద్ధం.. ఇది మన దేశంలోని 90శాతం పేషెంట్లు వ్యక్తం చేస్తున్న అభిప్రాయం. ఫిక్కీ, (భారత వాణిజ్య, పరిశ్రమల ఫెడరేషన్)ఈవై-పార్థెనాన్ సంస్థలు తాజాగా 'ట్రూ అకౌంటబుల్ కేర్: మాక్సిమైజింగ్ హెల్త్‌కేర్ డెలివరీ ఇంపాక్ట్ ఎఫిషియెంట్లీ' పేరిట విడుదల చేసిన అధ్యయన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఎవరో చెప్పారనో, తక్కువ

మిగతా 11వ పేజీలో...

ఈతకెళ్లి మృత్యు ఒడికి!

బాపట్ల జిల్లా వాడరేవు తీరంలో విషాదం

అలల తాకిడికి కొట్టుకుపోయి ముగ్గురు మృతి

మృతులు అమరావతి 'విట్' విద్యార్థులు 9

అక్కడే మరో ఘటనలో ఇంకో ఇద్దరు గల్లంతు

మోదీకి ట్రంప్ ఆహ్వానం

'గాజా శాంతి' సమావేశానికి రావాలని పిలుపు

ఈజిప్టు అధ్యక్షుడు అల్-సిసి నుంచీ ఆహ్వానం

నేడు 20కి పైగా దేశాధినేతల సమక్షంలో ఒప్పందం

భారత్ తరపున కేంద్ర మంత్రి కేవీ సింగ్ ప్రాతినిధ్యం





న్యూఢిల్లీ, అక్టోబరు 12: ఈజిప్టులో సోమవారం జరగనున్న గాజా శాంతి ఒప్పంద కార్యక్రమానికి హాజరు కావాలని ప్రధాని మోదీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి ఆహ్వానించారు. కార్యక్రమానికి చివరి నిమిషంలో శనివారం మోదీకి ఆహ్వానం అందిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే గాజా స్ట్రిప్‌లో యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో భారత్ తరపున విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పాల్గొంటారని వెల్లడించాయి. ఈజిప్టు అధ్యక్ష ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం.. ట్రంప్, అబ్దేల్ ఫత్తాహ్ అల్-సిసి అధ్యక్షతన 20కి పైగా దేశాల నాయకుల సమక్షంలో సోమవారం మధ్యాహ్నం షర్మ్-ఎల్ షేక్‌లో గాజా శాంతి ఒప్పందం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని మెలోనీ, స్పెయిన్ ప్రధాని సాంచెజ్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ తదితర నాయకులు హాజరు కానున్నారు.



కర్నూలు జిల్లా కోసిగి మండలం చింతకుంట గ్రామం నుంచి తెలంగాణలోని వికారాబాద్ జిల్లాకు వలస వెళ్తున్న కూలీలు, రైతులు

తరలివెళ్లిపోతున్న పల్లె జనం

కర్నూలు జిల్లాలో మొదలైన వలసలు

ఊళ్లను వదిలి వెళుతున్న రైతులు, కూలీలు

తెలంగాణ, గుంటూరులో పత్తితీత పనులు

పిల్లలను వెంట తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

పాఠశాలల్లో తగ్గిపోతున్న హాజరు

సాగునీటి ప్రాజెక్టులతోనే వలసలకు అడ్డుకట్ట!

ధర లేక ఉల్లి కన్నీళ్లు పెట్టించింది. వర్షాలకు తెల్లబంగారం (పత్తి) నల్లబారింది. అధిక వడ్డీలకు అప్పు తెచ్చి సాగు కోసం పెట్టిన పెట్టుబడి మట్టిపాలైంది. ఊళ్లో పనుల్లేవు.. కుటుంబ పోషణకు దారిలేదు. పొట్టకూటి కోసం పల్లె జనం వలస బాట పడుతున్నారు. పదుల సంఖ్యలో ఊళ్లు ఖాళీ అవుతున్నాయి. వందల సంఖ్యలో కుటుంబాలు తరలివెళ్లిపోతున్నాయి. జనంలేక పల్లెసీమలు బోసిపోతున్నాయి. ఇళ్లకు తాళాలు దర్శనమిస్తున్నాయి. ఇదీ కర్నూలు జిల్లాలోని గ్రామాల ప్రస్తుత పరిస్థితి.



మొన్నటిదాకా నలుగురికి పనులు కల్పించిన రైతు దంపతులు యల్లప్ప, పద్మ. ఇప్పుడు ఉపాధి వెతుక్కుంటూ తెలంగాణకు వలస వెళ్తున్న దృశ్యం

(కర్నూలు- ఆంధ్రజ్యోతి)

అది కర్నూలు జిల్లా కోసిగి మండలం చింతకుంట గ్రామం. ఆ గ్రామం నుంచి ఒక్కరోజే రెండు వందలకు పైగా కుటుంబాలు వలస వెళ్లిపోయాయి. వలస వెళ్లిన వారిలో 25 మంది విద్యార్థులు కూడా ఉన్నారు. కర్నూలు జిల్లాలో వలసలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. చింతకుంటతో పాటు.. కోసిగి, దుద్ది, చిన్నభూంపల్లి, దొడ్డి బెళగల్, అర్లబండ, సజ్జలగుడ్డం, వందగల్లు, జంపాపురం, దొడ్డి, పల్లెపాడు తదితర గ్రామాల నుంచి పల్లె జనం వలస వెళ్లారు. ఒక్కో గ్రామంలో కనీసం

మిగతా 12వ పేజీలో...

58 మంది పాక్ సైనికులను చంపాం

20 పాక్ ఆర్మీ పోస్టులను ధ్వంసం చేశాం.. వైమానిక దాడులకు ప్రతీకారంగానేనని ప్రకటించిన తాలిబన్లు

పాక్-అఫ్గాన్ సరిహద్దుల్లో దాడులు, ప్రతిదాడులతో ఉద్రిక్తత

200 మంది తాలిబన్ సైనికులను హతమార్చామన్న పాక్

సంయమనం పాటించాలని ఖతార్, సౌదీ, ఇరాన్ సూచన

అఫ్గాన్ మంత్రి ప్రెస్‌మీట్‌లో మహిళా జర్నలిస్టులు!

తాజాగా ఆహ్వానించి విలేకరుల సమావేశం నిర్వహణ

2

మొన్న జరిగినది 'ఉద్దేశపూర్వకం' కాదని వివరణ

బీజేపీ, జేడీయూలకు చెరి నూటొక్క సీట్లు

చిరాగ్ పాసవాన్ పార్టీకి 29.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ సీట్ల కేటాయింపులు పూర్తి



న్యూఢిల్లీ, అక్టోబరు 12: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్‌డీఏ కూటమిలో సీట్ల సర్దుబాటు ఆదివారం ఖరారయింది. మొత్తం 243 స్థానాలకుగానూ ప్రధాన పార్టీలైన జేడీయూ, బీజేపీ చెరి 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ ఆధ్వర్యంలోని లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) 29 సీట్లలో, మరో కేంద్ర మంత్రి జితన్ రాం మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ ఆవాం మోర్చా (సెక్యులర్) ఆరు చోట్ల, ఇంకో కేంద్ర మంత్రి ఉపేంద్ర కుశ్వాహకు చెందిన రాష్ట్రీయ లోక్‌మోర్చా ఆరు స్థానాల్లో పోటీ

మిగతా 2వ పేజీలో...

కర్రెగుట్టల్లో కమాండో ట్రైనింగ్ స్కూల్!

సీఆర్‌పీఎఫ్ యోచన

సరైన ప్రదేశం కోసం కొనసాగుతున్న సర్వే

న్యూఢిల్లీ/బీజాపూర్, అక్టోబరు 12: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో కమాండో ట్రైనింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేసే దిశగా కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ప్రణాళికలు రచిస్తోంది. నక్సల్స్‌కు వ్యతిరేకంగా కర్రెగుట్టలు కేంద్రంగా జరిగిన ఆపరేషన్‌లో గత ఏప్రిల్, మే నెలల్లో 31 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భాగంగా కొన్నేళ్లు మావోయిస్టులు స్థావరంగా మార్చుకున్న కర్రె గుట్టలను బలగాలు జల్లెడపట్టారు. సీఆర్‌పీఎఫ్, కోబ్రా యూనిట్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు కర్రెగుట్టల్లో చేపట్టిన 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'లో భాగంగా భారీ స్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు మావోయిస్టులపై జరిగిన అతిపెద్ద ఆపరేషన్ ఇదే. 2026 మార్చి నాటికి దేశంలో వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలకాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. దాదాపు 60 కిలో మీటర్ల పొడవు, 5-20 కిలో మీటర్ల వెడల్పుతో విస్తరించిన ఈ ప్రాంతంలో గుహలు, బంకర్లు వెలుగుచూశాయి. ఈ గుట్టలపై వివిధ రకాల జంతువులు, కీటకాలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కమాండో ట్రైనింగ్ స్కూల్‌కు అనుకూలమైన ప్రదేశాన్ని గుర్తించేందుకు సర్వే జరుగుతోందని అధికారిక వర్గాలు పీటీఐకి తెలిపాయి. ఒక ప్రాంతంపై విజయం ప్రకటించిన తర్వాత భద్రతా బలగాల ద్వారా ఆ ప్రాంతాన్ని స్వాధీనంలోకి తీసుకోవాల్సి ఉంటుందని, లేదంటే ఆయా వర్గాలు మళ్లీ సంఘటితమయ్యే అవకాశం ఉంటుందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. కమాండోలకు శిక్షణ ఇచ్చేందుకు కర్రెగుట్టల్లో శాశ్వత కేంద్రాన్ని స్థాపించడానికి గాను పారామిలటరీ దళం, ఛత్తీస్‌గఢ్ పోలీస్ నుంచి ఓ అధికారుల బృందం లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల అంశాలను పరిశీలిస్తోందని మరో అధికారి తెలిపారు.

'ఆమ్కా' జెట్‌ల రేసులో..
హైదరాబాదీ సంస్థతో అదానీ జట్టు!

» ఎంటార్ టెక్నాలజీస్‌తో కలసి కన్సార్షియం?

హైదరాబాద్, అక్టోబరు 12: దేశీయంగా అభివృద్ధి చేయనున్న ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్)' ప్రొటోటైప్ తయారీ రేసులో హైదరాబాదీ సంస్థ కూడా భాగస్వామ్యం అవుతోంది. ఆమ్కా ప్రొటోటైప్ కాంట్రాక్టును దక్కించుకునేందుకు అదానీ గ్రూపులోని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ తాజాగా హైదరాబాద్‌కు చెందిన 'ఎంటార్ టెక్నాలజీస్' సంస్థతో జట్టుకట్టినట్టు తెలిసింది. విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ బిజినెస్ స్టాండర్డ్ దీనిపై కథనాన్ని ప్రచురించింది. ప్రెసిషన్ ఇంజనీరింగ్ (కీలకమైన పరికరాలు, విడిభాగాలను ఎలాంటి లోపాలు లేకుండా అత్యంత కచ్చితత్వంతో తయారు చేయడం)లో ఎంటార్ టెక్నాలజీస్ సంస్థకు మంచి గుర్తింపు ఉంది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్, ఇస్రో, డీఆర్‌డీవో తదితర సంస్థలకు ఎన్నో సంస్థలు ఎంటార్ టెక్నాలజీస్ కస్టమర్లుగా ఉన్నాయి. చంద్రయాన్-2, మంగళ్‌యాన్ మిషన్లకు అవసరమైన ఎలక్ట్రో న్యూమాటిక్ వ్యవస్థలను ఈ సంస్థే సరఫరా చేసింది.

లోకం తీరు



యువత.. పాతికేళ్ల భవిత కోరుతున్నారు

» ఉచితాలు, పథకాలు కాదు!.. పవన్ కల్యాణ్ సంచలన ట్వీట్



అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం చేసిన ట్వీట్ సంచలనం రేపుతోంది. ఏపీ యువత పాతికేళ్ల భవిష్యత్ కోరుతున్నారని.. ఉచితాలు, సంక్షేమ పథకాలు కాదని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. 2018 అక్టోబరు 12న పవన్ ఉత్తరాంధ్ర పర్యటనలో కొందరు యువకులతో భేటీ నిర్వహించి చర్చలు జరిపారు. అప్పటి ఫొటోను పౌరసరఫరాల మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తాజాగా పోస్టుచేశారు. దానిని పవన్ ట్యాగ్ చేస్తూ.. 'ఏపీలో యువత సంక్షేమ పథకాలు, ఉచితాలు అడగడం లేదు. పాతికేళ్ల భవిష్యత్‌ను అడుగుతున్నారు. అందుకే తరచూ వారిని కలుస్తూ వారి కలలను నిజం చేసేందుకు కృషిచేస్తున్నా' అని ట్వీట్ చేశారు. ఇది సర్వత్రా చర్చకు దారితీసింది.

ప్రభుత్వ బడికి మళ్లీ కళ

(మొదట పేజీ తరువాయి)

వారికి కేటాయించిన స్కూళ్లలో విధులకు హాజరుకానున్నారు. పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసింది. మెగా డీఎస్సీలో ప్రకటించిన 16,347 పోస్టుల్లో 13,192 పోస్టులు పాఠశాల విద్యాశాఖ పరిధిలోనే ఉన్నాయి. జిల్లా, మండల పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, మోడల్ స్కూల్స్ సహా పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉన్న పలు మేనేజ్‌మెంట్లలో ఈ పోస్టులు ఉన్నాయి. మొత్తం 13,089 మంది కొత్త టీచర్లకు పాఠశాల విద్యాశాఖ పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చింది.

కొరత తీరింది!

స్కూళ్ల వారీగా కొత్త టీచర్లు	
మోడల్ విద్యాలయాలు	278
జిల్లా, మండల పరిషత్	9,281
ప్రభుత్వ పాఠశాలలు	2,096
మున్సిపల్ స్కూళ్లు	726
కార్పొరేషన్ పాఠశాలలు	708

చాలా కాలంగా పాఠశాల విద్యాశాఖను టీచర్ల కొరత వేధిస్తోంది. ప్రతి పాఠశాలలో ఏదో ఒక సబ్జెక్టులో ఉపాధ్యాయులు లేరనే మాట వినిపించేది. అందులోనూ వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయకపోవడంతో ఈ సమస్య మరింత పెరిగింది. ఈ క్రమంలో తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం అధికారం చేపట్టగానే మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారు. దీనికి అనుగుణంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ప్రకటించి, 150 రోజుల్లోనే ప్రక్రియ పూర్తిచేసి ఫలితాలు ప్రకటించారు. 15,941 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దీంతో దాదాపుగా పాఠశాలల్లో టీచర్ల కొరత తీరింది. గతంలో ఎప్పుడు టీచర్ల బదిలీలు జరిగినా టీచర్ల కొరత కారణంగా ప్రతి పాఠశాలల్లో కొన్ని పోస్టులు బ్లాక్ చేసేవారు. కానీ, ఈ ఏడాది చేపట్టిన బదిలీల్లో బ్లాకింగ్ విధానం తొలగించారు. దీంతో ఇప్పటికే చాలా పాఠశాలల్లో వంద శాతం టీచర్లు ఉన్నారు. మిగిలిన పాఠశాలల్లో మెగా డీఎస్సీ టీచర్లతో ఖాళీలు భర్తీ చేశారు. మెగా డీఎస్సీలో భర్తీ కాని 406, ఇటీవల జరిగిన పదవీ విరమణలతో ఏర్పడిన ఖాళీలు మినహా అన్ని పోస్టుల భర్తీ పూర్తయింది.

తరగతికి ఒక టీచర్: ప్రస్తుత ప్రభుత్వ పాఠశాల విద్యలో పలు సంస్కరణలు తెచ్చింది. దీనిలో మోడల్ ప్రైమరీ పాఠశాలల విధానం కీలకం. 60 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు చేశారు. ఇలా సుమారు 9,600 ప్రాథమిక పాఠశాలలు మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్పు చెందాయి. వాటిలో ప్రతి తరగతికీ ఒక టీచర్‌ను కేటాయించారు. ఆ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టు కూడా ఇచ్చారు. దీంతో మోడల్ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. కొన్ని దశాబ్దాల కిందట ఉన్నట్టుగా ప్రతి తరగతికీ ఒక టీచర్‌ను కేటాయించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ స్కూళ్లకు పంపేందుకు ఆసక్తి చూపుతున్నారు.

3వ తరగతి నుంచే ఏఐ పాఠాలు

హైదరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో సీబీఎస్ఈ విద్యార్థులు ఇకపై మూడో తరగతి నుంచే 'కృత్రిమ మేధ (ఏఐ)' పాఠాలు నేర్చుకోనున్నారు. సుమారు 31వేల పాఠశాలల్లో 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి రానుంది. ఏఐ సాయంతో భాషా నైపుణ్యాలు, గణితం, చాట్‌బాట్ ప్రాంప్ట్‌లు, లాంగ్వేజ్ మోడల్స్, జనరేటివ్ ఏఐ వంటి ప్రాథమిక అంశాలను బోధించనున్నారు. చిన్న వయసులోనే టెక్నాలజీ పట్ల అవగాహన పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. 3వ తరగతి నుంచి ఏఐ ప్రాథమిక అంశాల బోధన ఉంటుందని, 6వ తరగతి నుంచి ఏఐ స్కిల్ సబ్జెక్టుగా కొనసాగుతుందని తెలిపారు.

దేశంలో ఏకోపాధ్యాయ బడులు 1,04,125

» ఏపీలో అత్యధికంగా 12,912.. తెలంగాణలో 5,001

న్యూఢిల్లీ, అక్టోబరు 12: దేశంలో లక్షకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా, ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో ఎక్కువగా ఉన్నాయి. కేంద్ర గణాంకాల ప్రకారం 2024-25లో దేశవ్యాప్తంగా మొత్తం 1,04,125 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. సగటున ఒక్కో బడిలో 34మంది చొప్పున వీటిలో మొత్తం 33,76,769 మంది విద్యార్థులున్నారు. ఏపీలో అత్యధికంగా 12,912, తెలంగాణలో 5,001 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, లద్దాఖ్, దాద్రా-నగర్ హవేలి, డామన్-డయ్యూ, చండీగఢ్‌లో ఒక్కటీ లేవు. విద్యాహక్కు చట్టంప్రకారం విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి ప్రాథమిక స్థాయిలో(1 నుంచి 5 తరగతులు) 30:1, ఉన్నత ప్రాథమిక స్థాయిలో (6 నుంచి 8 తరగతులు) 35:1 ఉండాలి.

జగన్ పత్రికపై కేసు

» ఎడిటర్, ప్రచురణకర్తలపై నెల్లూరు జిల్లాలో నమోదు

» కల్తీ మద్యానికి నలుగురు బలి కథనంపై స్పందించిన ఎక్సైజ్

నెల్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జగన్ పత్రికలో ఈ నెల 8న నకిలీ మద్యానికి నలుగురు బలి అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఎక్సైజ్ శాఖ తీవ్రంగా స్పందించింది. తమ శాఖ పరువుకు భంగం కలిగించేలా తప్పుడు వార్త రాశారని సాక్షి ఎడిటర్, ప్రచురణ కర్తలు, నెల్లూరు జిల్లా విలేకరులపై నెల్లూరు రూరల్, కలిగిరి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రచురించిన కథనానికి సంబంధించి ఆధారాలతో సోమవారం విచారణకు హాజరు కావాలని నెల్లూరు రూరల్, కలిగిరి పోలీసులు.. జగన్ పత్రిక ఎడిటర్, ప్రచురణ కర్తలు, నెల్లూరు జిల్లా విలేకరులకు నోటీసులు జారీ చేశారు. చనిపోయిన నలుగురిలో నెల్లూరు రూరల్, కలిగిరిలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు ఆ కథనంలో పేర్కొన్నారు. అయితే ఈ వార్త పూర్తిగా అవాస్తవమని, ఎక్సైజ్ శాఖ పరువు, ప్రతిష్ఠ దెబ్బతీయాలనే ఉద్దేశంతో రాసిన తప్పుడు కథనమని ఎక్సైజ్ అధికారులు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు. నెల్లూరు ఎక్సైజ్ సీఐ రమేశ్‌బాబు, కలిగిరి ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్‌లు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

బీజేపీ, జేడీయూలకు చెరి నూటొక్క సీట్లు

(మొదటి పేజీ తరువాయి)



చేయనున్నాయి. సీట్ల పంపకం ఖరారయినట్టు కేంద్ర మంత్రి, బీజేపీ బిహార్ ఇన్‌ఛార్జి ధర్మేంద్ర ప్రధాన్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్న బీజేపీ సెంట్రల్ కమిటీ సమావేశంలో సీట్ల సర్దుబాటుకు ఆమోదం లభించిందని తెలిపారు. బీజేపీ కన్నా జేడీయూ ఎక్కువ సీట్లలో పోటీ చేయకుండా ఉండడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. బీజేపీ కన్నా జేడీయూ కనీసం ఒక్క సీటులోనయినా అదనంగా అభ్యర్థిని నిలబెడుతుందని తొలుత ఊహాగానాలు వ్యాపించినా రెండు సరిసమాన స్థానాల్లో పోటీ చేయనుండడం విశేషం. గత ఎన్నికల్లో జేడీయూ 115 సీట్లలో, బీజేపీ 110 స్థానాల్లో పోటీ చేశాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ కన్నా ఒక్కస్థానం అధికంగా ఉండేటట్టు సర్దుబాటు చేసుకుంది. ఇది జేడీయూ ప్రాబల్యం తగ్గుదలకు, బీజేపీ ప్రాధాన్యం పెరుగుదలకు సూచిక అని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. చిరాగ్, మాంఝీ, కుశ్వాహాలు మరిన్ని సీట్ల కోసం గట్టిగా బేరసారాలు చేసినప్పటికీ పెద్దగా ఫలించలేదు. చివరకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారని దేవేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

నేడు మహా కూటమి చర్చలు

సీట్ల పంపకాలపై మహాగట్‌బంధన్ భాగస్వామ్య పార్టీల మధ్య సోమవారం చర్చలు జరిపే అవకాశం ఉంది. కోర్టులో జరిగే విచారణకు హాజరయ్యే నిమిత్తం ఆర్జేడీ నాయకులు లాలు ప్రసాద్, తేజస్వీ యాదవ్‌లు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా సీట్ల సర్దుబాటుపై కూడా చర్చలు జరిగే అవకాశాలు ఉన్నట్టు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 స్థానాలు కేటాయించగా కేవలం 19 సీట్లలోనే గెలిచింది. అందువల్ల ఈసారి ఆ పార్టీకి సీట్లు తగ్గిస్తారని, 50కి మించకపోవచ్చన్న అంచనాలు ఉన్నాయి. గత రెండు రోజులుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా వివిధ పార్టీలతో చర్చలు జరుపుతున్నారు. మహాకూటమిలో కొత్త పార్టీలు చేరాయని, వాటికి సీట్లు ఇవ్వాల్సి ఉన్నందున చర్చల్లో జాప్యం జరుగుతున్నట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ చెప్పారు. అభ్యర్థుల పేర్లతో పాటు, ఉమ్మడి ఎలక్షన్ మేనిఫెస్టోను కూడా ఈ వారంలోనే ప్రకటించే అవకాశం ఉంది.

తేజస్వి యాదవ్‌ను ఎక్స్‌లో అన్‌ఫాలో అయిన తేజ్ ప్రతాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు, ఆ పార్టీ బహిష్కృత నేత తేజ్ ప్రతాప్ యాదవ్.. తన తమ్ముడు తేజస్వి యాదవ్‌ను ఎక్స్‌లో అన్‌ఫాలో అయ్యారు. ఇప్పటికే తన అక్కలు మీసా యాదవ్, హేమా యాదవ్‌లను అన్‌ఫాలో చేశారు. తేజ్ ప్రతాప్ యాదవ్ ఓ మహిళతో ఎప్పటి నుంచో రిలేషన్‌షిప్‌లో ఉన్నానని పోస్ట్ చేయడం ఇటీవల వివాదాస్పదమైంది. పార్టీ నైతిక విలువలు ఉల్లంఘించినందుకు ఆయన్ను పార్టీ, కుటుంబం నుంచి బహిష్కరిస్తున్నట్లు లాలూ ప్రసాద్ యాదవ్ ప్రకటించారు. ఆర్జేడీ నుంచి సస్పెన్షన్‌కు గురైన తేజ్ ప్రతాప్ కొత్తగా జనశక్తి జనతాదళ్(జేజేడీ) పార్టీని ప్రారంభించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాను మహువా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నానని, తమ పార్టీ అభ్యర్థుల జాబితాను అక్టోబర్ 13న ప్రకటిస్తానని చెప్పారు. తేజ్ ప్రతాప్‌కు గతంలో బిహార్ మాజీ సీఎం దరోగా రాయ్ మనవరాలు ఐశ్వర్యతో వివాహమైంది. ఆ తర్వాత వీరిద్దరి మధ్య విభేదాలు రావడంతో విడిపోయారు. ప్రస్తుతం వీరి విడాకుల కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది.

నోబెల్ శాంతి బహుమతి సమాచారం లీక్!

న్యూఢిల్లీ, అక్టోబరు 12: ఇటీవల వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి ప్రకటన సమాచారం అంతకుముందే లీక్ అయిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. దీని వెనుక గూఢచర్యం ఉండొచ్చని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ అనుమానిస్తోంది. మరియా మచాడో ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి విజేతగా ఎంపికయ్యే అవకాశాలు బెట్టింగ్ ప్లాట్‌ఫాం 'పాలిమార్కెట్'లో రాత్రికి రాత్రే 3.75 శాతం నుంచి 73 శాతానికి పెరిగిందని ప్రముఖ వార్తా సంస్థ ఏఎఫ్‌పీ పేర్కొంది. మచాడోను ఈ ఏడాది విన్నర్‌గా నోబెల్ కమిటీ ఓస్లోలో అధికారికంగా ప్రకటించడానికి కొద్ది గంటల ముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. నిపుణులు, మీడియా సంస్థల అంచనాల్లోనూ మరియా మచాడో పేరు ప్రముఖంగా వినిపించకపోవడం అత్యంత రహస్య సమాచారం లీకైందనే అనుమానాలను బలం చేకూరుస్తోంది. నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, నోబెల్ కమిటీ కార్యదర్శి క్రిస్టియన్ బెర్గ్ హార్ప్‌వికెన్ నార్వేకు చెందిన టీవీ2 టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఇది గూఢచర్యం అయ్యే అవకాశం ఉంది' అని వ్యాఖ్యానించినట్లు వార్తా సంస్థ పేర్కొంది. ఈ వ్యవహారంపై నోబెల్ ఇన్‌స్టిట్యూట్ పరిశీలిస్తుందని, అవసరమైన చోట భద్రతను కట్టుదిట్టం చేస్తామని చెప్పారు.

బీఎస్‌ఎఫ్‌లో తొలి మహిళా ఫ్లైట్ ఇంజనీరుగా భావనా చౌదరి



న్యూఢిల్లీ, అక్టోబరు 12: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో తొలి మహిళా ఫ్లైట్ ఇంజనీరుగా ఇన్‌స్పెక్టర్ భావనా చౌదరి నియమితులయ్యారు. బీఎస్ఎఫ్‌లో విమాన విభాగం 1969లో ఏర్పాటు కాగా, ఇంజనీరు పదవిలో మహిళను నియమించడం ఇదే ప్రథమం. నలుగురు పురుషులతో పాటు శిక్షణ పొందిన భావనకు ఇటీవలే బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి ఫ్లయింగ్ బ్యాడ్జెస్‌ను అందజేశారు.

బాధితురాలు కాలేజీ బయటకు..
అర్ధరాత్రి ఎలా వెళ్లింది?

» వైద్యవిద్యార్థిని గ్యాంగ్‌రేప్ కేసులో పశ్చిమ బెంగాల్ సీఎం మమత

» నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు



కోల్‌కతా, అక్టోబరు 12 : పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్ ప్రాంతంలో వైద్య విద్యార్థిని గ్యాంగ్‌రేప్ ఘటనపై ఆ రాష్ట్ర సీఎం మమత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అయితే బాధితురాలు అర్ధరాత్రి 12.30 గంటలకు కాలేజీ బయటకు ఎలా వెళ్లిందని ప్రశ్నించారు. ఆమె అర్ధరాత్రి బయటకు ఎలా వెళ్లిందో మెడికల్ కాలేజీ నిర్వాహకులు సమాధానం చెప్పాలన్నారు. ప్రైవేటు వైద్య కళాశాలలు తమ విద్యార్థుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు బయటకు అనుమతించకూడదన్నారు. బయట రాష్ట్రాల నుంచి వచ్చిన వారు హాస్టల్ నిబంధనలు పాటించాలని, రాత్రిళ్లు బయటకు వెళ్లకూడదని సూచించారు. గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష తప్పదన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ మహిళలపై ఎన్నో నేరాలు జరిగాయని అవి కూడా ఖండించదగినవని చెప్పుకొచ్చారు. మణిపూర్‌లో ఇలాంటి ఘటనలు ఎన్నో అని.. అలాగే ఒడిశాలోనూ మహిళలపై ఎన్నో ఘోరాలు జరిగాయని ఆరోపించారు. అక్కడి ప్రభుత్వాలు వాటిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే, అనంతరం తన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో మీడియా తన వ్యాఖ్యలను వక్రీకరించిందని ఆరోపించారు. "మీరో ప్రశ్న వేస్తారు.. దానికి నేను సమాధానం ఇస్తాను.. మీరు దాన్ని వక్రీకరిస్తారు.. ఇలాంటి రాజకీయాలు చేయవద్దు.." అని మీడియాను ఉద్దేశించి అన్నారు. కాగా వైద్య విద్యార్థిని గ్యాంగ్‌రేప్ కేసులో నలుగురు వ్యక్తులను పశ్చిమ బెంగాల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరిలో ఒకరు షేక్ రియాజుద్దీన్, మరొకరు షేక్ ఫిర్దౌస్‌గా గుర్తించారు. కాగా ఒడిశా సీఎం మాఝి ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మమతను కోరారు.

ఆపరేషన్ బ్లూస్టార్.. తప్పుడు చర్య!

» తీవ్రవాదుల ఏరివేతకు అది సరైన మార్గం కాదు

» కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం వ్యాఖ్యలు



సిమ్లా, అక్టోబరు 12: కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం మాజీ ప్రధాని ఇందిరపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె హయాంలో పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయంలో చేపట్టిన ఆపరేషన్ బ్లూస్టార్‌ను తప్పుడు చర్యగా అభివర్ణించారు. 1984లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో దాక్కున్న ఖలిస్థానీ తీవ్రవాదులను బంధించేందుకు ఆపరేషన్ బ్లూస్టార్ పేరిట సైనిక చర్య చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, తీవ్రవాదులను ఏరిపారేసేందుకు అది సరైన మార్గం కాదని చిదంబరం అన్నారు. శనివారం హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలిలో జరిగిన 'దె విల్ షూట్ యు మేడం: మై లైఫ్ త్రూ కాన్‌ఫ్లిక్ట్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పుస్తక రచయిత హరీందర్ బవేజాతో జరిగిన సంభాషణలో ఈ వ్యాఖ్యలు చేశారు. "స్వర్ణ దేవాలయంలో నక్కిన తీవ్రవాదులను బంధించడానికి/ఏరివేతకు సరైన మార్గాలు ఉన్నాయి. కానీ, ఆపరేషన్ బ్లూస్టార్ పేరిట నిర్వహించిన సైనిక చర్య సరికాదు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు గాను ఇందిరా గాంధీ మూల్యం చెల్లించుకున్నారు. తన ప్రాణాలే కోల్పోయారు. కానీ, ఆపరేషన్ బ్లూస్టార్ అనేది సైన్యం, నిఘా విభాగం, పోలీస్, రక్షణ శాఖల సమష్టి నిర్ణయం. దానికి ఇందిరను ఒక్కరినే నిందించడం సరికాదు" అని కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి చిదంబరం పేర్కొన్నారు. "3-4 ఏళ్ల తర్వాత ఆపరేషన్ బ్లాక్ థండర్ పేరిట సైన్యాన్ని ఆలయం వెలుపలే ఉంచి సరైన మార్గంలో స్వర్ణ దేవాలయంలో దాక్కొని ఉన్న తీవ్రవాదులను ఏరిపారేశాం" అని చిదంబరం చెప్పారు. స్వర్ణ దేవాలయంలో దాక్కున్న జర్నైల్ సింగ్ బింద్రన్‌వాలే నేతృత్వంలోని సాయుధ తీవ్రవాదులను ఏరిపారేసేందుకు 1984 జూన్ 1-10 మధ్య ఆపరేషన్ బ్లూస్టార్ పేరిట సైనిక చర్య చేపట్టారు.

సీనియర్లు జాగ్రత్తగా మాట్లాడాలి

చిదంబరం వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సీనియర్ నేతలు బహిరంగ ప్రకటనలు చేసేముందు జాగ్రత్తగా ఉండాలని పేర్కొంది. పార్టీ నుంచి అన్ని రకాలుగా లబ్ధి పొందిన సీనియర్లు అప్రమత్తంగా మాట్లాడాలని అధిష్ఠానం పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ కట్టుకథలను బట్టబయలు చేశారు: బీజేపీ

ఆపరేషన్ బ్లూస్టార్‌పై కాంగ్రెస్ కట్టుకథల గుట్టురట్టయిందని బీజేపీ పేర్కొంది. చిదంబరం వ్యాఖ్యలతో ఈ విషయం తేటతెల్లమైందని తెలిపింది. ఆపరేషన్ బ్లూస్టార్ దేశం కోసం కాదని, రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారని ఆరోపించింది. కాంగ్రెస్ చేసిన ఘోర తప్పిదాలను చిదంబరం చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్‌లో పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీసింగ్ కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వాస్తవాలు కచ్చితంగా చరిత్రలో నమోదవుతాయన్నారు.

ఐపీఎస్ అధికారి ఆత్మహత్యలో కొత్తగా అట్రాసిటీ సెక్షన్

చండీగఢ్, అక్టోబరు 12: హరియాణా దళిత ఐపీఎస్ అధికారి వై పూరన్ కుమార్ ఆత్మహత్య కేసులో ఆయన భార్య, ఐఏఎస్ అధికారిణి అమనీత్ డిమాండ్‌తో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సెక్షన్ 3 (2) (వీ)ను చేర్చారు. ఈ సెక్షన్ కింద నిందితులకు పదేళ్లు, అంతకంటే ఎక్కువ జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ముందు ఈ చట్టంలోని 3(1) (ఆర్) కింద కేసు నమోదు చేశారు. అభియోగాలు రుజువైతే ఈ సెక్షన్ ఆరు నెలల నుంచి గరిష్ఠంగా ఐదేళ్లు మాత్రమే శిక్ష పడుతుంది. సీనియర్ ఐపీఎస్ అధికారుల కుల వివక్ష, అవమానాలు, వేధింపులు తట్టుకోలేక కుమార్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కుమార్ సూసైడ్ నోట్‌లో హరియాణా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహతక్ ఎస్పీ బిజార్డియా సహా 8 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు రాశారు. వారి వేధింపులే తన ఆత్మహత్యకు కారణమని పేర్కొన్నారు.

అఫ్గాన్ మంత్రి ప్రెస్‌మీట్‌లో మహిళా జర్నలిస్టులు!

తాజాగా ఆహ్వానించి విలేకరుల సమావేశం నిర్వహణ



న్యూఢిల్లీ, అక్టోబరు 12: విలేకరుల సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో అఫ్గాన్ విదేశాంగమంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. తాజాగా స్త్రీ, పురుష జర్నలిస్టులందరినీ ఆహ్వానించి ఆదివారం ఢిల్లీలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం నాటి విలేకరుల సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించకపోవడం ఉద్దేశపూర్వకంగా చేసినది కాదని, అది సాంకేతికంగా జరిగిందని వివరణ ఇచ్చారు. 'కొందరు నిర్దిష్ట జర్నలిస్టులతో ప్రెస్‌మీట్ నిర్వహించాలని మా రాయబార కార్యాలయ అధికారులు భావించారు. చాలా తక్కువ సమయం ఉండటం వల్లే కొద్ది మంది విలేకరులనే ఆహ్వానించాం. అది సాంకేతికంగా జరిగింది. అందులో ఉద్దేశపూర్వకం ఏమీ లేదు. మహిళలైనా, పురుషులైనా.. ఏ ఒక్కరి హక్కునూ నిరాకరించకూడదు' అని ముత్తాఖీ పేర్కొన్నారు. శుక్రవారం భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన ముత్తాఖీ అదే రోజు ఢిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆ సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించకపోవడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాగా, జైశంకర్‌తో తాను జరిపిన ద్వైపాక్షిక చర్చల గురించి తాజా విలేకరుల సమావేశంలో ముత్తాఖీ వివరించారు. అఫ్గానిస్థాన్‌లో నిలిచిపోయిన అభివృద్ధి ప్రాజెక్టులను పునఃప్రారంభించేందుకు ఇరుపక్షాలూ అంగీకరించినట్టు చెప్పారు. త్వరలో అఫ్గాన్ నుంచి దౌత్య బృందం ఢిల్లీకి రానుందని తెలిపారు. అలాగే, అమృత్‌సర్ నుంచి అఫ్గాన్‌కు త్వరలోనే విమానాలు నడవనున్నట్టు తెలిపారు.

భారత్-అఫ్గాన్ సంయుక్త ప్రకటనపై పాక్ భగ్గు


భారత్-అఫ్గానిస్థాన్ సంయుక్త ప్రకటనలోని అంశాలపై పాకిస్థాన్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇస్లామాబాద్‌లోని అఫ్గాన్ రాయబారికి తన అభ్యంతరాలను తెలియజేసింది. సంయుక్త ప్రకటనలో జమ్మూకశ్మీర్‌ను ప్రస్తావించడంపై పాకిస్థాన్ మండిపడింది. 'జమ్మూకశ్మీర్‌ను భారత భూభాగంగా పేర్కొనడం ఐరాస భద్రతామండలి తీర్మానాలను తీవ్రంగా ఉల్లంఘించడమే' అని పేర్కొంది. ఉగ్రవాదాన్ని పాక్ అంతర్భాగంగా ముత్తాఖీ పేర్కొనడాన్నీ తోసిపుచ్చింది.

పాక్-అఫ్గాన్ సరిహద్దు.. రణరంగం

» దాడి, ప్రతిదాడులతో తీవ్ర ఉద్రిక్తత

» 58 మంది పాక్ సైనికులను మట్టుబెట్టామన్న తాలిబన్లు

» 200 మంది తాలిబన్ సైనికులను హతమార్చామన్న పాక్



న్యూఢిల్లీ, అక్టోబరు 12: దాడి, ప్రతిదాడులతో పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దు ప్రాంతాలు అట్టుడుకుతున్నాయి. ఖైబర్ పఖ్తుంక్వా, బలోచిస్థాన్ సరిహద్దు వెంబడి శనివారం రాత్రి నుంచి జరుగుతున్న సైనిక చర్యల్లో తాము 58 మంది పాకిస్థానీ సైనికులను హతమార్చామని అఫ్గానిస్థాన్ ప్రకటించింది. 20 పాక్ ఆర్మీ పోస్టులను ధ్వంసం చేశామని కూడా వెల్లడించింది. ఈ నెల 9న తమ గడ్డపై పాక్ జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఈ దాడులకు పాల్పడినట్లు తాలిబన్ల ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తెలిపారు. పాకిస్థాన్‌లో ఉన్న ఐసిస్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించవద్దని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము 1893 బ్రిటీష్ కాలం నాటి డ్యూరాండ్ లైన్‌ను గుర్తించబోమని మరోసారి తేల్చి చెప్పారు. పాకిస్థాన్ కూడా తాము 200 మంది తాలిబన్లను మట్టుబెట్టామని, ఘర్షణలో తమ సైనికులు 23 మంది మృతిచెందారని అంగీకరించింది. 19 అఫ్గానిస్థాన్ మిలిటరీ పోస్టులను స్వాధీనం చేసుకున్నామని పాక్ ఆర్మీ తెలిపింది. అఫ్గన్ దాడులపై పాక్ అంతరిక మంత్రి మొహసిన్ నఖ్వీ స్పందించారు. ఇటుకలతో చేసే దాడులకు రాళ్లతో బదులిస్తామని తాలిబన్లను హెచ్చరించారు. కాగా, పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఘర్షణను నివారించాలని, రెండు దేశాలు సంయమనం పాటించాలని ఖతార్, సౌదీ అరేబియా, ఇరాన్ సూచించాయి. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరాయి. దీంతో తాము దాడులు ప్రస్తుతానికి ఆపేశామని భారత్‌లో పర్యటిస్తున్న అఫ్గన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీ తెలిపారు.



వాడపల్లి గురుకులంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి సవిత, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

గురుకుల పాఠశాలలను పెంచుతాం

» బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

కొవ్వూరు/రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో గురుకులాలు పెంచేవిధంగా నిర్ణయం తీసుకుంటామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను ఆదివారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలను అడిగితెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014-19లో 65 గురుకుల పాఠశాలలు టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిందని, మొత్తం 108 గురుకుల పాఠశాలలు తెలుగుదేశం ప్రభుత్వంలో వచ్చినవే అని తెలిపారు. కాగా, భవిష్యత్తులో పావలా వడ్డీకే విద్యారుణాలు ఇచ్చే యోచన కూటమి ప్రభుత్వం చేస్తోందని మంత్రి ఎస్.సవిత తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం రాత్రి 226 మంది శెట్టిబలిజ పదో తరగతి మెరిట్ విద్యార్థులకు గోద్రేజ్ సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి స్కాలర్‌షిప్స్ పంపిణీ చేసి మాట్లాడారు.

ఆర్టీఐ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలి: షర్మిల

అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ గద్దెనెక్కిననాటి నుంచి సమాచార హక్కు చట్టానికి సమాధి కట్టారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. సవరణ పేరుతో మేడిపండు చందంగా మార్చేశారని ఆదివారం ఒక ప్రకటనలో ఆమె ఆరోపించారు. ఓట్ల చోరీలాంటి దొంగ పనులు వెలుగులోకి రాకుండా ఆర్టీఐని కట్టడి చేశారని ఆక్షేపించారు. సామాన్య పౌరునికి పాశుపతాస్త్రంలాంటి సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వయం ప్రతిపత్తితో కూడిన స్వేచ్ఛాయుత సమాచార కమిషర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు.



హైవేపై నిలిచిపోయిన వాహనాలు

హైవే దిగ్బంధం

నక్కపల్లి వద్ద జాతీయరహదారిపై మత్స్యకారుల బైఠాయింపు

» వేడెక్కిన 'బల్క్‌డ్రగ్ పార్కు' ఉద్యమం

» నాలుగు గంటలకుపైగా స్తంభించిన ట్రాఫిక్

» 50 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

» కలెక్టర్, ఎస్పీ హామీలతో ఆందోళన విరమణ



జాతీయ రహదారిపై బైఠాయించిన మత్స్యకారులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా) అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ 29 రోజుల నుంచి ఆందోళన చేస్తున్న అనకాపల్లి జిల్లా రాజయ్యపేట మత్స్యకారులు తన ఉద్యమ పంథాను ఒక్కసారిగా మార్చుకున్నారు. హైకోర్టు అనుమతితో ఆదివారం రాజయ్యపేట రావాల్సిన బీసీవై నేత రామచంద్రయాదవ్‌ను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ నక్కపల్లి వద్ద జాతీయ రహదారికి చేరుకుని బైఠాయించారు. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లడానికి వీలుకాకుండా హైవేను దిగ్బంధించారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయవద్దని, అనుమతులు రద్దు చేయాలని, తమపట్ల దురుసుగా ప్రవర్తించిన అడ్డరోడ్డు సీఐ, నక్కపల్లి ఎస్ఐలను సస్పెండ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ వచ్చి, మత్స్యకారులతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. కానీ కలెక్టర్ వచ్చి తమకు సమాధానం చెప్పాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. సాయంత్రం 5.45 గంటలకు కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా నక్కపల్లి వచ్చారు. అప్పటికే ఇరువైలా... అటు అన్నవరం, ఇటు తాళ్లపాలెం వరకు సుమారు 50 కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. బల్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయవద్దని, తమ ఆందోళనకు మద్దతు ఇస్తున్న వారిని నిర్బంధించకూడదని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, తమపట్ల దురుసుగా ప్రవర్తించిన సీఐ, ఎస్ఐల చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ, ఇప్పటికే నాలుగు గంటల నుంచి జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడం వల్ల ప్రయాణికులు, చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళన విరమించాలని సూచించారు. పోలీసులపై విచారణ చేసి తప్పని తేలితే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బల్‌డ్రగ్ పార్కుపై 15వ తేదీన రాజయ్యపేట వచ్చి సమావేశం నిర్వహించి మాట్లాడతామని హామీ ఇచ్చారు. దీంతో ఆరు గంటల సమయంలో మత్స్యకారులు ఆందోళన విరమించారు.

కడప ఉల్లి ధర ధమాల్!

» తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కిలో రూ.5 నుంచి 10 మధ్యనే..

» గిట్టుబాటు ధర లేక రైతు విలవిల



తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కడప ఉల్లి

తాడేపల్లిగూడెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు ఉమ్మడి కడప జిల్లాల్లో సాగైన ఉల్లి పంట వస్తోంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని, నాణ్యత లేకపోవడంతో మంచి ధర పలకడం లేదు. కిలో ఉల్లిని రూ.5-10 మధ్యనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఇక్కడి మార్కెట్‌కు కర్నూలు, మహారాష్ట్ర నుంచి మాత్రమే ఉల్లి వచ్చేది. ఉమ్మడి కడపలోని రాయచోటి, ప్రొద్దుటూరు, కొమ్మర్తి, జమ్మలమడుగు పరసర ప్రాంతాల్లో విస్తారంగా ఉల్లి సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట దెబ్బతిని నాణ్యత లోపించింది. ఆదివారం ఆరు లారీల్లో సుమారు 95 టన్నుల ఉల్లి తాడేపల్లిగూడెం రాగా.. నాణ్యత లేక కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. క్వింటాల్ రూ.500 నుంచి రూ.1000 మధ్య మాత్రమే పలికింది. గిట్టుబాటుకాక రైతులు విలవిలలాడుతున్నారు. నాణ్యత లేకపోవడంతోనే మంచి ధర పలకడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఉల్లి క్వింటాల్ రూ.1200-1800 మధ్య హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో కురిసిన వర్షాలకు కర్నూలు ఉల్లి పాడైపోవడంతో అక్కడి రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ క్వింటాల్ రూ.1200కు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. వాటిని రైతుబజార్లు, చౌకదుకాణాల్లోనూ, హాస్టళ్లకు విక్రయించారు.

16నే 'ఈశాన్యం' రాక!

» నేడు కోస్తాలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి, ఈశాన్య రుతుపవనాల ప్రవేశానికి వాతావరణం అనుకూలంగా మారింది. దక్షిణాదిలో పలు రాష్ట్రాలు తప్ప దేశంలో అనేక ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా మారి పొడి వాతావరణం నెలకొంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తర, తూర్పు, ఈశాన్య, మధ్యభారతంతోపాటు తెలంగాణ వరకు నైరుతి రుతుపవనాలు నిష్క్రమించనున్నాయని వాతావరణ శాఖ ఆదివారం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీన దక్షిణాదిలోకి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనున్నాయని వాతావరణ నిపుణులు తమిళనాడు ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారు. దక్షిణ తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీంతో సోమవారం రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు, కోస్తాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

'బేటీ పడావో... బేటీ బచావో' ప్రచారార్భాటమే: పుణ్యవతి

అనంతపురం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తెచ్చిన బేటీ పడావో- బేటీ బచావో నినాదం ప్రచారార్భాటమేనని, ఎక్కడా ఆచరణకు నోచుకోలేదని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి విమర్శించారు. ఆదివారం అనంతపురం జిల్లా సీపీఎం కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు.

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'అ్రాసు' కథా సంపుటి

రాజీ కన్నా కథల సంపుటి 'అ్రాసు' ఆవిష్కరణ అక్టోబరు 14 సా.6గంటలకు మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. వక్తలు గోరటి వెంకన్న, అల్లం నారాయణ, పెద్దింటి అశోక్ కుమార్, పల్లవి కోయిల, అబ్దుల్ ఖాదర్.

బోధి ఫౌండేషన్

వేదగిరి రాంబాబు పురస్కారాలు

డాక్టర్ వేదగిరి రాంబాబు పురస్కారాల ప్రదానోత్సవం, 'మా కథలు 2024' ఆవిష్కరణ, సింహ ప్రసాద్ కథలు 'మనుగడ' ఆవిష్కరణ... ఈ కార్యక్రమాలు అక్టోబరు 14 ఉ.10 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. బాల సాహిత్య పురస్కారం పుల్లా రామాంజనేయులు, కథానిక పురస్కారం స్ఫూర్తి కందివనం స్వీకరిస్తారు. సభలో కె.వి. రమణాచారి, విహారి, సుధామ పాల్గొంటారు. వివరాలకు: 98490 61668.

సింహప్రసాద్ సాహిత్య సమితి

'అట్లనే' కవితా సంపుటి

అన్నవరం దేవేందర్ 'అట్లనే' కవితా సంపుటి ఆవిష్కరణ సభ అక్టోబరు 17 మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని డాక్టర్ కేతు విశ్వనాథ రెడ్డి హాల్‌లో జరుగుతుంది. వైస్ ఛాన్స్‌లర్ ఘంటా చక్రపాణి ఆవిష్కరిస్తారు. అతిథులుగా కె. శ్రీనివాస్, అల్లం నారాయణ, రజనీ నెల్లుట్ల పాల్గొంటారు.

జీవగడ్డ మిత్రులు

'మట్టిరంగు' కవితా సంపుటి

సి. భవానీదేవి కవితా సంపుటి 'మట్టిరంగు' ఆవిష్కరణ అక్టోబరు 19 సా.6గంటలకు హోటల్ గౌతమి (మొదటి అంతస్తు), జి.బి.సి. రోడ్, బాపట్లలో జరుగుతుంది. సభాధ్యక్షులు వెలుపోలు నాగరాజ్యలక్ష్మి; ముఖ్య అతిథి పాపినేని శివశంకర్; పుస్తక పరిచయం బీరం సుందర రావు; ఆత్మీయ అతిథులు పి.సి. సాయిబాబు, టి. శ్యామసుందర్.

ఆం.ప్ర. రచయితల సంఘం

విద్యార్థులకు పద్య పోటీలు

తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు జాతీయ స్థాయి తెలుగు శతక పద్య పోటీలు నిర్వహిస్తున్నాము. వందకు పైగా పద్యాలు చెప్పగలిగిన పిల్లలు అక్టోబరు 16 లోపు 95534 29770 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోగలరు.

తులసినాథం నాయుడు

సుద్దాల పురస్కారాల ప్రదానం

సుద్దాల జానకమ్మ హనుమంతు సాహితీ- జానపద- నృత్య పురస్కారాల ప్రదానోత్సవం అక్టోబరు 13 సా.6గం.లకు సుందరయ్య కళా నిలయం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. రచయిత్రి ఓల్గా, గాయని మధుప్రియ, నర్తకి లాలీ నిధి పురస్కారాలను స్వీకరిస్తారు. సభలో సూరేపల్లి నంద, హరిచందన దాసరి, ఎస్. రఘు, సుద్దాల సుధాకర్ తేజ, ఎస్ రెడ్డి రాంరెడ్డి, మడిమడకల నర్సిరెడ్డి తదితరులు పాల్గొంటారు.

సుద్దాల అశోక్‌తేజ

కవితా జీవనది జూకంటి



ప్రియురాలి మునివేళ్లు, తేనె తెట్టులో మకరందం, మల్లెపువ్వులో సువాసన దగ్గరే ఆగిపోకుండా పగిలిన వరిమడిని, వేపచెట్టుకు వేలాడుతున్న రైతు శవాన్ని, దగ్ధమవుతున్న అంటరాని పూరి గుడిసెను, ఒరిగిపోతున్న ఆదివాసీ వీరుడిని, కుతకుత ఉడుకుతున్న తెలంగాణ అస్తిత్వాన్ని, గ్లోబల్ ఖడ్గానికి మౌనంగా తెగిపడుతున్న మానవ సంబంధాలను అక్షరాలతో పుటం పెడుతున్న కవుల వరుసలో అపురూపమైన కవి జూకంటి జగన్నాథం.

ఆయన మౌనంగా ఉంటాడు, మెరుపుల ప్రపంచానికి దూరంగా ఉంటాడు, పల్లెను మోసుకు తిరుగుతాడు, మాయిముంత వాసనేస్తాడు, అల్పాక్షరాలలో వ్యక్తమవుతాడు. ఆయన సిరిసిల్ల, ఆయన జగిత్యాల, ఆయన మానేరు. ఆయనొక నిరంతరం ప్రవహించే కవితా జీవనది. ఏడు పదుల జూకంటి అర్ధశతాబ్దంగా కవిత్వమే జీవితంగా రాస్తున్నాడు.



జూకంటి జగన్నాథం దేశం స్వాతంత్ర్యం పొందిన తొలినాళ్లలో ఈ భూమి మీద పడ్డాడు. అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యాన్ని శాసిస్తున్న కాలంలో కష్టజీవికి ఇరువైపుల ఉన్నవాళ్లే కవులనే భావన విస్తారంగా వ్యాపించి ఉండింది. కానీ ఆ కవులే కలాన్ని దించి అంతర్ బహిర్ యుద్ధరవానికి విరామం ప్రకటించారు. ఆ కాలం లోనే అగ్నిగోళంలా మండుతున్న ప్రపంచంలో విస్మరణకు గురైన సమూహాల నుంచి అనేక ప్రశ్నలు ఉదయించాయి. భారత సమాజం ఈ క్రమానికి మినహాయింపు కాలేకపోయింది. నల్లమందు మింగి మత్తుగా ఉన్న కవి వర్యున్ని యువకవులు ప్రశ్నించారు. సామాన్యుని ఆర్తిని ఆకాశమంత ఎత్తుకు అరిచిన కాలంలో జూకంటి బాల్య దశను దాటి యవ్వన కాలాన్ని అందుకోవడానికి 'ఆకాశానికి నిచ్చెన' వేసాడు. ప్రగతి భావన ఆయన యవ్వన కాలపు స్వప్నాలను తట్టిలేపింది. సిరిసిల్ల సమీపం లోని సినారె ప్రభావం కంటే జగిత్యాల జైత్రయాత్ర మట్టి మనుషులే ఆయనను అమితంగా ఆకర్షించారు.

జూకంటి మాతామహుల ఇంటినుంచి సిరిసిల్లకు రావటం వలన అరుదైన కవిగా రూపొందడానికి మొదటి పునాది పడింది. సిరిసిల్ల ఆంధ్ర మహాసభల ద్వారా వెల్లివిరిసిన అక్షర చైతన్యం ఆ ప్రాంతాన్ని ఆవరించింది. పౌర గ్రంథాలయాలు ఏర్పడడానికి దారి దొరికింది. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అలంకారికుల భావనలు కావచ్చు కానీ అవి ఏ కవికైనా అబ్బవలసిన ప్రాథమిక నియమాలు. నిరంతర అధ్యయనమే మనిషిని సాన పడుతుందని చెప్పడానికి జూకంటియే నమూనా. సిరిసిల్ల పౌర గ్రంథాలయంలో దొరికిన ప్రతీ పుస్తకాన్ని తిరిగేసిన అనుభవమే ఆయనలోని వ్యుత్పత్తి వికాసానికి మూలం. పెద్దపల్లి, కరీంనగర్ పట్టణాలను తన జ్ఞానం, బోధన ద్వారా ప్రభావితం చేసిన నిజాం వెంకటేశంతో స్నేహం జూకంటిని మరో తలంలోకి తీసుకెళ్లింది. ఆయన పరిచయం చేసిన కమ్యూనిస్టు మేనిఫెస్టో జూకంటిలో అలజడిని రేపింది. అప్పటికే చదివివున్న పొట్లపల్లి రామారావు, వట్టికోట ఆళ్వారుస్వామి సాహిత్య దృక్పథం అర్థం కావడానికి మార్క్స్ తోడ్పడ్డాడు.

ఎమర్జెన్సీ కాలానికి జూకంటి రెండు పదుల్లోకి ప్రవేశించాడు. నిండు జవ్వనంబుతో కవిత్వాన్ని అల్లటం ప్రారంభించాడు. ఆ వయసులో సృజనకాలాన్ని కాంక్షించాడు. కానీ సంకెళ్లకాలం అంతర్ముఖున్ని చేసింది. అలాగని జూకంటి పలాయనవాది కాదు, ఆ కాలంలో పదునెక్కిన యవ్వనకలం. ఎమర్జెన్సీ, దళిత అస్తిత్వ వేదన, మండల్ కమీషన్ ఉద్యమం, ప్రపంచీకరణ, ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష ఇలా తన కాలపు జన సందోహాలన్నింటిని జూకంటి అక్షరబద్ధం చేసాడు. ఈ కవి చుట్టూ నిండైన సామాజిక చలనాలు రూపొందాయి. ఈ యాభై ఏళ్ల కాలానికి ఆయనొక కాపలాదారుగా ఉన్నాడు.

ప్రతి కవి కవిత్వానికొక డిక్షన్ ఉంటుంది. మెటఫర్ ఉంటుంది. అలాంటి తనదైన ముద్రతో తెలుగు కవిత్వంలోకి జూకంటి ప్రవేశించాడు. వాస్కోడిగామా డాట్ కామ్‌ను గ్లోబలైజేషన్ తొలి రోజుల్లోనే కవిత్వం చేసిన క్రాంతదర్శి ఆయన. ఏలిక అనుకుంటే ఏదైనా జరగవచ్చును, అది రాజపత్రంగా రూపొందుతుంది. రాజ్యాలు లేని రోజుల్లో రాజదర్పం, రాజపత్రం ఉండటమే వింతల్లోకెల్లా వింతగా కవి భావించాడు. 'ఊళ్లకూళ్లు కూలగొట్టి కడుపులు కాలబెట్టిన రాజపత్రం గురించిన చిలక రహస్యాన్ని కవి చెప్పగలడు. రాజ్యం అణచివేత సాధనం, రాజకీయార్థశాస్త్రం తెలిసిన వారందరికి అర్థమయ్యే పెట్టుబడి సత్యాన్ని ఎన్నిసార్లు ఆవిష్కరించినా ఆయన కవిత్వంలో కొత్తగానే వ్యక్తమవుతుంది. అది కవి ప్రతిభ ద్వారా వ్యక్తమైన శిల్పనైపుణ్యం. దోపిడీ విశ్వమంతా వ్యాపించి ఉంది. నిరసన కూడా ఎల్లలు దాటింది. ఈ చారిత్రక విభాత సంధ్యను జూకంటి దర్శించిన తీరు తాజాగా ఉంటుంది. సముద్రం మౌనంగా ఉందని మనం అనుకునేలోపు అదొక ఝంఝ మారుతంలా చుట్టేస్తుందనే ప్రమాద హెచ్చరికను ఈ కవి చేయగలడు. అగ్నిపర్వతం మీది నుంచి కవితాగానం సంధించగలడు. జీవితం లోతుల్లోకి వెళ్లి పాతాళ గరిగెతో సమస్త దుఃఖాన్ని తవ్వితీసి ఒడ్డుకు వేసే పనిలో ఆయన నిమగ్నమయ్యాడు.

> **ఆయన మౌనంగా ఉంటాడు, మెరుపుల ప్రపంచానికి దూరంగా ఉంటాడు, పల్లెను మోసుకు తిరుగుతాడు, మాయిముంత వాసనేస్తాడు, అల్పాక్షరాలలో వ్యక్తమవుతాడు. ఆయన సిరిసిల్ల, ఆయన జగిత్యాల, ఆయన మానేరు. ఆయనొక నిరంతరం ప్రవహించే కవితా జీవనది. ఏడు పదుల జూకంటి అర్ధశతాబ్దంగా కవిత్వమే జీవితంగా రాస్తున్నాడు.**

గ్లోబల్ దృశ్యాన్ని ఎప్పటికప్పుడు అక్షరబద్ధం చేస్తాడు జూకంటి. పరుగెత్తుతున్న కాలాన్ని అంతే వేగంగా అందుకుంటాడు. అందుకే ఆయన కవితా నవయవ్వనుడు. "కిటికీలు దర్వాజలు తీసుకుపోగా/ దూలానికి వేలాడిన గుక్కపట్టిన ఉయ్యాల/ కన్నీటి జోలపాటకు తల ఊగుతుంది" వర్తమానంలో నిర్వాసితుల దుఃఖాన్ని ఈ పద్యం ఆవిష్కరించింది. నది ఏదైనా, ఊరు ఏదైనా గాయం ఒకటే. అలాగే తెలంగాణ గురించి ఈ కవి కలగన్నాడు. బాల్యంలో కోరుకున్నాడు, యవ్వనంలో ఆశించాడు, వృద్ధాప్యంలో నెరవేర్చుకున్నాడు. కానీ సంధించిన ప్రశ్నలు వడి పెడుతుంటే ఎవర్ని అడగాలో తెలియక మానేరు నదితో ఒంటరిగా సంభాషిస్తున్నాడు.

జూకంటి కవిత్వంలో విస్తారమైన ఇతివృత్త వైవిధ్యం ఉంది. కన్నతల్లి, తండ్రి, మనుమరాండ్లు, స్నేహితులు, సెల్ ఫోన్, పేపర్ బాయ్, మిల్క్ బాయ్, మానేరు, సిరిసిల్ల, తెలంగాణ, విప్లవం, అమరులు, గ్లోబలైజేషన్. ఇలా తన చుట్టూ ఆవరించిన ఇతివృత్త సముదాయమంతా ఆయన కవిత్వంలో ఉంది. తెలంగాణ జీవద్భాష కలిగి ఉండటం చూస్తే స్థానీయత మీద ఆయనకుండే మమకారం తెలుసుకోవచ్చు. తెలంగాణ మట్టిలో నుంచి ఆయన వ్యక్తమవుతాడు. మనిషితనం, మంచితనం అతడి కవితా సారాంశంగా భావించవచ్చు.

కవి మౌనంగా ఉంటే వ్యవస్థ కురచగా మారిపోతుందనే ఎరుక జూకంటికి ఉంది. సంవిధానం, ప్రజాస్వామ్యం వికసించాలంటే ప్రశ్న మనుండాలని కోరుతున్నాడు. "సంఘర్షించాల్సిన సమయంలో మౌనంగా తల వంచుకుంటే చావడానికి ఇలా ఎన్నెన్నో ఉటంకింపులు" ఉంటాయని హెచ్చరిస్తున్నాడు. "చీకటి గురించి అడుగు/ వెలుగుకు అంటిన/ నల్లని మరకల గురించి అడుగు" అప్పుడే కవి సజీవ దృశ్యంగా ఉంటారని జూకంటి రాస్తాడు. కవులు అనధికారిక శాసనకర్తలని ఆంగ్లంలో ఒక మాట ఉంది. కనుక వారి కలం, వారి గొంతు ప్రజాపక్షమే. ఏలికలో భాగమైన కవిలో సృజనాత్మకత ఒట్టిపోతుంది. ప్రపంచీకరణ పతాక స్థాయికి చేరుకున్న కాలంలో విధ్వంసమవుతున్న మానవ విలువలు కవిని పాలక కొసకు చేర్చుతున్నాయనే న్యాయమైన ఫిర్యాదు జూకంటికి ఉంది. సచివాలయ గుమ్మానికి కవులు స్వచ్ఛందంగా శిరస్సులను వేలాడదీసుకున్నారని బాధపడుతున్నాడు. రాజ్యం కోసం అక్షరం సొట్టపడకూడదని నెత్తి నోరు మొత్తుకొని బామాడుతున్నాడు.

కవి మట్టిలో కలిసిపోవచ్చు. కానీ జీవనది లాంటి అక్షరం మాత్రం గొంతు లేని వారికి ఆసరా కావాలి. జూకంటి అర్ధశతాబ్ద కవితా ప్రవాహం 18 సంపుటాల్లో, 1745 పేజీల్లో నిక్షిప్తమైంది. ఒక్క వ్యాసంలో ఆయన కవితా ఆత్మను ఆవిష్కరించడం సాధ్యమయ్యే పనికాదు.

■ **చింతకింది కాశీం**

✆ 97014 44450

బ్రతుకు మూట

జాతర ఏదో జరుగుతున్నట్టు
దేవతాభరణాలు ఏవో మోసుకొస్తున్నట్టు
వీధుల వెంట తిరిగే ఊరేగింపు

చూడడానికి చిన్నదే అయినా
మూట విప్పితే
ఇంద్రజాలం ఏదో చూసినట్టు
రాజూ రాణీ వస్త్రాలు ఏవో ప్రదర్శనకు పెట్టినట్టు
వాకిలి నిండా పరుచుకునే బట్టల దుకాణం

చిన్న రాయుడు పెద్ద రాయుడు లుంగీలంటూ
రంభ రమ్యకృష్ణ చీరలు అంటూ
వాడు ఎన్నెన్ని కలలు మూటగట్టుకుని వస్తాడో

ఒక ధర చెప్తాడు
మనము వద్దు అంటాము
వాడు ఒక మాట అంటాడు
మనము ఇంకో మాట అంటాము
వాడొక మెట్టు దిగి
కూలీ గిట్టిన బేరం కుదిరినట్టు
కళ్ళలో నవ్వులు పూయిస్తాడు

ఉద్దెరకు ఊ కొడుతాడు
ఎంతసేపు బేరమాడినా
నుదుటిపై విసుగు బొమ్మ అగుపడనీయడు

పొద్దు తిరుగుడు పువ్వులా
ఆ సందూ ఈ సందూ తిరిగి
సాయంత్రానికి మూట దులిపి
జేబు నిండిన సంబరం
వెంటబెట్టుకుని వెళ్తాడు

కాలం ఉత్తగ ఉండనే ఉండదు కదా
కుడిచేత్తో తోలిన గాలిని
ఎడమ చేత్తో మళ్ళగొడుతున్నది

వాని ఉపాయం కాపీ కొట్టి
నడూళ్ళో వెలసిన షాపింగ్ మాల్
వాని పొట్టగొడుతూ
బ్రతుకు మీద ప్రళయ తాండవమాడుతున్నది

వడగండ్లకు రాలిపోయిన వరి గొలుసులా
ఎక్కడో
పీక తెగుతున్నది.

■ **గజ్జెల రామకృష్ణ**


✆ 89774 12795

కూలుతున్న ప్రపంచాల నైరాశ్యం

ప్రపంచం ఇక అంతాన్ని సమీపించింది. కానీ ఆ అంతం ఒక అగ్ని వర్షం గానో, జల ప్రళయం గానో ఒక్క పెట్టున వచ్చి పడేది కాదు. ఒక నైతిక పతనంగా, భౌతిక క్షయంగా, అతి మెల్లగా దాపురిస్తుంది. - ఇదీ లాస్లో క్రస్నహోర్కాయ్ నవలల్లోని వాతావరణం. అతని తొలి రెండు ప్రసిద్ధ నవలల్లోనూ ప్రపంచం ఇక రేపో మాపో అంతం కాబోతుందన్న గుబులు ఉంటుంది. ఆ అంతానికి కారణం ఏమిటన్నది స్పష్టంగా వ్యక్తం కాదు. కానీ నవలల్లోని పాత్రలన్నీ ఆ సమీపిస్తున్న అంతాన్ని నిశ్శబ్దంగా ఒప్పుకున్నట్టే ప్రవర్తిస్తాయి. చుట్టూ క్రమంగా శిథిలమై కూలుతున్న ప్రపంచాల మధ్య తమని కాపాడే ఆశ కోసం ఎదురు చూస్తుంటాయి. ఆ ఆశ ఎప్పటికీ రాదు. ఒక్కోసారి ఎవరో రాబోయే మనిషి తమని కాపాడతాడన్న ఎదురుచూపు ఉంటుంది. కానీ ఆ వచ్చిన మనిషి తన కోసం ఎదురుచూస్తున్న వాళ్ళని మోసం చేసి వెళ్ళిపోతాడు.

లాస్లో క్రస్నహోర్కాయ్ (Laszlo Krasznahorkai)కు ఇలాంటి ఇతివృత్తాలను సరఫరా చేసింది అతని స్వదేశమైన హంగరీలో ఆనాటి రాజకీయ వాతావరణమే అనుకోవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత హంగరీ సోవియట్ రష్యా అధీనం లోని ఒక దేశంగా మారింది. స్టాలిన్ అడుపాజ్ఞల కింద హంగరీలో కూడా కమ్యూనిస్ట్ పాలన మొదలైంది. స్టాలిన్ చనిపోయాకా 1956లో హంగరీలో రష్యన్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమం మొదలైనప్పటికీ, రష్యా దాన్ని యుద్ధటాంకులతో హింసాత్మకంగా అణచివేసింది. ఆ తర్వాత ఇక 1989 దాకా హంగరీలో కమ్యూనిస్టు పాలనే కొనసాగింది. ఈ కాలమంతా ప్రజల సామాజిక జీవితం భయం, అణచివేతల మధ్య గడిచింది. 1960ల నుంచి క్రమంగా హంగరీపై రష్యా అదుపు తగ్గించుకుంటూ వచ్చినా, ప్రజలకు స్వేచ్ఛ మాత్రం పరిమితమే. లాస్లో క్రస్నహోర్కాయ్ బాల్యం, యవ్వనం అంతా ఈ వాతావరణంలోనే గడిచింది. 1989లో తన 35 ఏళ్ళ వయస్సులో కమ్యూనిస్టు పాలన ముగిసిన సందర్భాన్ని తలచుకుంటూ, "ఆ రాజకీయ స్వేచ్ఛ నమ్మశక్యం కాని విషయంలా అనిపించింది," అంటాడు లాస్లో. "అప్పటి దాకా అదో కాలం కదలని సమాజం. పరిస్థితులు ఎప్పటికైనా మారతాయన్న ఆశలేకుండా చేశారు పాలకులు. ఎప్పుడూ అదే బూడిదరంగు ఆకాశం, కళా కాంతుల్లేని చెట్లు, పార్కులు, వీధులు, భవనాలు, నగరాలు. చవక బార్లు, పేదరికం, మాటపై నిషేధం. మార్క్సిజంపై నమ్మకం కోల్పోయిన తొలి తరం మాది," అంటాడు.

లాస్లో క్రస్నహోర్కాయ్ 1954లో జ్యులా పట్టణంలో పుట్టాడు. అతని అసలు ఇంటి పేరు 'కొరీన్'. కానీ అంతకుముందు హిట్లర్ చెలరేగిన కాలంలో తమని యూదులుగా పట్టించి వేసే ప్రమాదం ఉన్న ఆ ఇంటి పేరును లాస్లో తాతయ్య 'క్రస్నహోర్కాయ్'గా మార్చాడు. (అది హంగరీలో ఒక పాత కోట పేరు.) తనకు యూదు మూలాలు ఉన్నాయన్న సంగతి లాస్లోకి కూడా పదకొండేళ్ల వయసు వచ్చే దాకా తెలియదు.



> **యవ్వనంలో తన చుట్టూ చవి చూసిన రాజకీయ ఉక్కపోత లాస్లో క్రస్నహోర్కాయ్ రచనల ఇతివృత్తాలను, శైలిని నిర్దేశించింది. అయితే అతను తన రచనలను నిరంకుశ రాజకీయ వ్యవస్థలపై ఎక్కుపెట్టలేదు. అలాంటి వ్యవస్థల కింద సమాజం క్రమ క్రమంగా క్షీణించే తీరుపై ఎక్కువ దృష్టి పెట్టాడు. ఇక అంత్య దశకు వచ్చేసిన ప్రపంచం ఏదో మహా విపత్తు వైపు క్రమంగా జారుతున్న వాతావరణం అతని నవలల నిండా పరుచుకుని ఉంటుంది.**

పంతొమ్మిదేళ్ళ వయసులో- నిర్బంధ మిలటరీ పని నుంచి తప్పించుకోవాలని కొంతా, దాస్తవిస్కీ లాంటి పంతొమ్మిదో శతాబ్దం రష్యన్ రచయితల ప్రభావంతో కొంతా- లాస్లో క్రస్నహోర్కాయ్ ఇల్లు వదలి పేద ప్రజల మధ్యకు వెళ్ళి చిన్నా చితకా ఉద్యోగాలు చేయటం మొదలుపెట్టాడు. గనుల్లో కూలీ పని నుంచి డైరీ ఫార్మ్‌లో నైట్ వాచ్‌మన్ పని దాకా రకరకాల ఉద్యోగాలు చేస్తూ హంగరీ అంతా దేశదిమ్మరిలా తిరిగాడు. రాత్రిపూట డైరీ ఫార్మ్‌లో వందలాది ఆవులకు కాపలా కాస్తూనే తన తొలి నవల 'సాటాన్‌టాంగో' (Satantango) రాశాడు. వర్షపు బురద నిండిన వీధులూ, కూలిపోతున్న ఇళ్లూ, ఏదీ పండని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు, పాడైపోయిన మిల్లులు, పేద జనం మసిలే ఇరుకుబార్లు... ఇదీ నవలకు నేపథ్యం. (ఈ నవలను దర్శకుడు బేలా టార్ 1994లో ఏకంగా ఏడున్నర గంటల సినిమాగా తీశాడు!)

లాస్లో అంత సులువుగా చదివించే రచయిత కాదు. అతని నవలల్లోని పాత్రలు కదలని కాలంలో చిక్కుకుపోయి ఉన్నట్టు గానే, వాటిని చదివే పాఠకుడు కూడా ఆ ఎడతెగని వాక్యాల వరద మధ్య చిక్కుకుపోతాడు. వేగంగా కదులుతూ కూడా ఎటూ పోని లాస్లో వాక్యాలు చాలా పొడవుగా ఉంటాయి. పేరాల విభజన లేకుండా, ఫుల్‌స్టాపులు కూడా లేకుండా పేజీలకు పేజీలు కొనసాగుతాయి. "ఫుల్‌స్టాప్ అవసరం ఉన్నది దేవుడు ఒక్కడికే. అంతా ముగిసే అంతంలో ఒక ఫుల్‌స్టాప్ వాడతాడు తప్పకుండా," అంటాడు. ఆయన ప్రసిద్ధ నవల 'సాటన్‌టాంగో'లో మొదటి వాక్యమే ఆరు పేజీల పాటు ఏ ఫుల్‌స్టాప్ లేకుండా కొనసాగుతుంది! "ఒక స్నేహితుడితో పాటూ కూర్చుని రాత్రి పూటంతా మేల్కొని మన జీవితంలో ఎంతో ముఖ్యమైన విషయాన్ని అతనికి అర్థమయ్యేలా చెబుతున్నప్పుడు, మన మాటలకి ఫుల్‌స్టాపులూ కామాలూ అవసరం లేదు. మాట్లాడేందుకు ఊపిరీ, మాటల్లో లయా మాత్రమే కావాలి. నేను ఫుల్‌స్టాపులు తక్కువ వాడాలనీ, పొడవాటి వాక్యాలు మాత్రమే రాయాలనీ ఏమీ నియమం లాగ పెట్టుకోలేదు. పాఠకుడిని చేరువ చేసుకుని అతన్ని కన్విన్స్ చేయటానికి కథ చెప్తున్నప్పుడు నాకు ఆ లయా, ఆ రాగం, అలాంటి వాక్య నిర్మాణం సహజంగా వచ్చేశాయి," అంటాడు.

యవ్వనంలో తన చుట్టూ చవి చూసిన రాజకీయమైన ఉక్కపోత లాస్లో రచనల ఇతివృత్తాలను, శైలిని నిర్దేశించింది. అయితే అతను తన రచనలను నిరంకుశ రాజకీయ వ్యవస్థలపై ఎక్కుపెట్టలేదు. అలాంటి వ్యవస్థల కింద సమాజం క్రమ క్రమంగా క్షీణించే తీరుపై ఎక్కువ దృష్టిపెట్టాడు. ఇక అంత్య దశకు వచ్చేసిన ప్రపంచం ఏదో మహా విపత్తు వైపు క్రమంగా జారుతున్న వాతావరణం అతని నవలల నిండా పరుచుకుని ఉంటుంది. "మనం ఏ మహా ప్రళయం (apocalypse) కోసమూ ఎదురు చూడనక్కర్లేదు. ఎందుకంటే మనం మహా ప్రళయం లోనే జీవిస్తున్నాం," అంటాడు. ఈ విపత్తు నుంచి తప్పించుకునేందుకు మనుషులు దేని మీద ఆశపెట్టుకున్నా అది చివరకు వాళ్ళని మోసమే చేస్తుంది. కానీ లాస్లో దృష్టిలో ఆశ ఎంత నిష్ఫలమైనప్పటికీ అది ఎంతో అవసరం కూడా. అలాంటి ఆశను ప్రజల నుంచి లాక్కోవటం కళ చేయాల్సిన పని కాదంటాడు. "మానవ జీవిత నైరాశ్యాన్ని ఉన్నది ఉన్నట్టు చూపిస్తానే కానీ మనుషుల నుంచి ఆశను లాగేసుకోవటం నా ఉద్దేశం కాదు," అంటాడు.

ఈ ఏడాది నోబెల్ సాహిత్య బహుమతిని లాస్లో క్రస్నహోర్కాయ్‌కు ప్రకటిస్తూ, "ప్రపంచం అంతం కానున్నదనే భయావహ వాతావరణం మధ్య కళని శక్తివంతంగా నిలబెట్టిన అతని దార్శనిక రచనలకు ఈ బహుమతిని ఇస్తున్నాం," అంది నోబెల్ కమిటీ. ఈ సందర్భంగా అతని స్పందన కోరుతూ ఒక విలేకరి, "మీ రచనల్ని నడిపించేది ఏమిటి?" అని అడిగితే, "అక్కసు" (bitterness) అని జవాబు ఇచ్చాడు లాస్లో. "ఇప్పుడు ప్రపంచం ఏ పరిస్థితిలో ఉందో చూస్తే బాధ కలుగుతుంది. అదే నా రచనలకి లోతైన ప్రేరణ," అన్నాడు.

■ **ఎన్. వసంత్**



వసంత స్వప్నం లాంటి మృదు నిమిషం

ఉద్దండుడెవరో ఎదురైనప్పుడు
మాయా మైకాలు నీలో రెండు కాళ్ళ జంతువులా తిరిగి
పలకరింత కోసం ఉవ్విళ్లూరుతాయి
మిటకరించే కళ్ళతో
కాసింత దూరంలో నిలబడి చేతుల్ని
నమ్మనట్టు గిల్లుకుంటావు

నువ్వు సితారలా చూసిన మనిషి నీ ముందు
కనబడినప్పుడు
కైవల్యం మెట్ల ముందు నిలబడ్డట్టు కాసింత
కల్లోలమౌతావు

అతడు పలకరింపుగా నవ్వినప్పుడు
సంకోచం ఏదో నీలో బలపం నమిలే పెదవిలా
తడబడుతుంది

వసంత స్వప్నం లాంటి ఆ నిమిషం
అడగాలనుకున్న ప్రశ్నలు ఎగిరిపోయిన పక్షుల్లా
తలను ఖాళీ చేసి వెళ్ళిపోతాయి


ఏ లాలిత్యమో
తొలి పలుకంత మృదువుగా తుళ్ళే వింత మైకంలో
నువ్వతడి చేతుల్ని నొక్కి తృప్తి పడతావు

రాని భాషలో కుశలమేదో అడిగినట్టు
ఉద్వేగానికి వ్యాకరణాలద్ది ముక్కలయ్యాక
మంత్ర లోకం నుండి ఇంటి వైపు మళ్ళినట్టు
ఉండిపోతావు

మరే లాలసా లేనట్టున్న ఆ నిమిషం
కాలం నిన్నొక ఉన్మత్త స్వప్నంలా ముట్టుకుందని
చెప్పుకుంటావు

■ **రఘు**

✆ 96761 44904

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

ఎన్.టి.ఆర్
జిల్లా వార్తలు
సోమవారం 13 అక్టోబరు 2025

భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడికక్కడ భక్తులు బారులుతీరడంతో గమనించిన ఆలయ అధికారులు అన్ని దర్శన టికెట్లను రద్దు చేశారు. యుద్ధప్రాతిపదికన భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 6

అమరావతి కేంద్రంగా..

ఇక సీఆర్‌డీఏ పాలన

అమరావతి కేంద్రంగా ఇక పుర పరిపాలన ప్రారంభం కాబోతోంది. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థతో సహా మునిసిపల్ పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో పనిచేయాల్సిన అన్ని శాఖలు ఒకే భవనంలోకి రానున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయాన్ని సీఎం చంద్రబాబు సోమవారం నుంచి ప్రారంభించనున్నారు. ఇక రాష్ట్ర ప్రజలందరికీ ఇక్కడి నుంచే సేవలు అందనున్నాయి.

ఇతర శాఖలకు..

ప్రధాన బిల్డింగ్ పక్కనే ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ ఏరియాతో కలిపి మరో నాలుగు భవనాలు నిర్మించారు. ఒక్కో భవనాన్ని 41,500 చదరపు అడుగుల విస్తీర్ణం చొప్పున మొత్తం 1,66,000 విస్తీర్ణంలో నిర్మించారు. మొదటి భవనాన్ని టిడ్కో, ఏపీయూఎఫ్ఐడీసీలకు కేటాయించారు. రెండవ భవనాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రెరా అప్పీలేట్ అథారిటీ, గ్రీనింగ్ కార్పొరేషన్‌లకు కేటాయించారు. మూడవ భవనాన్ని డీటీసీపీ (టౌన్‌ప్లానింగ్), రెరాలకు కేటాయించారు. నాల్గవ భవనాన్ని మెప్మా కార్యాలయానికి కేటాయించారు.



నేడు సీఎం చేతుల మీదుగా ప్రధాన కార్యాలయం ప్రారంభం

రాష్ట్ర ప్రజలందరికీ ఇక్కడి నుంచే సేవలు

- ఉమ్మడి కృష్ణాజిల్లా ప్లానింగ్, ఇంజనీరింగ్ తదితర శాఖల పాలన బెజవాడ నుంచే..
- విజయవాడలో అడిషనల్ కమిషనర్ స్థాయి అధికారి ఉండే అవకాశం!



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సీఆర్‌డీఏ కార్యాలయ భవనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని రైతులు, ప్రజలకే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ కూడా అమరావతి కేంద్రంగా పురపాలన అందుబాటులోకి రాబోతోంది. సీఆర్‌డీఏ ప్రధాన పరిపాలనా వ్యవహారాలన్నీ కూడా విజయవాడ నుంచి కాకుండా ఇక అమరావతి నుంచి జరగనున్నాయి. రాజధాని రైతులు తమ సమస్యలకు సంబంధించి ఇప్పటి వరకు విజయవాడ రావాల్సి వచ్చేది. ఇక మీదట తమ స్థానిక ప్రాంతంలోనే కార్యాలయం ఉండటం వల్ల వారికి సౌకర్యంగా ఉంటుంది. అమరావతికి భూములిచ్చిన రైతులకు దగ్గరగా సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం ఉంది. ఇప్పటి వరకు రాజధాని ప్రాంత ప్రజలు, రైతులు తమ సమస్యలను చెప్పు కోవడానికి విజయవాడ రావాల్సి వచ్చేది. ఇకమీదట స్థానికంగానే సీఆర్‌డీఏ కార్యాలయం అందుబాటులో ఉండటం వల్ల రాజధాని అపరిష్కృత అంశాల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటి వరకు విజయవాడలో ప్రధాన కార్యాలయం ఉండటం వల్ల రాజధాని రైతుల సమస్యలకు సంబంధించి తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతి సోమవారం అడిషనల్ కమిషనర్ స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహిస్తూ ఉండేవారు. రాజధాని రైతుల సమస్యలన్నీ ఎక్కువగా ఉన్నతస్థాయి అధికారులతో ముడిపడి ఉండటం వల్ల స్థానికంగా సీఆర్‌డీఏ కార్యాలయం ఉన్నా విజయవాడ రావాల్సి వచ్చేది. తుళ్లూరు సీఆర్‌డీఏ కార్యాలయం ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించిన స్థానిక వ్యవహారాలకు కేంద్రంగా పనిచేస్తుంది. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం రాజధాని తరలిపోతున్న తరుణంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్లానింగ్, ఇంజనీరింగ్, తదితర అన్ని విభాగాలు కూడా ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించిన మిగతా 6లో..

సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోనే మునిసిపల్ శాఖల హెచ్‌వోడీలు

సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోనే మునిసిపల్ శాఖలకు చెందిన అన్ని హెచ్‌వోడీ కార్యాలయాలు పనిచేయనున్నాయి. సీఆర్‌డీఏ ప్రధాన భవనం ఈ3 - ఎన్ 11 రోడ్ల జంక్షన్ దగ్గర రాయపూడిలో మొత్తం 4.32 ఎకరాల విస్తీర్ణంలో జీప్లస్ + 7 విధానంలో నిర్మించారు. మొత్తం 3.07 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం పూర్తయింది. ప్రధాన భవనం 0.73 ఎకరాలు, గ్రీన్ జోన్ 0.88 ఎకరాలు, పార్కింగ్ ఏరియా 1.36 ఎకరాలు, ఓపెన్ స్పేస్ 0.96 ఎకరాలు, ఎస్టీపీ 0.39 ఎకరాలలో నిర్మాణం చేశారు.

స్టువర్టుపురం దొంగలొచ్చారు!

బందెలదొడ్లలో గేదెలు, మేకలు, గొర్రెలే లక్ష్యం

- పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో కొద్ది నెలలుగా గేదెలు, మేకలు మాయం
- శనివారం అర్ధరాత్రి స్కార్పియో కారును అద్దెకు తీసుకుని మరీ వచ్చిన దొంగలు
- వెంబడించి పట్టుకున్న పోలీసులు!
- వన్‌టౌన్‌లోని సీసీఎస్ పోలీసుస్టేషన్‌లో విచారణ

అర్ధరాత్రుళ్లు బందెల దొడ్లలో ఉండే గేదెలు మేకలు, గొర్రెలను దొంగిలించే స్టువర్టుపురం దొంగల బ్యాచ్ జిల్లాలోకి ప్రవేశించింది. చీరాల ప్రాంతానికి చెందిన పాత నేరస్థులను విజయవాడ సీసీఎస్ పోలీసులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. స్టువర్టుపురం దొంగల బ్యాచ్‌ను పోలీసు అధికారులు వన్‌టౌన్ సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో విచారిస్తున్నారు.

వన్‌టౌన్ / జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల, జగ్గయ్యపేట, వత్సవాయి తదితర ప్రాంతాల్లోని బందెలదొడ్లలో ఉండే మేకలు, గొర్రెలను చాలాకాలంగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోతున్నారు. వరుస దొంగతనాలపై బాధితులు పెద్ద సంఖ్యలో స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. ఆధారాలు దొరక్కుండా దొంగతనాలు చేస్తుండటంతో వీరంతా పక్కా ప్రొఫెషనల్స్ అయి ఉంటారని పోలీసులు భావించారు. బాపట్ల జిల్లా, చీరాల, స్టువర్టుపురం ప్రాంతాలకు చెందిన దొంగలు రాత్రి వేళల్లో వ్యాన్‌లు, కార్లలో వచ్చి దొంగతనాలు చేస్తున్నారన్న వ్యవహారం ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్టూవర్టుపురం, చీరాల మిగతా 6లో..



గన్నవరం విమానాశ్రయంలో జనార్దనరావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఫైల్)

వివాదాల జనార్దన!

హైదరాబాద్‌లోని ఈ సెవెన్ బార్‌లో భాగస్వాముల మధ్య గొడవలు

- జనార్దనరావు పెత్తనాన్ని సహించని భాగస్వాములు
- అక్కడ బార్‌ను వదిలేసి వచ్చి.. ఇక్కడ ఏఎన్‌ఆర్ బార్‌ను సంపాదించాడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కిరాణా వ్యాపారం నుంచి బార్‌లు నిర్వహించే స్థాయికి ఎదిగిన జనార్దన రావు కోట్ల సంపాదన కోసం కోటి ఉపాయాలను ఎంచుకున్నాడా? లిక్కర్ వ్యాపారం చేసే వాళ్లందరినీ ఒక సిండికేట్‌గా మార్చడంలో సఫలీకృతమయ్యాడా? దాని ముసుగులోనే నకిలీ మద్యం తయారీని అన్ని ప్రాంతాలకు విస్తరింపజేయాలని భావించాడా? అంటే విశ్వసనీయ వర్గాల నుంచి అవుననే మిగతా 6లో..

గోవా కథ..

ఈ సెవెన్ బార్‌లో భాగస్వాములుగా ఉన్న వాళ్లంతా కలిసి గోవా వెళ్లామని, అక్కడ బాలాజీ అనే వ్యక్తి పరిచయం అయిన తర్వాత నకిలీ మద్యం తయారీకి ప్రణాళికలు రూపొందించామని జనార్దనరావు ఎక్సైజ్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. దీని ప్రకారం భాగస్వాముల్లో కొంతమంది మాత్రమే గోవాకు వెళ్లారని తెలుస్తోంది. గోవా పర్యటనతో సంబంధంలేని భాగస్వాములను ఈ కేసులోకి లాక్కొచ్చే ప్రయత్నం చేశాడు. వైసీపీ హయాంలో అనేక రకాల బ్రాండ్లు మద్యం దుకాణాల్లోనూ బార్లలోనూ కనిపించాయి. ముఖ్యంగా ఈ ఏఎన్నార్ బార్‌లో డిపోల నుంచి కొనుగోలు చేసినటువంటి మద్యానికంటే నకిలీ మద్యాన్ని ఎక్కువగా విక్రయించినట్లు తెలుస్తోంది.

రేషన్ మాఫియా ఆగడాలు!

నందిగామ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున దందా!

- పక్కదారి పడుతున్న పేదల బియ్యం
- అడ్డుకుంట్ను గ్రామస్థులు.. బెదిరిస్తున్న వ్యాపారులు
- రేషన్ డాన్ల ప్రవేశంతో వ్యాపారం ముమ్మరం
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల): నందిగామ నియోజకవర్గంలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత ఎండీయూ వాహనాలను రద్దు చేసి, తిరిగి డీలర్ల వ్యవస్థను ప్రవేశపెట్టినప్పటికీ అక్రమ వ్యాపారం యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. నందిగామ, చందర్లపాడు మండలాలకు సంబంధించి చందర్లపాడుకు చెందిన వ్యక్తి, కంచికచర్ల, వీరులపాడు మండలాలకు సంబంధించి చట్టన్నవరం, జయంతి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నారు. ఎప్పటి నుంచో ఈ వ్యాపారంలో ఉన్న వీరు మారిన పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. వారి అభయహస్తంతో వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్లకు 1,750 టన్నుల బియ్యం

కార్డుదారులకు అందజేసేందుకు నందిగామ ఎంఎల్ఎస్ పాయింట్‌కు ప్రతి నెల 900 టన్నులు, కంచికచర్ల ఎంఎల్ఎస్ పాయింట్‌కు 850 టన్నుల బియ్యం వస్తున్నాయి. రేషన్ బియ్యం బాగున్నప్పటికీ ఎక్కువ మంది కార్డుదారులు తినటానికి ఇష్టపడటం లేదు. కొద్ది మంది మాత్రం పిండి వంటలకు, దోశలకు వినియోగిస్తున్నారు. ఎక్కువ భాగం బియ్యం పక్కదారిపడుతుండగా, మాఫియా వ్యాపారులకు వరంగా తయారైంది.



కార్డుదారుడి వద్ద కిలో రూ.13కు కొనుగోలు

గ్రామాల్లో కార్డు దారుల నుంచి కిలో రూ.13-రూ.14కు కొంటున్నారు. ఆయా గ్రామాల్లోని సేకరణదారుల నుంచి బ్రోకరు రూ.16కు తీసుకుంటున్నాడు. ఆ తర్వాత మండలానికి చెందిన మాఫియా వ్యాపారుడు కిలోకు రూ.18 వంతునచెల్లిస్తున్నాడు. నిన్నటి వరకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు బియ్యం కొనేవారు. వాహనాలను తొలగించి డీలర్ల వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టినప్పటికీ బియ్యం వ్యాపారం మాత్రం ఆగలేదు. నేడు డీలర్లు కూడా కొంటున్నారు.

మాఫియా డాన్‌లుగా..

జయంతి, చందర్లపాడు గ్రామాలకు చెందిన వ్యాపారులు బియ్యం మాఫియా డాన్‌లుగా పేరొందారు. వీరిపై 6ఏ కేసులు ఎన్నో నమోదైనప్పటికీ భయం లేదు, బెణుకు లేదు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రేషన్ బియ్యం కొనేవారు ఎవరైనా సరే వీరికి అమ్మాల్సిందే. ఎవరైనా బియ్యం సేకరించాలన్న, గ్రామాల్లో కొనాలన్నా తప్పనిసరిగా వీరి అనుమతి కావాలి. లేనట్లయితే చుక్కలు చూపిస్తారు. ఈ వ్యాపారం వ్యవస్థీకృతమైనట్టుగా అంతా మాఫియా కనుసన్నల్లో జరుగుతుంది. నాయకుల అండదండల వల్ల అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారు తప్పితే దాడులు కూడా చేయటం లేదు. ఒకవైపు నాయకుల మద్దతు, మరోవైపు మిగతా 6లో..

నందిగామ నియోజకవర్గంలో రేషన్ మాఫియా బరితెగిస్తోంది. డాన్లుగా మారిన కొందరు వ్యాపారులు యథేచ్ఛగా పేదల బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో పలు చోట్ల గ్రామస్థులే అక్రమ రవాణాను అడ్డుకున్నారు. మా వాహనాలనే ఆపుతారా అంటూ వ్యాపారులు బెదిరింపులకు దిగుతున్నారు. వీరికి రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో అధికారులు సైతం కిమ్మనటం లేదు. మాఫియాకు ఎదురులేకుండా పోవటంతో రేషన్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.



సాయి మణిదీప్, శ్రీ సాకేత్, జీవన్ సాత్విక్(ఫైల్)

కొంపముంచిన ఈత సరదా

చీరాలలోని వాడరేవు సముద్రతీరంలో ప్రమాదం

అమరావతి విట్ కళాశాల విద్యార్థులు ముగ్గురు మృతి

చీరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వాడరేవు సముద్రతీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన ముగ్గురు విద్యార్థులు నీటిలో మునిగి మృతి చెందారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... అమరావతి విట్ కళాశాలలో సాయి మణిదీప్(20), శ్రీసాకేత్(20), జీవన్ సాత్విక్(20) ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వారాంతం కావడంతో మరో నలుగురు మిత్రులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వచ్చారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అయితే మణిదీప్ కాస్తంత లోతుకు వెళ్లి ఈత కొడుతుండగా, అప్పటికే సహచరులు అతడిని హెచ్చరించారు. అయిన అలాగే వెళుతుండటంతో అతడిని బయటకు తెచ్చేందుకు ఇద్దరు మిత్రులు దగ్గరకు వెళ్లారు. అయితే ఒక్కసారిగా అలల తాకిడి పెరగడంతో ముందు మణిదీప్ గల్లంతయ్యాడు. అతడిని రక్షించే క్రమంలో ఇద్దరు కూడా గల్లంతయ్యారు. అయితే ముగ్గురు స్నేహితులు ఒక్కసారిగా ప్రమాదంలో పడటంతో మిగిలిన వారు వెంటనే మెరైన్ పోలీసులకు, గజ ఈతగాళ్లకు సమాచారం అందించారు. వారు వెతుకుతుండగా, ముగ్గురి మృతదేహాలు ఒడ్డుకు చేరాయి.

నేటి నుంచి గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ 6

చెరువు తూములో ఇరుక్కుని గిరిజన రైతు మృతి

- వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా ఘటన
- ఎ.కొండూరు తండాలో విషాదం



గోపయ్య (ఫైల్)

ఎ.కొండూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన గిరిజన రైతు చెరువు తూములో ఇరుక్కుపోయి మృతి చెందిన ఘటన ఎ.కొండూరు తండాలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన భూక్యా గోపయ్య(43) గ్రామంలో వరి పంట సాగు చేస్తున్నాడు. పొలానికి నీరు పెట్టడానికి ఉదయం తండా చెరువు వద్దకు వెళ్లాడు. తూమును తీయడానికి ప్రయత్నించగా, చెరువులోని నీటి ఉధృతికి తూముతో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి మిగతా 6లో..

- మాజీ మంత్రి దేవినేని ఉమా కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామానికి చెందిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు కొండయ్యకు కొద్దిరోజుల క్రితం ఫోన్ చేసి జెడ్పీటీసీ సీటు విషయం గురించి అడిగారు. తర్వాత కొండయ్యకు అనుమానం వచ్చి నేరుగా దేవినేని ఉమా వద్దకు వెళ్లి విషయం చెప్తే అది నకిలీ వీడియో కాల్ అని తేలింది. మూడు రోజుల క్రితం జరిగిన ఘటన ఇది.
- తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో టీడీపీ నాయకుడికి జెడ్పీటీసీ టికెట్ ఇచ్చే విషయమై దేవినేని ఉమా ఏఐ వీడియోను ఉపయోగించుకున్నాడు ఓ నిందితుడు. ఆ వీడియోను ఉపయోగించుకుని హోటల్‌లో మీటింగ్ ఏర్పాటు చేసి మరీ ఏకంగా డబ్బులు కొట్టేశారు.
- ఈ రెండు ఘటనలకు మధ్య వ్యత్యాసం రెండు, మూడు రోజులు మాత్రమే. ఈ ఘటనలో ఒకరు డబ్బులు పోగొట్టుకుంటే, మరొకరు డబ్బులు ఫోన్ చేయడానికి సిద్ధమై వెనక్కి తగ్గారు. ఇప్పటి వరకు వేర్వేరు మార్గాల్లో జనానికి టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు రాజకీయాల్లో ఉన్న ఆశావహులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రముఖ నేతల ఫొటోలతో నకిలీ వీడియోలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం టెక్నాలజీకి పదును పెడుతున్నారు. ఈ తరహా వీడియోల సృష్టికి లిప్ సింక్ ఏఐ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో సైబర్ క్రైం పోలీసులు ఈ విషయాన్ని గుర్తించారు.

లిప్ సింక్ చేస్తున్నారు..!

ఏఐ వీడియోలకు లిప్‌సింక్ అనుసంధానం

- ప్రముఖుల ముఖాలతో నకిలీ వీడియోల సృష్టి
- రాజకీయ ఆశావహులను బురిడీ కొట్టిస్తున్న 'ఈ' నేరగాళ్లు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : సైబర్ నేరగాళ్లు ఇప్పుడు రాజకీయాల్లో ఉన్న ఆశావహులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రముఖ నేతల ఫొటోలతో నకిలీ వీడియోలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం టెక్నాలజీకి నేరగాళ్లు పదును పెడుతున్నారు. ఈ తరహాలో వీడియోల సృష్టికి లిప్ సింక్ ఏఐ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో సైబర్ క్రైం పోలీసులు ఈ విషయాన్ని గుర్తించారు.

లిప్ ఇలా సింక్ అవుతోంది..

సైబర్ నేరగాళ్లు వదులుతున్న వీడియోలు వాస్తవంగా ఆ వ్యక్తే మాట్లాడుతున్నట్టే ఉంటున్నాయి. వాస్తవానికి అందులో ఎవరూ మాట్లాడడం లేదు. వీడియోలో ఉన్న వ్యక్తి పెదవులు మాత్రమే కదులుతాయి. డబ్బులు దోచుకోవడానికి వ్యక్తులను టార్గెట్ చేసుకున్న తర్వాత వారిని బుట్టలో వేయడానికి ఎవరో ఒక ప్రముకుడిని ఎంచుకుంటారు. మాట్లాడించే వ్యక్తి ఫొటోను లిప్ సింక్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అవతలి వ్యక్తితో ఏం మాట్లాడాలో దానికి సంబంధించిన ఆడియో యాప్‌లోకి పంపుతారు. ఇలా పంపిన తర్వాత రెండు విధానాలు ఉంటాయి. అందులో ఒకటి ఇన్‌పుట్ వీడియో, రెండో ఆడియో ఇన్‌పుట్ నేరగాళ్లు తీసిన వీడియోలను ఇన్‌పుట్ వీడియో ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీడియోకు సింక్ చేయాల్సిన ఆడియో, వాయిస్ రికార్డింగ్, పాటను ఆడియో ఇన్‌పుట్ ద్వారా ఎంచుకుంటారు. ఏఐ వాటిని డీప్ లెర్నింగ్ మోడల్స్‌కి మార్చుతుంది. వీడియోకు సరిపడినట్టుగా పెదవుల కదలికలను సర్దుబాటు చేస్తోంది. అంతిమంగా వీడియోలో ఉన్న వ్యక్తి మాట్లాడుతున్నట్టుగా, మిగతా 6లో..

నగరంలో గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్

నేటి నుంచి వారం రోజుల పాటు నిర్వహణ ● సమష్టి భాగస్వామ్యంతో విజయవంతం చేద్దాం: కలెక్టర్ లక్ష్మీశ



అమరావతి షాపింగ్ ఫెస్టివల్ పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌తో ఇటు వినియోగదారులకు అటు వ్యాపారులకు సూపర్ ప్రయోజనాలు కలుగుతాయని, ప్రతి కుటుంబానికి, వ్యాపారానికి మేలు జరుగుతుందని, జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించే క్రమంలో ఈనెల 13 నుంచి 19 వరకు గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ, జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని పున్నమిఘాట్ - బెరం పార్కులో జరిగే గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌పై కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కలిసి ఆదివారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వాణిజ్యం, వినోదానికి వేదికగా నిలిచే షాపింగ్ ఫెస్టివల్‌లో వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, హస్తకళాకారులు, ఇలా వివిధ వర్గాల వారు తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకొని బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు. దీపావళి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, రాయితీలు ప్రకటిస్తాయన్నారు. దాదాపు 100 స్టాళ్లతో ఏర్పాటుచేసే ఈ ఫెస్ట్‌లో మెగా లక్కీ డ్రాలతో పాటు ఉత్తమ స్టాళ్లకు అవార్డులు అందించనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లోని 9154970454 కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ జహీర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రజ్ఞా రాధిక, జిల్లా పరిశ్రమల అధికారి పి.మధు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నేడు సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకొనేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

మోటారు వాహనాల షోరూమ్‌ల యజమానులతో సమావేశం

ఈనెల 13 నుంచి 19 వరకు గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో వివిధ మోటారు వాహనాల షోరూంల యజమానులు, ప్రతినిధులతో సమావేశ నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణల ఫలాలు ఇటు వినియోగదారులకు అటు వ్యాపార, వాణిజ్య సంస్థలకు అందేలా ప్రత్యేక ప్రచారంతో అవగాహనతో పాటు వివిధ వినూత్న కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ ఫెస్టివల్‌లో స్టాళ్ల ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అలీ, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రియదర్శిని పాల్గొన్నారు. అనంతరం ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

కానిస్టేబుల్ బలవన్మరణానికి యత్నం

- ప్రభుత్వాసుపత్రిలో చికిత్సకు నిరాకరణ.. సెలైన్ తీసేసి హడావుడి
- పేట సీఐ, చిల్లకల్లు ఎస్సై పరామర్శ
- పని ఒత్తిడి అని కానిస్టేబుల్, బ్లాక్ మెయిలింగ్ అని అధికారులు
- 16 ఏళ్ల సర్వీసులో 3 సార్లు సస్పెన్షన్
- సీపీ దృష్టికి పీసీ వ్యవహారం: సీఐ



జగ్గయ్యపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పేట సర్కిల్ పరిధిలోని చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ మేజర్ల నాగశ్రీను (38) ఆదివారం గడ్డిమందు తీసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. గతంలో నందిగామ, ఇప్పుడు పట్టణానికి సమీపంలో తొర్రగుంటపాలెంలో నివాసం ఉంటూ చిల్లకల్లులో విధులు నిర్వహిస్తున్నారు. పని ఒత్తిడి, అధికారులు వేధింపులు తట్టుకోలేక గడ్డి మందు తీసుకున్నట్టు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు హరీష్ తెలిపారు. ఆసుపత్రి నుంచి సమాచారం ఇవ్వగానే పేట సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్సై టీఎస్ శ్రీనివాసరావు స్టేషన్‌కు వచ్చి పరామర్శించారు. పని ఒత్తిడి అని కానిస్టేబుల్ చెబుతుండగా అధికారులు వాదన భిన్నంగా ఉంది. విధులకు సక్రమంగా హాజరు కాకపోవటం లేదని, మద్యానికి బానిస కావటం, 16 ఏళ్ల సర్వీసులో 3 సార్లు సస్పెన్షన్‌కు గురైన ట్రాక్ ఉందని చెబుతున్నారు. వైద్యులకు కూడా సమాధానం ఇవ్వటానికి ముప్పతిప్పలు పెట్టినట్టు చెబుతున్నారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జరిగిన సంఘటనపై విజయవాడ సీపీకి ఒక నివేదిక అందజేస్తామన్నారు. డ్యూటీ డాక్టర్ హరీష్ అతడిని విజయవాడ రిఫర్ చేసిన వైద్య సలహాను తిరస్కరించి, పెట్టిన సెలైన్, క్యాన్‌లాను, ఆక్సిజన్ పైపులను తొలగించుకుని కానిస్టేబుల్ వెళ్లినట్టు పోలీస్ వర్గాలు చెప్పాయి. ఈ సంఘటన పోలీస్ వర్గాల్లో పెను సంచలనం కలిగించింది.

భావితరాలకు బెజవాడ చరిత్ర!

- ఇంటాక్ విజయవాడ నేతృత్వంలో విజయవాడలో హెరిటేజ్ వాక్
- చారిత్రక వైభవాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి: కలెక్టర్ లక్ష్మీశ



పర్యాటకులతో కలిసి హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న కలెక్టర్

విజయవాడ సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మన నగరం మన చరిత్ర గురించి వర్తమాన, భావితరాలకు తెలియచెప్పేందుకు ముందుకు వచ్చిన ఇంటాక్ సంస్థ విజయవాడ నగర చారిత్రకతను భావితరాలకు చూపించేందుకు చేసిన చిరు ప్రయత్నం సఫలమైంది. ఆదివారం నగరంలోని పలు కుటుంబాలకు ఆహ్వానం పలికిన ఇంటాక్ సంస్థ విజయవాడతో పాటు అమరావతిలోనూ ఉన్న చారిత్రక ప్రాంతాలను చూపించటంతో పాటు తమ గైడ్లతో వాటి చారిత్రక విశేషాలను సందర్శకులకు వివరించింది. హెరిటేజ్ వాక్ పేరిట నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించి పాల్గొన్నారు.

మొత్తం 12 ప్రదేశాల సందర్శన

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు 12 ప్రదేశాలను సందర్శించారు. ముందుగా పీబీ సిద్ధార్థ కాలేజీ వద్ద పర్యాటకులను శాతవాహన, ఇక్ష్వాకులు, కాకతీయులు, విష్ణుకుండినులు, చాళుక్య గ్రూపులుగా ఏర్పాటు చేశారు. రుసుము చెల్లించిన పర్యాటకులకు గుర్తింపు కార్డులను ఇచ్చి కార్లలో ఆయా ప్రదేశాలకు తీసుకెళ్లారు. ఇన్‌టాక్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన గైడ్‌లు వారికి ఆయా ప్రాంతాల విశిష్టతను పర్యాటకులకు వివరించారు. మొగల్రాజపురంలోని మూడు గుహలు పీఎన్‌బీఎస్‌లోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బందరు, రైవస్, ఏలూరు కాలువలుగా విడిపోయే ప్రాంతం, వన్‌టౌన్‌లోని గాంధీ హిల్, కనకదుర్గ నగర్‌లోని అక్కన్న మాదన్న గుహలు, ప్రకాశం బ్యారేజీ, ఉండవల్లి గుహలు, కొండవీటి వాగు లిఫ్ట్, పీడబ్ల్యూడీ వర్క్‌షాప్, బకింగ్‌హామ్ కెనాల్‌లను సందర్శించారు. విజయవాడ చారిత్రక వైభవాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ సూచించారు.

రామాలయ అభివృద్ధికి ఏడాది వేతనం

- రూ.3 లక్షల విరాళం ప్రకటించిన ఉపాధ్యాయురాలు

తల్లాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏపీ రాష్ట్ర మెగా డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగానికి ఎంపికైన ఉపాధ్యాయురాలు ఝాన్సీకృష్ణ తన తొలి ఏడాది వేతనం రూ. 3 లక్షలను ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మంగాపురం గ్రామ రామాలయ అభివృద్ధికి విరాళంగా ప్రకటించారు. మంగాపురం రామాలయ అర్చకుడైన పరాంకుశం రామకృష్ణ అన్నారుగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిత్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య ఝాన్సీకృష్ణ ఏపీలో నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరులో విధుల్లో చేరింది. ఈ మేరకు ఆదివారం మంగాపురం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.3లక్షలు విరాళంగా ప్రకటించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, ఝాన్సీకృష్ణ దంపతులను స్థానికులు సన్మానించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో సహా వచ్చారు. కొందరు తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి కొండపైకి చేరుకుని ఆర్తితో అమ్మవారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా జరిగేందుకు ఈవో వీకే శీనానాయక్, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. ఉదయం 10.30 నుంచి అంతరాలయ దర్శనం నిలిపేసి అందరికీ కనకదుర్గమ్మ సర్వదర్శనం ఏర్పాటు చేశారు. అన్ని ప్రొటోకాల్ దర్శనాలు నిలుపుదల చేస్తున్నట్టు మైక్ ప్రచారం చేశారు. అటు ఘాట్ రోడ్డు, ఇటు కనకదుర్గానగర్ రెండు వైపులా భక్తులు ప్రవాహంలా రావడంతో అన్ని దర్శనం టిక్కెట్స్ రద్దు చేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ ఆధ్వర్యంలో అదనపు పోలీసు సిబ్బందిని నియమించారు.

తప్పిపోయిన బాలుడు..

దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన భక్తురాలు లావణ్య తన నాలుగేళ్ల కుమారుడితో ఆదివారం వచ్చింది. దర్శనానంతరం కుమారుడు శశివజ్ర ఆరూష్ మహామండపం 7వ అంతస్తులో తల్లి నుంచి విడిపోయి తప్పిపోయాడు. దీంతో లావణ్య ఎక్కడ వెతికినా కనిపించలేదు. సీఎం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఫైర్ డిపార్టుమెంట్‌కు చెందిన ఏఎస్ఐ ఆర్వీ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని లిఫ్ట్ వద్దకు బయలుదేరాడు. ఆ మార్గంలో ఏడుస్తున్న బాలుడిని ఇద్దరు భక్తులు వివరాలు అడుగుతుండగా ఏఎస్ఐ వెళ్లి బాలుడిని ఆరా తీస్తుండగా ఆ భక్తులు వెళ్లిపోయారు. దీంతో ఏఎ స్ఐ ఆ బాలుడిని ఎత్తుకుని ఈవో కార్యాలయం వద్దకు వెళ్లి ఈవోకు అప్పగించారు. దీంతో ఈవో మైక్ ప్రచార కేంద్రం వద్ద ఉన్న తల్లికి సమాచారం ఇచ్చి తన కార్యాలయానికి పిలిపించుకున్నారు. ఈవో శీనానాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ భక్తురాలు లావణ్యకు కుమారుడిని అప్పగించారు. సమయస్ఫూర్తితో బాలుడిని ఈవోకు అప్పగించిన ఏఎస్ఐ ఆర్వీ సత్యనారాయణను ఈవో, ఛైర్మన్ అభినందించారు.ఇదిలా ఉండగా ఈ ఘటనపై తొలుత సోషల్ మీడియాలో కిడ్నాప్ అంటూ ప్రచారం జరిగింది. అలాంటిదేం జరగలేదంటూ ఈవో, ఛైర్మన్ ఖండించారు.

వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడిగా మనోహర్‌నాయుడు

విజయవాడ: విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (వీబీఎఫ్ఎస్) అధ్యక్షుడిగా టి.మనోహర్‌నాయుడు ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన కార్యవర్గాన్ని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జక్కంపూడి ప్రసాద్, కార్యదర్శిగా కె. లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా ఏబీఎస్ సాయిరామ్, కోశాధికారిగా కొండపల్లి రవి ఎన్నికయ్యారు. వర్కింగ్ కమిటీ సభ్యులు జి.లక్ష్మి, గోళ్ల నారాయణరావు, విశ్వేశ్వరరావు, వీజీఎస్ రామారావు, ఏ.భాస్కరరావు, బి.రవికుమార్, బీవీ బసవరాజు, కె.శ్రీనివాస్, వి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ నాగిరెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, వల్లూరి శివప్రసాద్, కె.సత్యరంజన్, చలపాక ప్రకాష్ ఎన్నికయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎస్. వెంకటరమణ, పెనుగొండ లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

లిప్ సింక్ చేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

పాడుతున్నట్టుగా ఒక వీడియోను సృష్టిస్తుంది.

ఈ యాప్‌లతో ఇష్టానుసారంగా...

నకిలీ వీడియోలను తయారు చేయడానికి సైబర్ నేరగాళ్లు ఇప్పటి వరకు మార్ఫింగ్ టూల్స్‌ను ఉపయోగించారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత చాలా సులువుగా వాస్తవికతకు దగ్గరగా ఉండేలా నకిలీ వీడియోలకు ప్రాణం పోస్తున్నారు. ముఖ్యంగా రాజకీయ నేతల ఫొటోలతో ఈ వీడియోలు తయారు చేస్తున్నారు. ఇందుకోసం అనేక ఏఐ యాప్‌లు ఉపయోగిస్తున్నారు. వావ్2లిప్, హైజెన్, రీఫేస్, డబ్‌వెర్స్, డీ-ఐడీ, డీప్ ఫేస్ ల్యాబ్ వంటి యాప్‌లను ఉపయోగిస్తున్నారు.

స్టువర్టుపురం దొంగలొచ్చారు!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతానికి చెందిన ఆరుగురు నిందితులను ఆదివారం వేకువజామున సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 65వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65)పై పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, విజయవాడ వైపు ఏపీ 27 ఏవై 1777 నెంబరు కలిగిన స్కార్పియో వాహనం పోలీసులను చూసి ఆగింది. అందులోని వ్యక్తులు వాహనాన్ని వదిలి పారిపోవటంతో అనుమానంతో వెంబడించిన పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆవ్యక్తిని రహస్య ప్రాంతంలో ఉంచి విచారించారు. విచారణలో మొత్తం ఆరుగురున్నట్టు తెలుసుకున్నారు. ఈ ఆరుగురు వ్యక్తులు చీరాల నుంచి బయలుదేరగా ఇందులోని ఒక వ్యక్తి తన బైకును ఫైనాన్సర్ దగ్గర కుదవపెట్టి వచ్చిన డబ్బుతో పట్టణంలోని కార్ ట్రావెల్స్ దగ్గర వాహనాన్ని అద్దెకు తీసుకుని దోపిడీకి బయలుదేరినట్లు తెలిసింది. వాహనం వెనుకభాగంలో ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అనే స్టిక్కర్ అంటించి ఉంది. దీనిపై ఎస్ఐ తోట సూర్యశ్రీనివాసరావును వివరణ కోరగా తనిఖీల్లో వాహనాన్ని మాత్రమే స్వాధీనం చేసుకున్నామని, వ్యక్తిని అదుపులోకి తీసుకోలేదని వాహన రిజిస్ట్రేషన్ ఆధారంగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత సీసీఎస్ పోలీసులు స్టువర్టుపురం బ్యాచ్‌ను విజయవాడలోని వన్‌టౌన్ సీసీఎస్ పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి తమ స్టైల్‌లో విచారిస్తున్నారు. సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్నవారంతా పాతనేరస్తులని తెలిసింది. కొన్ని రోజులుగా ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామ, మైలవరం నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాలలో గొర్రెలు, మేకలు పెద్ద సంఖ్యలో దొంగతనానికి గురైనట్లు తెలిసింది.

చెరువు తూములో ఇరుక్కుని గిరిజన మృతి

(5వ పేజీ తరువాయి)

సమాచారం అందించారు. గోపయ్య మృతదేహం తూములోని వరద ఉధృతికి కొంత దూరం కొట్టుకుపోయి ఓ పొదలో చిక్కుకుంది. గుర్తించిన స్థానికులు బయటకు తీశారు. మృతుడుకి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతునట్టు ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. కాగా, టీడీపీ కార్యకర్త భూక్యా గోపయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, పార్టీ సహాయ నిధి నుంచి వచ్చే నగదును త్వరితగతిన మంజూరు చేయించి అందజేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు భరోతు పీక్లా నాయక్ తెలిపారు.

అమరావతి కేంద్రంగా.. ఇక సీఆర్‌డీఏ పాలన

(5వ పేజీ తరువాయి)

వారంతా ఇక్కడే పనిచేస్తారు. విజయవాడ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ పనిచేసే అవకాశం ఉంది.

శాఖల వారీగా కేటాయింపులు ఇలా..

గ్రౌండ్ ఫ్లోర్ 23,184 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంది. ఇందులో పబ్లిక్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, రెస్టారెంట్, బ్యాంక్, ఏఐ కమాండ్ సెంటర్‌లు ఉంటాయి. ఫస్ట్ ఫ్లోర్ 30,886 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంది. ఈ ఫ్లోర్‌లో కాన్ఫరెన్స్ హాల్స్ ఉంటాయి. రెండవ ఫ్లోర్‌లో 30,886 చదరపు అడుగుల స్థలం ఉంది. ఈ ఫ్లోర్‌లో సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం ఉంటుంది. మూడవ ఫ్లోర్ విస్తీర్ణం 32,096 చదరపు అడుగులు ఉంది. ఈ ఫ్లోర్‌ను అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) కార్యాలయానికి కేటాయించారు. నాల్గవ ఫ్లోర్‌లో 30,682 చదరపు అడుగుల స్థలం ఉంది. ఈ ఫ్లోర్‌లో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) ప్రధాన కార్యాలయానికి కేటాయించారు. ఐదవ ఫ్లోర్‌లో 32,096 చదరపు అడుగుల స్థలం ఉంది. దీనిని సీఆర్డీఏ (ఏడీసీఎల్)కు కేటాయించారు. ఆరవ ఫ్లోర్‌లో 32,096 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంది. ఈ ఫ్లోర్‌ను ఏడీసీఎల్‌కు కేటాయించారు. ఏడవ ఫ్లోర్‌ను మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి చాంబర్, ఏఎంయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ చాంబర్, పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీ, ఏడీసీఎల్ టెర్రస్, పీఈబీ డైనింగ్, హెడ్ రూమ్స్ వంటి వాటికి కేటాయిచారు.

వివాదాల జనార్దన!

(5వ పేజీ తరువాయి)

సమాధానం వస్తుంది. 2021 నుంచి పరుగులు తీసిన జనార్దనరావు జాతకం తెలంగాణలోని బార్ నిర్వహణలో భాగస్వాములు మధ్య వచ్చిన వివాదంతో తిరగబడింది. మొత్తం తన బావతో కలిసి ఏడుగురు భాగస్వాములతో హైదరాబాద్‌లో ఈ సెవెన్ బార్‌ను ఏర్పాటు చేశారు. ఇది కొంతకాలం బాగానే నడిచిం ది. తర్వాత భాగస్వాముల మధ్య వివాదాలు ప్రారంభమయ్యాయి. భాగస్వాము ల్లో ఒకరైన షరీఫ్ అనే వ్యక్తి మొత్తం బాధ్యతలను నిర్వహించేవాడు. వ్యాపారం సాగుతున్న భాగస్వామికి ఇవ్వాల్సిన లాభాలు ఇచ్చేవాడు కాదు. దీంతో జనార్దనరావు గొడవ చేయడం మొదలుపెట్టాడు. భాగస్వాములకు వచ్చిన లాభాలను పంచకపోతే ఎలా అంటూ మిగిలిన వారిని రెచ్చగొట్టేవాడు. ఈ క్రమంలోనే షరీ ఫ్‌కు జనార్దనరావుకు వివాదం జరిగింది. జనార్దనరావుకు బార్‌తో సంబంధం లేకుండా షరీఫ్ చేశాడు. ఈ పంచాయతీని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఒక ఎమ్మెల్యే చేసినట్టు తెలిసింది. ఆ తర్వాత జనార్దనరావు హైదరాబాద్‌లో బార్‌ను వదిలేసి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఏఎన్ఆర్ బార్‌ను సంపాదించాడు.

రేషన్ మాఫియా ఆగడాలు!

(5వ పేజీ తరువాయి)

అధికారుల మెతకవైఖరితో మాఫియా రెచ్చిపోతోంది. గ్రామాల్లో ఎవరైనా బియ్యం వాహనాలను అడ్డగిస్తే మాఫియా దాడులకు సైతం వెనకాడటం లేదు. పోలీసు కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తుండటంతో జంకుతున్నారు.

బియ్యం రవాణా వాహనాలు ఆపితే దౌర్జన్యమే..

రెండు రోజుల క్రితం వీరులపాడు మండలం జుజ్జూరు - అల్లూరు గ్రామాల మధ్య రేషన్ బియ్యంతో వెళుతున్న ఒక ఆటోను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక వీఆర్వో అడ్డగించారు. ఈలోగా కొందరు విలేకరులు ఘటనా స్థలానికి వెళ్లి ఫొటోలు తీశారు. విషయం తెలియగానే మాఫియాకు చెందిన వ్యక్తి, డజను మంది అనుచరులతో వచ్చి అక్కడున్న అందర్ని బెదిరించి, దౌర్జన్యంగా బియ్యం ఆటోను తీసుకువెళ్లారు.

వారం క్రితం నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో రెండు బియ్యం ఆటోలను గ్రామస్థులు అడ్డగించి, అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చారు, తర్వాత ఆటోలు మాయమయ్యాయి. కనీసం కేసులూ లేవు. దీనిపై పత్రికల్లో కథనాలు రావటంతో ఆటోను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేయటం గమనార్హం.

కానిస్టేబుల్ దంపతుల ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే సురేంద్రబాబు కుటుంబ సభ్యుల ప్రమేయం లేదు
- దాడి చేసుకున్న ఇరువర్గాలపై కేసులు: అనంతపురం డీఎస్పీ

అనంతపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య తలెత్తిన ఘర్షణ నేపథ్యంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుళ్లు, అనుచరులు దాడి చేశారని ఏఆర్ కానిస్టేబుల్ హరినాథ్, ఆయన భార్య సుజాత చేసిన ఆరోపణలు అవాస్తవమని అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆదివారం అనంతపురం నగరంలోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. అనంతపురంలోని ఎలైట్ అపార్ట్‌మెంట్ కింది ఫ్లోర్‌లో ఏఆర్ కానిస్టేబుల్ భువన్ చక్రవర్తి, ఫస్ట్ ఫ్లోర్‌లో మరో ఏఆర్ కానిస్టేబుల్ హరినాథ్ కుటుంబాలు ఉంటున్నాయి. కొంతకాలం ఈ రెండు కుటుంబాలు కలిసిమెలిసి బాగానే ఉన్నాయి. రెండు నెలల క్రితం హరినాథ్ పిల్లలు క్రికెట్ ఆడుతుండగా... బాల్ వెళ్లి భువన్ చక్రవర్తి కొత్తగా తెచ్చుకున్న కారుకు తగిలింది. దీంతో భువన్ చక్రవర్తి కుటుంబ సభ్యులు.. 'ఇక్కడ క్రికెట్ ఆడొద్దండి.. వాహనాలున్నాయి కదా.. డ్యామేజీ అవుతాయి' అని హరినాథ్ పిల్లలకు చెప్పారు. అయినా ఆ పిల్లలు పెడచెవిన పెట్టారు. వారిని హరినాథ్ వెనకేసుకొచ్చారు. దీంతో ఆ రెండు కుటుంబాల మధ్య వివాదం తలెత్తింది. ఇదే క్రమంలో ఈ నెల 10వ తేదీన హరినాథ్ కుమారుడు, అతడి సంబంధీకుడు ప్రభాకర్ క్రికెట్ ఆడుతుండగా.. భువన్ చక్రవర్తి భార్య కల్యాణి వచ్చి ఇక్కడ ఆడకూడదంటూ అభ్యంతరం చెప్పారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాల్లోని మహిళలు వాగ్వాదం చేసుకోవడంతో పాటు నెట్టుకున్నారు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను మందలించారు. ఆ తర్వాతి రోజు కూడా హరినాథ్ భార్య సుజాత, భువన్ చక్రవర్తి భార్య కల్యాణి మరోసారి సిగపట్లు పట్టారు. కొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందులో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుళ్లు, వారి అనుచరుల ప్రమేయమే లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. హరినాథ్, సుజాత రాజకీయ నాయకుల పేర్లు చెప్పి వారిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

జనార్దన్‌రావుపై పీటీ వారెంట్!

- కోర్టులో హాజరుపర్చనున్న అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ అధికారులు

విజయవాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌రావును పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరిచేందుకు అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ పోలీసులు చర్యలు చేపట్టారు. జనార్దన్‌రావును ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ అధికారులు ఇప్పటికే కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన నెల్లూరు జిల్లాలోని కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అన్నమయ్య జిల్లాలో నమోదు చేసిన కేసులోనూ జనార్దన్‌రావు ఏ1 నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో ఆయన్ను కోర్టులో హాజరుపరిచేందుకు అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ పోలీసులు పీటీ వారెంట్ సిద్ధం చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో దీనిని కోర్టులో దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి.

హనీట్రాప్‌తో 11 లక్షలు దోపిడీ

- ఇంకా కావాలంటూ బ్లాక్ మెయిల్
- బాధితుడి ఆత్మహత్యాయత్నం.. పోలీసులకు ఫిర్యాదు
- తెలంగాణ పోలీసుల అదుపులో నిందితుడు

మార్కాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన ఓ యువకుడు ఫేస్‌బుక్‌లో పరిచయమైన అమ్మాయితో కలిసి.. తెలంగాణకు చెందిన మరో విద్యార్థిని ట్రాప్ చేశాడు. ఆమెతో అతనికి 'న్యూడ్ కాల్స్ చేయించి.. ఆ వీడియోలు ఆన్‌లైన్‌లో పెడతానని బెదిరించి.. రూ.11 లక్షలు కాజేశాడు. చివరకు పోలీసులకు చిక్కాడు. మార్కాపురానికి చెందిన సంజయ్ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఆయనకు ఫేస్‌బుక్ ద్వారా విజయవాడకు చెందిన ఓ యువతి పరిచయమైంది. ఆమెతో కలిసి హనీట్రాప్ ద్వారా డబ్బులు సంపాదించాలని సంజయ్ యోచించాడు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా హత్నూరు మండలం కోనంపేటకు చెందిన ఓ విద్యార్థికి ఆ యువతితో వీడియో కాల్ చేయించేవాడు. ఆ కాల్స్‌ను రికార్డు చేసిన సంజయ్ వాటిని తెలంగాణ విద్యార్థి వాట్సాప్ నంబర్‌కు పంపాడు. తనకు డబ్బులివ్వకుంటే వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో పలు దఫాలుగా సంజయ్ చెప్పిన వివిధ బ్యాంకు ఖాతాలకు రూ.11 లక్షలు పంపాడు. అయినా ఇంకా డబ్బులు కావాలంటూ సంజయ్ వేధిస్తుండటంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేశాడు. తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు ఆదివారం మార్కాపురం వచ్చి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. డబ్బులు ఖాతాల్లో పడిన సంజయ్ స్నేహితులను కూడా సంగారెడ్డికి తీసుకెళ్లారు.

ప్రపంచస్థాయిలో తెలుగురాష్ట్రాలు:యనమల

అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తన విజన్‌తో రెండు తెలుగు రాష్ట్రాలను ప్రపంచ స్థాయిలో నిలబెట్టారని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. చంద్రబాబు సీఎంగా 15 ఏళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి చంద్రబాబు అంకుఠిత దీక్షతో పనిచేస్తున్నారన్నారు.

జగన్ హయాంలోనే 'కల్తీ'కి పురుడు :పంచుమర్తి

కల్తీ మద్యం పురుడు పోసుకున్నది వైసీపీ హయాంలోనేనని మండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. వైసీపీ పాపాల్ని తుడిచే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. నకిలీ మద్యంపై మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. గొడ్డలిపోటు నుంచి గులకరాయి వరకు మీ డ్రామాలు చూశామని, తప్పు చేసి నెపాన్ని తమపై నెట్టడం అలవాటేనని వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతరిస్తున్న జాతుల్లో భారతీయ తోడేలు

ముంబై, అక్టోబరు 12: ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన తోడేలు వంశాల్లో ఒకటైన భారతీయ తోడేలు(కానిస్ లూపస్ పల్లిప్స్) మనుగడ ప్రమాదంలో పడింది. ఈ జాతి తోడేళ్ల సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతోంది. 2023-24 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా ఈ తోడేళ్లు.. 2,877 నుంచి 3,310 వరకు మాత్రమే ఉన్నట్టు భారతీయ పరిశోధకులు అంచనా వేశారు. దీంతో వీటిని అంతరించిపోతున్న జాతులుగా గుర్తించిన అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సమితి(ఐయూసీఎన్).. వీటిని ఈ నెల 10న తొలిసారిగా ప్రమాదంలో ఉన్న జాతుల జాబితాలో చేర్చింది. 1995లో చివరిసారిగా మొరాకోలో కనిపించిన స్లెండర్-బిల్డ్ కర్లీ అనే వలస పక్షి జాతి పూర్తిగా అంతరించిపోయినట్టు ఐయూసీఎన్ ప్రకటించింది.

ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఆరెస్సెస్ కార్యకలాపాలు నిషేధించాలి

- కర్ణాటక సీఎంకు మంత్రి ప్రియాంక్ ఖర్గే లేఖ

బెంగళూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ సీఎం సిద్దరామయ్యకు మంత్రి, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, పబ్లిక్ మైదానాల్లో ఆరెస్సెస్ తన 'శాఖ'లను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. నినాదాలు చేస్తూ పిల్లలు, యువత మనసుల్లో ప్రతికూల ఆలోచనలను నాటుతోందని ఆరోపించారు. ఆరెస్సెస్ నమ్ముతున్న వ్యవస్థ భారతదేశ ఐక్యత, లౌకిక భావనకు విరుద్ధమని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని జోక్యం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో యూపీఐతో ఫీజుల వసూలు

న్యూఢిల్లీ, అక్టోబరు 12: పాఠశాలల్లో విద్యార్థుల నుంచి తీసుకునే ఫీజుల వసూలుకు యూపీఐ(యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు పాఠశాలల్లో యూపీఐ చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు ఎన్‌సీఈఆర్‌టీ, సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) తదితర బోర్డులకు కేంద్ర విద్యా శాఖ లేఖలు పంపింది. ఇకపై, ఫీజులను యూపీఐ ద్వారా వసూలు చేసుకోవాలని ఆ లేఖల్లో స్పష్టం చేసింది. నగదు రహిత విధానం వల్ల పాఠశాలల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొంది.

విజయవాడ తూర్పు



దుర్గగుడిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆదివారం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి పూజలు నిర్వహించి, అర్చనాది కార్యక్రమాలను పూర్తిచేసి మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందజేశారు. ఉభయదాతలు పాల్గొని సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు.



టీటీడీ నిత్యాన్నదాన పథకానికి కూరగాయల వితరణ

భారతీనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి శ్రీరామచంద్రనగర్ కాలనీ నుంచి ఆదివారం దాతలు వడ్లపట్ల నాగేశ్వరరావు, సామ్రాజ్యం దంపతులు, కుటుంబ సభ్యులు అట్లూరి వెంకట రవీంద్ర, హరిత దంపతులు, తూమాటి సత్యచంద్రశేఖర్, జ్యోతి దంపతుల సహకారంతో 11టన్నుల కూరగాయలను పంపించారు. కూరగాయల లారీని దాతలు అట్లూరి వెంకట రవీంద్ర, హరిత దంపతులు జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.




కనకదుర్గా ఆఫీసర్స్ కాలనీ సమీపంలో, గురునానక్ కాలనీ రోడ్లో ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో రోడ్డుపై వాహనాల పార్కింగ్

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

● రమేష్ ఆసుపత్రి జంక్షన్ నుంచి ఆటోనగర్ వరకు ఎక్కడికక్కడ రోడ్ల మీద వాహనాల పార్కింగ్ ● ట్రాఫిక్‌కు అంతరాయం

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: అసలే ఇరుకు రోడ్డు అనుకుంటే దానికితోడు రోజురోజుకు పెరిగిపోతున్న అక్రమ వాహనాల పార్కింగ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదవ నెంబర్ రోడ్లో రమేష్ ఆసుపత్రి జంక్షన్ నుంచి ఆటోనగర్ వరకు ఈ రోడ్డుకు ఇరువైపుల పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సంబంధించి కార్యాలయాలు, హోటల్స్ షాపింగ్ మాల్స్ కల్యాణ మండపాలు ఉన్నాయి. వాటికోసం వచ్చే ప్రజలు తమ వాహనాలను సమీపంలోని రోడ్లో పార్కింగ్ చేస్తున్నారు. అంతే



గురునానక్ రోడ్లో సాయంత్రం వేళలో నిలిచిన ట్రాఫిక్

కాకుండా చిరువ్యాపారులు కూడా ఈ రోడ్లో పెద్దసంఖ్యలో ఉండడంతో వాటి కోసం వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డు మీద నిలిపివేస్తున్నారు. ఈ వాహనాలు గంటల కొద్ది నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్ వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది.

ఉదయం, సాయంత్రం వేళ్లలో ఈ రోడ్లో ప్రయాణించాలంటే ట్రాఫిక్‌లో ఎక్కువ టైం కేటాయించాల్సి వస్తుందని వాహనదారులు అంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

నేటి నుంచి సీపీఆర్‌పై జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని




జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుహాసిని

విజయవాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఆసుపత్రిలో సీపీఆర్ కార్డియో పల్మనరీ రిసాసిటేషన్‌పై ఈ నెల 13(సోమవారం) నుంచి 17 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలను ఆదివారం వైద్యాధికారులు, సిబ్బందికి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. ప్రతిచోట భారత వలంటీర్ల వీధుల్లో సీపీఆర్ డెమో నిర్వహించి ప్రజలకు మెలకువలు నేర్పుతారని వెల్లడించారు. పాఠశాలలు, కమ్యూనిటీ సెంటర్లలో సీపీఆర్ చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థుల్లోనూ అవగాహన కల్పిస్తామన్నారు. సీపీఆర్‌పై విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తతో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చుని, ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని ఆమె సూచించారు.

పోలీస్ నేషనల్ యోగాసన పోటీలు నేటి నుంచి

భారతీనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 2025-26 పోలీస్ నేషనల్ యోగాసన పోటీలు సోమవారం నుంచి నిర్వహిస్తునట్లు ఏపీ యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు గొట్టిపాటి వెంకటరామకృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 18 వరకు అమరావతిలోని విట్ యూనివర్సిటీలో జరుగుతాయని అన్నారు. ఈ పోటీలను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి కేంద్రంగా యోగా అకాడమీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.





వర్తమాన సమస్యలకు ప్రతిబింబంగా కలువల కొలను

విజయవాడ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎంతో విలువైన సమాచారాన్ని మనకు అందించగల కళలు, సాహిత్యం పట్ల నేటి యువతరం ఆసక్తి చూపకపోవడం ప్రమాద సంకేతం అని సుప్రసిద్ధ కవి, నవలా రచయిత సాగర్ శ్రీరామకవచం తెలిపారు. ఆదివారం ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ప్రముఖ కవి కారంచేటి విజయకుమార్ (తెనాలి) రచించిన కలువల కొలను కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. పుస్తక ఆవిష్కరణ చేసిన శ్రీరామకవచం ప్రసంగం కొనసాగిస్తూ విజయ్‌కుమార్ ఈ కవితా సంపుటి ద్వారా సమకాలీన సమస్యలను ప్రతిబింబింప చేశారని అభినందించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు ప్రసంగిస్తూ ప్రజల్ని చైతన్యపరిచి అభ్యుదయపథంలో నడిపేదే కవిత్వం అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు విజయకుమార్ కవిత్వం సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా వుందని ప్రశంసించారు. ఎక్స్‌రే ఉపాధ్యక్షుడు కందికొండ రవికిరణ్ సభాధ్యక్షుడిగా మాట్లాడుతూ తమ సంస్థలో కవిత్వ రచనలో అక్షరాలు దిద్ది నేడు గ్రంథ రచయిత స్థాయికి ఎదిగిన విజయకుమార్ కృషి అభినందనీయం అన్నారు. గ్రంథ రచయిత కారంచేటి విజయకుమార్‌కు సత్కారం జరిగింది. విజయకుమార్ గ్రంథ రచన నేపథ్యాన్ని వివరించి, తనను ప్రోత్సహించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తొలుత సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య స్వాగతం పలికి, చివరగా వందన సమర్పణ చేశారు. సంస్థ సభ్యులు గోపు రాము, డాక్టర్ బి.వసంతకుమార్, పొత్తూరి సీతారామారావు, తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కవులు, రచయితలు పాల్గొన్నారు.

కవితా సంపుటి ఆవిష్కరణ సభలో శ్రీరామకవచం



కలువల కొలను కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించిన శ్రీరామకవచం

టూ వీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్
నూతన కమిటీ సభ్యుల ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

భారతీనగర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పటమట హైస్కూల్ రోడ్లోని ది విజయవాడ టూ వీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సభ్యుల సమావేశం జరిగింది. ఈసమావేశంలో అసోసియేషన్ నూతన కమిటీ సభ్యుల ఎన్నిక జరిగింది. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎండి ఫిరోజ్, అధ్యక్షుడిగా ఎస్. ఆంజనేయదాసు, ఉపాధ్యక్షుడిగా బి. వెంకటరమణ, కార్యదర్శిగా ఎండీ జానీ, కోశాధికారిగా ఇర్ఫాన్ బేగ్ ఎన్నికయ్యారు. మిగతా కమిటీ సభ్యులు యధావిధంగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సమావేశంలో ది విజయవాడ టూ వీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన 62 మంది సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులపై ప్రభుత్వం చిన్నచూపు

● రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం

విజయవాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యులను ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని సంఘ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు యూజీసీ స్కేల్‌ను అనుసరించి జీతాలు ఇస్తామని 1996లోనే జీవో ఇచ్చినప్పటికీ అమలులో జాప్యంతో తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు. 2006లో రావాల్సిన పీఆర్సీని 2010లో కొన్ని బెనిఫిట్లు తగ్గిస్తూ ఇచ్చారని తెలిపారు. 2019లో అప్పటి ప్రభుత్వం వైద్య ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇస్తామని చెప్పి మోసం చేసిందని పేర్కొన్నారు. కనీసం ప్రభుత్వ వైద్యుల సంఘ నాయకులను సంప్రదించకుండా, ఉద్యోగుల అనుమతి లేకుండా ఏపీ మెడికల్ ఎడ్యుకేషన్ స్కేల్స్ (ఏపీఎంఈఎస్) అనే పేరుతో కొత్త స్కేల్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. 2016-2021 మధ్యలో రావాల్సిన జీతాలు ఇవ్వకపోగా, వాటి గురించి ప్రస్తావించకపోవడం వైద్య ఉపాధ్యాయులపై ప్రభుత్వానికున్న నిబద్ధతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. వైద్యులకు ప్రతి ఐదేళ్లకు పీఆర్సీ అమలవుతుందని, ఆలస్యమైన పక్షంలో మధ్యంతర భృతి విడుదల చేయాలని, కానీ రాష్ట్రంలో మాత్రం ప్రతి పదేళ్లకోసారి పీఆర్సీ అమలు చేయడం దారుణమని తెలిపారు.

ప్రమాదకరంగా హై టెన్షన్ వైర్లు

రామలింగేశ్వరనగర్,ఆంధ్రజ్యోతి: నగరంలోని 14వ డివిజన్ శాంతినగర్ వాటర్ లైన్ రోడ్డులో హై టెన్షన్ విద్యుత్ తీగలు స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అదే రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌కు విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. రోడ్డుపైనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోని ఇళ్లను ఆనుకుని ఉంటుంది. దీని వైర్లు చేతికి అందే ఎత్తులో ఉండటంతో స్థానికులు భయపడుతున్నారు. చిన్నారులు ఎవరైనా ఆడుకుంటూ అటుగా వెళితే ఊహించని ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శాంతినగర్ వాటర్ లైన్ రోడ్డులో వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు

కె ర్యాంప్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి

● సినీనటుడు కిరణ్ అబ్బవరం

లబ్బీపేట,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): దీపావళి కానుకగా కె ర్యాంప్ చిత్రాన్ని ఈ నెల 18న విడుదల చేస్తున్నామని సినీనటుడు కిరణ్ అబ్బవరం తెలిపారు.ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం బందరురోడ్డులోని ఒక హోటల్‌లో విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఇప్పటికే విడుదల అయిన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తుందని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేసి తనను ఆదరించాలని ఆయన కోరారు. చేతన్ భరద్వాజ్ తన మూడవ చిత్రానికి సంగీత దర్శకుడుగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు.

నగరాల కార్పొరేషన్, మాచవరం దాసాంజనేయ స్వామి కమిటీల్లో ఇద్దరు సభ్యులు రాజీనామా

వన్‌టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నగరాల కార్పొరేషన్, మాచవరం దేవస్థానం బోర్డులకు నియమించిన సభ్యుల్లో ఇద్దరు తమ పదవుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ రాజీనామా చేశారు. టీడీపీకి ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్నా గుర్తింపు ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం నియమించిన బోర్డు కమిటీల్లో నియామకానికి రాజీనామా చేస్తూ అధికారులకు పత్రాలను అందజేశారు. కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌కు చెందిన బంకా నాగమణిని రాష్ట్ర ప్రభుత్వం ఏపీ నగరాల కార్పొరేషన్ సభ్యురాలిగా నియమించారు. ఆమె ఆ పదవికి రాజీనామా చేశారు. దుర్గాపురానికి చెందిన మద్దాల రుక్మిణిని రాష్ట్ర ప్రభుత్వం మాచవరం శ్రీదాసాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలిలో సభ్యురాలిగా నియమించింది. ఆమె ఆ పదవికి రాజీనామా చేశారు.

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే

మానసిక వైద్యుడు అయోధ్య



ప్రసంగిస్తున్న ప్రముఖ మానసిక వైద్యుడు అయోధ్య

గవర్నర్‌పేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో.. మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ప్రముఖ మానసిక వైద్యులు అయోధ్య ఆర్‌కే అన్నారు. మానసిక ఆరోగ్య వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం-రోజువారీ జీవితంలో దాని ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన కల్పించారు. బిజీ జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. మూఢనమ్మకాలతో అమూల్యమైన జీవితాన్ని పాడుచేసుకోవద్దని, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వైద్యులను సంప్రదించడం చాలా అవసరమన్నారు. శాస్త్రీయ వైద్యం వైపు మాత్రమే మానసిక రోగులు చూడాలన్నారు. ప్రశాంత జీవన విధానానికి శారీరక వ్యాయామం, మెడిటేషన్, చక్కని ఆహారపు అలవాట్లు, 6 నుంచి 8 గంటల పాటు నిద్ర అవసరమన్నారు. సదస్సులో చారుగుళ్ల రమేష్, సెక్రటరీ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యుగంధరాచార్యకు ఇండియా ఎక్సలెన్స్ అవార్డు

వన్‌టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్ సాధించిన కొత్తపేటలోని కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు ఇండియా ఎక్సలెన్స్ అవార్డు లభించినట్లు ఆ పాఠశాల కమిటీ కార్యదర్శి కూరపాటి చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యుగంధరాచార్య లక్షకు పైగా జాతక పరిశీలనలు చేసి జ్యోతిష్యం అకల్ట్ సైన్స్ విభాగంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించినట్టు తెలిపారు. శనివారం ఢిల్లీలో ప్రైమ్ టైమ్ ఇండియా సంస్థ నిర్వహించిన ఒక కార్యక్రమంలో భారత పూర్వ క్రికెట్ కెప్టెన్ సునీల్ గవాస్కర్ నుంచి అవార్డును యుగంధరాచార్య అందుకున్నారని తెలిపారు.

బంజారా సామాజిక వర్గం ఐకమత్యంగా ఉండాలి

గవర్నర్‌పేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బంజారా సామాజిక వర్గంలో ఐకమత్యం లోపిస్తే భవిష్యత్తు తరాలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆలిండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు పీఎల్ రవీందర్ నాయక్ అన్నారు. సంఘ సమావేశం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 10 లక్షలకు పైగా జనాభా ఉన్న బంజారాల సమస్యలు చట్టసభల్లో ఒక్క ఎమ్మెల్యే కూడా లేకుండా పోవడం బాధాకరమన్నారు. తండాల్లో సమస్యలు ఉన్నాయని, వాటిపై పోరాటాలకు బంజారాలు ఐక్యఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ చక్రి నాయక్ మాట్లాడుతూ సమస్యలపై సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటావత్ రాంబాబు, స్టేట్ కో-ఆర్డినేటర్లు బీబీవీ నాయక్, బద్దే నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, జటావత్ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ లీక్...స్థానికుల అవస్థలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: 11వ డివిజన్‌లోని వివేకానంద రోడ్లోని యలమంచిలి కుటుంబయ్య వీఎంసీ పార్కు సమీపంలో ఉన్నఅండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ పూడికతో నిండిపోయింది. దీంతో తరచూ ఈరోడ్లో ఉన్న మ్యాన్‌హోల్స్ లీకవుతున్నాయి. ఈ సమయంలో మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు, వ్యర్థాలు బయటకు వచ్చి రోడ్డు మీద ప్రవహిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఆ ఆ సమయంలో రోడ్డు మీదకు రావాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




యలమంచిలి కుటుంబయ్య వీఎంసీ పార్కు సమీపంలో లీకవుతున్న మ్యాన్‌హోల్





ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2026



ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ - 2026 కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే, టెలికాం, డిఫెన్స్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాల్లోని ఇంజనీరింగ్ పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. ఇంజనీరింగ్ సర్వీసులో సివిల్స్ లాంటి పోస్టులు ఇవి.

ఖాళీలు 474

UPSC

విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్

విద్యార్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ తదితర అర్హతలు ఉండాలి.

వయస్సు: 2026 జనవరి 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: స్టేజ్ - 1 ప్రిలిమినరీ పరీక్ష, స్టేజ్-2లో మెయిన్ పరీక్ష ఉంటుంది. స్టేజ్-3లో ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ ఉంటుంది. తరువాత మెడికల్ ఎగ్జామినేషన్ కూడా ఉంటుంది.

ప్రిలిమినరీ పరీక్ష: రెండు ఆబ్జెక్టివ్ టైప్(మల్టిపుల్ చాయిస్) తరహా ప్రశ్న పత్రాలు ఉంటాయి. ఇవి 500 మార్కులకు ఉంటాయి. ఇందులో 200 మార్కులకు పేపర్-1 ఉంటుంది. దీనిని రెండు గంటల్లో పూర్తి చేయాలి. 300 మార్కులకు పేపర్-2 ఉంటుంది. వ్యవధి మూడు గంటలు. ఇందులో కోర్ ఇంజనీరింగ్ సబ్జెక్టులపై ప్రశ్నలు ఉంటాయి. అలాగే నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

మెయిన్స్ పరీక్ష: ఇది పూర్తిగా డిస్క్రిప్టివ్ పరీక్ష. ప్రిలిమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన వారిలో 1:6 లేదా 1:7 మందిని మెయిన్స్‌కు పిలుస్తారు. అంటే యావరేజీగా 2844 నుంచి 3318 మందికి మెయిన్స్ రాసే అవకాశం లభించవచ్చు. ఇందులో కూడా రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపరుకు 300 మార్కులు. ఇవి పూర్తిగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పేపర్లు. ఒక్కో పేపర్ వ్యవధి మూడు గంటలు.

ఇంటర్వ్యూ: చివరగా ఇంటర్వ్యూ ఉంటుంది. దీనికి 200 మార్కులు కేటాయించారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. దీనిలో అభ్యర్థుల ఆలోచించే తీరు, తెలివి తేటలు, నాయకత్వ లక్షణాలను పరిశీలిస్తారు.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 16

ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 2026 ఫిబ్రవరి 8

మెయిన్స్ పరీక్ష: 2025 జూన్ 21

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

దిక్సూచి

నవోదయ విద్యాలయాల దరఖాస్తు గడువు అక్టోబర్ 21

జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో 9వ, 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి(లేటర్ ఎంట్రీ)కి దరఖాస్తుల గడువు 2025 అక్టోబర్ 21. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఆధునిక విద్యను అందించడం జేఎన్‌వీల ముఖ్య ఉద్దేశం.

● దేశ వ్యాప్తంగా 653 జేఎన్‌వీలు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు 9 నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తారు. విద్యార్థి తను దరఖాస్తు చేయాలనుకున్న జిల్లా స్థానిక అభ్యర్థి అయి ఉండాలి. ఆయా జిల్లాల్లో 2025-26 విద్యా సంవత్సరాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి, పదో తరగతి చదువుతూ ఉండాలి.

పరీక్ష: మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. రెండున్నర గంటల్లో సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది.

పరీక్ష తేదీ: 2026 ఫిబ్రవరి 7

వెబ్‌సైట్: navodaya.gov.in/nvs/en/Home1/

ఇండియన్ రైల్వేల్లో ఉద్యోగాలు

నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్)

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు 8050 ఉద్యోగాలతో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్) సెంట్రలైజ్డ్ ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 5000 పోస్టులు గ్రాడ్యుయేట్, 3050 పోస్టులు అండర్ గ్రాడ్యుయేట్ ఉన్నాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల దరఖాస్తులు 2025 అక్టోబర్ 21 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల దరఖాస్తులు 2025 అక్టోబర్ 28 నుంచి ప్రారంభం అవుతాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల చివరి తేదీ 2025 నవంబర్ 20, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల చివరి తేదీ 2025 నవంబర్ 27.

● గ్రాడ్యుయేట్ స్థాయి పోస్టులలో గూడ్స్ రైలు మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, స్టేషన్ మాస్టర్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్ వైజర్, ట్రాఫిక్ అసిస్టెంట్ ఉన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, రైళ్ల క్లర్క్ ఖాళీలు ఉన్నాయి.

వయస్సు: గ్రాడ్యుయేట్ పోస్టులకు 18 నుంచి 33, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు 16-33 ఏళ్ల లోపు ఉండాలి. జోన్లు, విభాగాల వారీగా ఖాళీలతో నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది.



జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్

భారతీయ రైల్వే 2570 పోస్టులతో మరో నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే డివిజన్లలో ఉన్న కింద పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దరఖాస్తులను కోరుతోంది.

పోస్టులు: జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్.

(పూర్తి వివరాలతో నోటిఫికేషన్ త్వరలో వెలువడుతుంది. దీని కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌ను తరచూ చెక్ చేసుకుంటూ ఉండాలి.)

వయస్సు: అభ్యర్థుల వయస్సు 2026 జనవరి 1 నాటికి 18-33 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తులు ప్రారంభం: 2025 అక్టోబర్ 30

చివరి తేదీ: 2025 నవంబర్ 30

రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, సికింద్రాబాద్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువహటి, గోరఖ్‌పూర్, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబాయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సిలిగురి, తిరువనంతపురం,

వెబ్‌సైట్: https://rrbsecunderabad.gov.in/



ఢిల్లీ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 509

ఢిల్లీ పోలీస్ విభాగంలో 509 హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఆసక్తిగల స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు:

- హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) మేల్: 341
- హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్) ఫీమేల్: 168

వయస్సు: 2025 జూలై1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్

చివరి తేదీ: 2025 అక్టోబర్ 20

పరీక్ష తేదీ: 2025 డిసెంబర్/ 2026 జనవరి

వెబ్‌సైట్: https://ssc.gov.in

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో 2025-26 సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అందించే ఈ కోర్సులు అభ్యర్థులు తమ ఆసక్తిని బట్టి రెగ్యులర్, కరస్పాండెన్స్ పద్ధతిలో చదవవచ్చు.

● **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఏడాది. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్

● **డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్

● **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆరు నెలలు. కనీసం విద్యార్హత గ్రాడ్యుయేషన్

● **సర్టిఫికెట్ కోర్స్ ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి మూడు నెలలు. కనీసం విద్యార్హత పదో తరగతి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 18

ఫోన్: 98485 12767, 7286013388

వెబ్‌సైట్: www.apcj.in

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

సెన్సార్ పూర్తి



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా' సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సిద్ధు సరసన శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలుగా నటించారు. ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

అఖండ 2కు మరో ఆకర్షణ





బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అఖండ' చిత్రానికి బాలకృష్ణ నటనతో పాటు తమన్ నేపథ్య సంగీతం సైతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకొంది. ఇప్పుడు మరోసారి 'అఖండ 2' కోసం తమన్ రంగంలోకి దిగారు. ఇటీవలే ఆయన ఈ చిత్రం బ్యాగ్రౌండ్ స్కోర్‌ను ప్రారంభించారు. సంస్కృత శ్లోకాలను అద్భుతంగా పఠించే నైపుణ్యంతో ప్రసిద్ధి చెందిన పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సోదరులు ఇద్దరూ నేపథ్య సంగీతం కోసం తమ అద్భుతమైన గాత్రంతో సంస్కృత శ్లోకాలను, వేద మంత్రాలను పఠించనున్నారని తమన్ తెలిపారు. వారితో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఈ చిత్రంలో సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి విలన్ పాత్ర పోషిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలకపాత్రలో కనిపించనున్నారు.

అంచనాలు రెట్టింపు



రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు పి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ టీజర్‌ని రిలీజ్ చేశారు. సినిమాలను, ఆంధ్ర కింగ్‌ను ఆరాధించే పాత్రలో రామ్ ఒదిగి పోయారు. రామ్ తల్లిదండ్రులుగా రావు రమేశ్, తులసి బాగా నటించారు. ఆసక్తికర సంభాషణలతో మురళీ శర్మ ఆకట్టుకున్నారు. కాగా, ఈ చిత్రంలో ఉపేంద్ర ఆన్ స్ర్కీన్ సూపర్ హీరోగా కనిపించనున్నారు. మొత్తానికి టీజర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

శ్రీకాంత్ అయ్యంగార్ క్షమాపణలు



మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్.. ఆదివారం సోషల్‌మీడియా వేదికగా క్షమాపణలు తెలిపారు. ఇటీవల నేను చేసిన కొన్ని వ్యాఖ్యలు మీ మనోభావాలను దెబ్బతీశాయి. అది నా ఉద్దేశం కాదు. మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమాపణలు. అలాగే, మన దేశానికి స్వాతంత్ర్యం అందించడం కోసం పాటుపడిన మహావీరులందరికి మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాను. జై హింద్ అని పేర్కొన్నారు.

శ్రీకాంత్‌పై 'మా'లో ఫిర్యాదు

మహాత్మా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు శ్రీకాంత్ అయ్యంగార్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలె సైబర్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆయన మా (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణుకు శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. 'భావ ప్రకటన స్వేచ్ఛ అనేది అందరికీ ఈ కాలంలో ఓ ఫ్యాషన్‌గా మారిపోయింది. 'మా' క్రమశిక్షణ కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటాం' అని 'మా' జనరల్ సెక్రటరీ శివబాలాజీ అన్నారు.

అట్టహాసంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం

గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. 'లాపతా లేడీస్' ఉత్తమ చిత్రంగా పురస్కారం అందుకుంది. అత్యధికంగా 13 అవార్డులు దక్కించుకుని సత్తా చాటింది. ఆ సినిమాను తెరకెక్కించిన కిరణ్‌రావు ఉత్తమ దర్శకురాలుగా అవార్డును స్వీకరించారు. 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తిక్ ఆర్యన్, 'ఐ వాంట్ టూ టాక్' చిత్రానికి గాను అభిషేక్ బచ్చన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. 'జిగ్రా' సినిమాకు గాను ఉత్తమ నటిగా ఆలియా భట్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమానికి షారుక్ ఖాన్, కరణ్ జోహార్, మనీష్ పాల్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. 17 ఏళ్ల తర్వాత షారుక్ ఈ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం విశేషం. కాజోల్‌తో కలసి స్టెప్పులేసి అందర్నీ ఆకట్టుకున్నారు. తన ప్రదర్శనతో జీనత్ అమన్‌కు నివాళినిచ్చారు కృతిసనన్.





షారుక్ ఖాన్, కాజోల్



నితాన్షీ గోయెల్



ప్రతిభ

అవార్డులు అందుకున్న మరికొందరి వివరాలు

ఉత్తమ నటుడు (క్రిటిక్స్ ఛాయిస్): రాజ్‌కుమార్ రావు (శ్రీకాంత్)

ఉత్తమ నటి (క్రిటిక్స్ ఛాయిస్): ప్రతిభ (లాపతా లేడీస్)

ఉత్తమ సహాయ నటుడు (క్రిటిక్స్ ఛాయిస్): రవి కిషన్ (లాపతా లేడీస్)

ఉత్తమ సహాయ నటి (క్రిటిక్స్ ఛాయిస్): ఛాయా కదమ్ (లాపతా లేడీస్)

ఉత్తమ చిత్రం: ఐ వాంట్ టూ టాక్ (సూజిత్ సర్కార్)

ఉత్తమ పరిచయ నటుడు: లక్ష్య (కిల్)

ఉత్తమ పరిచయ నటి: నితాన్షీ గోయెల్ (లాపతా లేడీస్)

ఉత్తమ స్ర్కీన్‌ప్లే: నేహా దేశాయ్ (లాపతా లేడీస్)

ఉత్తమ కథ: ఆదిత్య ధర్, మోనాల్ థాక్కర్ (ఆర్టికల్ 370)



ఆలియ భట్

మోగ్లీ రాక ఖరారు



రోషన్ కనకాల కథానాయకుడిగా సందీప్ రాజ్ తెరకెక్కిస్తోన్న 'మోగ్లీ 2025' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తోన్న ఈ చిత్రం డిసెంబరు 12న విడుదల కానుంది. ఇప్పటికే నాని వాయిస్ ఓవర్‌తో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. రోషన్ సరసన సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా నటిస్తున్నారు. బండి సరోజ్ కుమార్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ, కాల భైరవ సంగీతం అందిస్తున్నారు.

నటి డయాన్ కీటన్ కన్నుమూత



ఆస్కార్ విజేత, హాలీవుడ్ దిగ్గజ నటి డయాన్ కీటన్(79) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం తుదిశ్వాస విడిచారు. దాదాపు ఐదు దశాబ్దాలు తన నట జీవితాన్ని కొనసాగించిన ఆమె హాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆమె నటించిన 'అనీ హాల్' సినిమాకు ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డును అందుకున్నారు. 'ది గాడ్‌ఫాదర్' సిరీస్ ఆమెకు గ్లోబల్ స్టార్‌డమ్‌ని తెచ్చిపెట్టింది. డయాన్ ధరించిన ప్రత్యేకమైన సూట్లు, టోపీలు ఫ్యాషన్ ప్రపంచంలో ఓ కొత్త ఒరవడిని సృష్టించాయి.

ఆలోచింపజేసే చిత్రం

రోహిణి హట్టంగడి, రోహిణి ముల్లేటి, సముద్రఖని, హిమాంశు పోఫూరి, సౌమ్య, అనన్య నన్నపనేని ప్రధాన పాత్రధారులుగా అక్కినేని కుటుంబరావు తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఒక మంచి ప్రేమ కథ'. హిమాంశు పోఫూరి నిర్మాత. ఈ మూవీకి కథ, మాటలు, పాటల్ని ఓల్గా అందించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదల వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. చిత్ర దర్శకుడు అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ 'కోట్లు సంపాదించేందుకు పరుగులు పెడుతున్నారు. కానీ తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదు. అందరిలోనూ ఆలోచనను రేకెత్తించేలా ఈ సినిమాను తెరకెక్కించాను. ఎక్కడా బోర్ కొట్టించకుండా నవ్విస్తూ, ఏడ్పించేలా సినిమా తీశాను' అని అన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ 'పెద్దవాళ్లందరూ కలిసి నటించిన చిత్రమే అయినా ఇది యువతరానికి సంబంధించిన కథ' అని చెప్పారు. నిర్మాత హిమాంశు పోఫూరి మాట్లాడుతూ 'సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రతీ ఒక్కరికి నచ్చుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నటి రోహిణి హట్టంగడి, నటి రోహిణి ముల్లేటి తదితరులు పాల్గొన్నారు.



ధర్మ పరిరక్షకుడి కథ



మాస్టర్ మహేంద్రన్, అంబికావాణి ప్రధాన పాత్రధారులుగా వైకుంఠ్ బోను తెరకెక్కిస్తోన్న చిత్రం 'వసుదేవసుతం'. రెయిన్‌బో సినిమాస్ బేనర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ని కథానాయకుడు సత్యదేవ్ ఆవిష్కరించారు. 'ఈ కథ.. ధర్మానికి అడ్డొస్తే..మేనమామ అయినా, లక్షల బంధుగణమైనా, ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా..ధర్మ హింస తథైవచ అన్న శ్రీకృష్ణుడిదే కాదు. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణహోమానికైనా ఎదురెళ్లే ఓ యువకుడిది ' అనే శక్తిమంతమైన సంభాషణలతో ప్రారంభమైన టీజర్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి డీఓపీ : జిజ్జు సన్నీ, సంగీతం: మణిశర్మ.



సాయి మణిదీప్ | శ్రీసాకేత్ | జీవన్ సాత్విక్ | గల్లంతైన షారోన్, గౌతమ్

సరదాగా గడిపేందుకు వెళ్లి.. మృత్యు ఒడికి!

- బాపట్ల జిల్లా చీరాల వాడరేవు తీరంలో విషాదం
- అలల తాకిడికి కొట్టుకుపోయి ముగ్గురు మృతి
- మృతులు అమరావతి 'విట్' కళాశాల విద్యార్థులు
- అక్కడే మరో ఘటనలో ఇంకో ఇద్దరు గల్లంతు

చీరాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవు కావడంతో స్నేహితులతో సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వెళ్లారు. ఉత్సాహంగా సముద్రంలో మునుగుతూ కేరింతలు కొడుతున్నారు. ఈ క్రమంలో వచ్చిన రాకాసి అల వారి ఆనందాన్ని మింగేసి.. మృత్యుఒడికి చేర్చింది. వేర్వేరుగా జరిగిన రెండు ఘటనల్లో ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు మరణించగా.. మరో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు తీరప్రాంతంలో ఆదివారం ఈ పెనువిషాదం చోటుచేసుకుంది. అమరావతిలోని విట్ కళాశాలకు చెందిన బి.సాయి మణిదీప్ (20), వంగల శ్రీసాకేత్ (20), పెంటెల జీవన్ సాత్విక్ (20) మరో నలుగురు మిత్రులతో కలిసి ఆదివారం బస్సులో వాడరేవు తీరానికి వచ్చారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. మణిదీప్ సముద్రంలో ఈతకొట్టే క్రమంలో లోతుకు వెళుతుండగా.. అప్పటికే పలుమార్లు కేకలు వేసిన శ్రీసాకేత్, సాత్విక్.. మణిదీప్‌ను వెనక్కు తెచ్చేందుకు వెళ్లారు. ఆ సమయంలో అలల తాకిడికి మణిదీప్ కొట్టుకుపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించిన ఇద్దరు మిత్రులు కూడా గల్లంతయ్యారు. వారి కోసం గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాసేపట్లోనే అక్కడికి సమీపంలోని ఒడ్డుకు మృతదేహాలు కొట్టుకొచ్చాయి. మరణించిన ముగ్గురూ హైదరాబాద్‌కు చెందిన వారిగా గుర్తించారు. మరోవైపు వేటపాలెం మండలం వడ్డె సంఘం గ్రామానికి చెందిన కుంచన షారోన్ (18) రాజమండ్రిలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన కోట గౌతమ్ (16) చీరాలలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి ఆదివారం వాడరేవు తీరానికి వచ్చారు. సరదాగా సముద్రంలోకి దిగి అలల తాకిడికి గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మిత్రబృందంపై మృత్యుపంజా!

- రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం.. కారును ఢీకొన్న పలు వాహనాలు
- మృతుల్లో ఇటీవలే పెళ్లైన, 31న పెళ్లి కావాల్సిన ఇద్దరు యువకులు
- కర్ణాటకలోని హోసూరు సమీపంలో ఘటన

హోసూరు(క్రైం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఐదునెలల క్రితం పెళ్లి చేసుకున్న మిత్రుడు కెనడా నుంచి వస్తున్నాడని... తీసుకువచ్చేందుకు మిత్రబృందం విమానాశ్రయానికి వెళ్లింది. వారిలో ఈనెల 31న పెళ్లి కావలసిన యువకుడు కూడా ఉన్నాడు. అంతా ఆనందంగా తిరిగి వస్తుండగా రోడ్డుప్రమాద రూపంలో మృత్యువు వారిని కాటేసింది. వీరు ప్రయాణిస్తున్న కారును ఒక లారీతో పాటు పలు వాహనాలు ఢీకొనడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందారు. కర్ణాటక రాష్ట్రం హోసూరు సమీపంలోని గోపసంద్రం వద్ద బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. తమిళనాడులోని ఈరోడ్ జిల్లాకు చెందిన మదన్‌కుమార్ (27) ఐటీ ఉద్యోగి. ఇతడికి ఐదు నెలలక్రితం వివాహమైంది. దీపావళి సెలవుల కోసం కెనడా నుంచి వచ్చాడు. అతడిని తీసుకొచ్చేందుకు తమిళనాడులోని సేలం ప్రాంతం ఓమలూరుకు చెందిన ముగిలన్ (30), బెంగళూరులోని చిక్కనాగమంగల ప్రాంతానికి చెందిన మణివణ్ణన్ (27), గోకుల్ (28) వెళ్లారు. అంతా కలిసి కారులో ఈ రోడ్‌వైపు బయల్దేరారు. గోపసంద్రం వద్ద వ్యాన్ అడ్డు రాడంతో కారు సడన్ బ్రేక్ వేసి ఆపారు. ఆ సమయంలో వెనకే వేగంగా వస్తున్న లారీ వీరి కారును ఢీకొంది. వెనుక వచ్చిన మరో 3, 4 వాహనాలు కూడా ఢీకొన్నాయి. దీంతో కారు నుజ్జునుజ్జయింది. అందులోని నలుగురు యువకులు చనిపోయారు. ప్రమాద సమయంలో కారును మణివణ్ణన్ డ్రైవింగ్ చేస్తున్నాడు. ఇతడు యూపీఎస్సీ పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచిచూస్తుండేవాడు. ఈనెల 31న పెళ్లి జరగాల్సి ఉంది. ముగిలన్, గోకుల్ కూడా టెకీలే.

స్నేహమంటే ఇదేరా!

- 2007లో చిన్ననాటి స్నేహితుడి మృతి
- ఆయన కుమార్తె వివాహం జరిపించిన బాల్య మిత్రులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎవరు ఏమైపోతే మాకేంటిలే.. అనుకొనే రోజులివి! కానీ వారు అలా అనుకోలేదు. ఎప్పుడో 18 ఏళ్ల క్రితం మరణించిన తమ స్నేహితుడి కుమార్తె వివాహానికి పెళ్లి పెద్దలుగా మారారు. పల్లకి మోసి మరీ దగ్గరుండి పెళ్లి చేశారు. మిత్రుడి కుమార్తెను సొంత బిడ్డలాగా పెళ్లి కుమార్తెను చేసి, అత్తారింటి సాగనంపిన అపురూప ఘట్టం నంద్యాల జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. ఆళ్లగడ్డ తాలుకా రుద్రవరం మండలం నల్లవాగుపల్లె గ్రామానికి చెందిన స్నేహితులు ప్రభాకర్, శివకుమార్‌రెడ్డి, చంద్రలాల్, మృత్యుంజేయ, రఘువీర్ రాధాకృష్ణ తదితరులు నంద్యాలలోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో 1982-83లో పదో తరగతి పూర్తిచేశారు. వీరిలో ప్రభాకర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభాకర్ 2007లో అనారోగ్యంతో మృతిచెందారు. అయితే అతని స్నేహితులు.. ప్రభాకర్ కుటుంబానికి ఐదు ఎకరాల భూమి ఇప్పించడంతో పాటు అన్నివిధాలా అండగా నిలిచారు. ప్రభాకర్ భార్య సువర్ణ వ్యవసాయం చేసుకుంటూ కుమార్తెలను చదివించారు. పెద్ద కుమార్తె లక్ష్మీ డిగ్రీ పూర్తి చేసింది. రెండో కుమార్తె బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. లక్ష్మికి ఇటీవల ఆళ్లగడ్డ మండలం దాచేపల్లికి చెందిన పవన్‌తో పెళ్లి నిశ్చయమైంది. ఈ క్రమంలో అదే మండలంలోని రామతీర్థం ఆలయంలో స్నేహితులు దగ్గరుండి వైభవంగా వివాహం జరిపించారు. స్నేహితులు పెళ్లి పనులతో పాటు పెళ్లికుమార్తె పల్లకి కూడా మోసి స్నేహమంటే ఇదేరా! అని చాటి చెప్పారు.



పెళ్లి కుమార్తె పల్లకి మోస్తున్న తండ్రి బాల్యమిత్రులు

నకిలీ మద్యంపై సిట్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైంది. దాంతోపాటు గంజాయి, డ్రగ్స్ కూడా విచ్చలవిడిగా విస్తరించాయి. వాటిపై ఈ ప్రభుత్వం ప్రక్షాళన ప్రారంభించింది. 'ఈగల్' ద్వారా గంజాయిని నియంత్రించాం. వైసీపీ ప్రభుత్వంలో డిస్టిలరీలను బలవంతంగా లాక్కున్నారు. నచ్చిన బ్రాండ్లు అమ్ముకున్నారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు లేకుండా చేశారు. వాటన్నిటిపై మేం వచ్చాక విచారణ ప్రారంభించాం. అయినప్పటికీ భయం లేకుండా నకిలీ మద్యమంటూ బరితెగించారంటే దీని వెనుక కుట్ర ఉందని అర్థమవుతోంది. నేరస్థులు ఎవరైనా సరే, ఎలాంటి ముసుగు కప్పుకొన్నా, ముసుగు తొలగించి కొరడా ఝులిపిస్తాం!

ఈ పరిస్థితి ఇదే తొలిసారి...

నేను సీఎంగా 15ఏళ్లు పూర్తిచేసుకున్నా. 15ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నా. మొత్తం టీడీపీ ప్రభుత్వం 22ఏళ్లు అధికారంలో ఉంది. కానీ, ఎప్పుడూ చూడని వింత ధోరణి ఇప్పుడు కనిపిస్తోంది. 1995 నుంచి ఇప్పటిదాకా నేను సీఎంగా ఉన్నప్పుడు ఎన్నడూ నకిలీ మద్యం చూడలేదు. దాని గురించి మాట్లాడాల్సిన అవసరం రాలేదు. ఇప్పుడు వైసీపీ వల్లే ఆ పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వంలో నాణ్యత లేకపోవడం, ధరలు పెంచడం వల్ల పక్క రాష్ట్రాల మద్యం రాష్ట్రంలోకి వచ్చింది. మేం ఇవన్నీ నియంత్రించాం. ములకలచెరువు ఘటనలో 16 మందిని, ఇబ్రహీంపట్నం ఘటనలో ఏడుగురిని అరెస్టు చేశాం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు మా పార్టీకి చెందినా చర్యలు తీసుకున్నాం. ములకలచెరువు నకిలీ మద్యం బయటపెట్టిందే మా ప్రభుత్వం. దాని లోతుల్లోకి వెళ్లేకొద్దీ షాకింగ్ విషయాలు తెలుస్తున్నాయి. త్వరలో అవి బయటపెడతాం.

వీరితోనే సిట్...

నకిలీ మద్యంపై విచారణకు సిట్‌ను నియమిస్తున్నాం. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి, టెక్నికల్ ఎస్పీ మల్లికా గార్గ్, ఎక్సైజ్‌లో ఒక అధికారితో సిట్ ఏర్పాటుచేస్తున్నాం. ఆఫ్రికాలో నకిలీ మద్యం తయారీ నేర్చుకుని, దానిని ఏపీలో అమలుచేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇకపై ప్రతి మద్యం షాపులో ప్రతి సీసాను స్కాన్ చేసిన తర్వాతే అమ్మాలి. ఈనెల 16 నుంచి అన్ని మద్యం షాపుల్లో సురక్ష యాప్ అమల్లోకి వస్తుంది. వినియోగదారులు కూడా కొనుగోలు చేసిన సీసాలను స్కాన్ చేసి పరిశీలించాలి. ఏవైనా ఫిర్యాదులుంటే 14405 నంబరుకు కాల్ చేసి చెప్పవచ్చు. షాపులో స్కాన్ చేసిన తర్వాత దానిని బెల్టులకు పంపినా తెలిసిపోతుంది. ఎక్కడైనా బెల్టుల్లో అమ్మితే బెల్టు తీస్తాం!

కుట్రలో భాగంగా శవ రాజకీయాలు

కుట్రలో భాగంగా శవ రాజకీయాలు మొదలుపెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో 30వేల మంది నాసిరకం మద్యం వల్ల తీవ్ర వ్యాధులకు గురయ్యారు. జంగారెడ్డిగూడెంలో నకిలీ మద్యం తాగి 27 మంది చనిపోతే చిన్న విచారణజరపలేదు. చివరికి మృతులకు పోస్టుమార్టం కూడా చేయించలేదు. ఇప్పుడు రాష్ట్రంలో ఏ కారణంతో చనిపోయినా నకిలీ మద్యం వల్లే అని ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో భయం, అలజడి సృష్టించి, ప్రభుత్వం విఫలమైందనే ముద్ర వేయాలనే కుట్ర చేస్తున్నారు. ఈ ప్రభుత్వం ఎవరితో లాలూచీ పడదు. నకిలీ మద్యం పేరుతో కుట్రలు చేయాలని చూస్తే సాగవు. ఫేక్ వార్తలు వ్యాప్తి చేస్తే సీరియస్ చర్యలుంటాయి. ఆ వార్తల సోర్స్‌పైనా విచారణ చేస్తాం. నిజాలు చెబితే అభినందిస్తాం.

అదే మీకూ మాకూ తేడా

వైసీపీ హయాంలో నకిలీ మద్యంతో 27 మంది చనిపోయినా పట్టించుకోలేదు. అదే మా ప్రభుత్వంలో ఏలూరులో ఒకరు చనిపోతే వెంటనే పరీక్షలు చేయించాం. అతను ఇతర కారణాల వల్ల చనిపోయారని తేలినప్పటికీ అది నకిలీ మద్యం వల్లే అని ప్రచారం చేసి పైశాచికానందం పొందుతున్నారు. యాచకుల మరణాలనూ నకిలీ మద్యం ఖాతాలో వేసి శవ రాజకీయం చేస్తున్నారు. తప్పుచేసిన వారిలో రాజకీయ నాయకులు, అధికారులు, ఇంకా ఎవరున్నా వదిలిపెట్టం. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని చూసేవారిని కూడా వదలం.

నేరాల్లో ఇరుక్కున్నవారికే అలవాటు

నేరాల్లో ఇరుక్కుపోయినవారికే ఇలాంటి నకిలీ మద్యం నేరాలు చేయడం అలవాటుగా ఉంటుంది. వారు నేరం చేసి ఆ నెపం ఎదుటివారిపై మోపాలని చూస్తారు. గతంలో వివేకా హత్య కేసు ఎలా చేశారో చూశాం. ఇప్పుడు ఎక్సైజ్ మంత్రిని, కార్యదర్శిని విచారించాలని పిచ్చి డిమాండ్లు చేస్తున్నారు. నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు కోరడం... కేసుల డైవర్షన్ కోసం కూడా కావొచ్చు. ఎక్సైజ్ అధికారులు జాగ్రత్తగా ఉండాలి. తప్పు చేస్తే కఠిన చర్యలుంటాయి. ఇకపై మీరు తప్పు చేయలేని విధానం తీసుకొస్తాం. మద్యం నాణ్యత పరిశీలన వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలి. నాణ్యతలో చిన్న తేడా వచ్చినా ఊరుకోం.

24న సీఎం గల్ఫ్ పర్యటన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సీఎం చంద్రబాబు ఈ నెల 24 నుంచి రెండు రోజుల పాటు గల్ఫ్ దేశాలలో పర్యటించనున్నారు. తొలుత దుబాయ్, తర్వాత అబుధాబిలలో పర్యటించనున్న ఆయన.. అక్కడి ప్రవాసాంధ్రులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. పీ-4 సహా పెట్టుబడులపై వారితో చర్చించనున్నారు. ముఖ్యమంత్రి గల్ఫ్ పర్యటనకు కేంద్రం అనుమతిచ్చింది. అదేసమయంలో ప్రవాసులతో భేటీకి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు ముందుకు వచ్చింది. ఇదిలావుంటే, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఈ నెల 16 నుంచి గల్ఫ్ దేశాల్లో పర్యటించాలని భావించారు. ఈ పర్యటన ద్వారా ఆయా దేశాల్లోని ప్రవాసీ మలయాళీలను కలుసుకోవాలని నిర్ణయించారు. విశ్వవ్యాప్తంగా ఉన్న కేరళ ప్రవాసీయులలో మలయాళీ భాష వ్యాప్తి, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించేందుకు ఆయన ఈ పర్యటనకు సిద్ధమయ్యారు. అయితే.. కేంద్రం ఆయనకు అనుమతులు నిరాకరించింది.

రేపు గూగుల్-రైడెన్‌తో ఒప్పందం

- 2029 నాటికి విశాఖలో డేటా సెంటర్ పూర్తి
- దేశంలోనే అతిపెద్ద డేటా హబ్‌గా విశాఖ
- పాలనతో పాటు రాజకీయమూ చేస్తున్నా: బాబు

అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌తో మంగళవారం ఒప్పందం చేసుకునేందుకు ఢిల్లీ వెళుతున్నానని, ఇది తన రాజకీయ జీవితంలో అపూర్వ ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2029 నాటికి విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి చేస్తారని చెప్పారు. ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెడుతున్నామని, ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా గూగుల్ వంటి సంస్థలు రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ హబ్‌గా మారబోతోందని అన్నారు. ఓ వైపు డేటా సెంటర్ మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విశాఖపట్నం రూపురేఖలు మారబోతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తుంటే వాటిని అడ్డుకునేందుకు కొందరు బెదిరింపులకు దిగడం ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. నవంబరులో జరిగే పెట్టుబడుల సదస్సుకు ప్రధాని మోదీని ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం

పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం కల్పిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. అదే సమయంలో కొత్త తరాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, యువతరానికి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు పార్టీ కార్యాలయంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. 15 ఏళ్లు సీఎంగా ఉండటం గొప్ప విశేషమని ప్రధాని తనకు ఫోన్ చేసి చెప్పినప్పుడు, మీరు 25 ఏళ్లు ప్రభుత్వాధినేతగా (ముఖ్యమంత్రి-ప్రధాని) ఉండటం ఇంకా గొప్ప విశేషమని మోదీకి చెప్పానని అన్నారు. రాష్ట్రంలో వైకుంఠపాళి విధానం వల్ల కొన్నిసార్లు అధికారానికి దూరమయ్యానని చెప్పారు. తాను అధికారానికి దూరంగా ఉండటంలో ప్రజల తప్పు లేదని, తానే కొన్ని జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం బాగుండాలనే ఉద్దేశంతో పరిపాలన చేశానే తప్ప మరేదీ ఆలోచించలేదని, ఇప్పుడు పరిపాలనతో పాటు రాజకీయం కూడా చేస్తున్నానని అన్నారు. గత తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నానని తెలిపారు.

ఐదేళ్లలో 30% మహిళా ఉద్యోగులు: ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: రాబోయే ఐదేళ్లలో మహిళా ఉద్యోగుల సంఖ్యను 30 శాతానికి పెంచుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా లింగ వైవిధ్యాన్ని పెంచే వ్యూహాన్ని రూపొందించింది. తమ బ్యాంకులో ఫ్రంట్‌లైన్ సిబ్బందిని చూసినట్టయితే వారిలో మహిళలు 33% ఉన్నారని, మొత్తం సిబ్బందిని చూస్తే మాత్రం 27% మాత్రమే ఉన్నారని, లింగ వైవిధ్యాన్ని మరింత మెరుగుపరచాలనుకుంటున్నామని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ (హెచ్ఆర్), చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కిశోర్ కుమార్ పోలుదాసు చెప్పారు. పురుష, మహిళా ఉద్యోగుల శాతం లో ఈ వ్యత్యాసాన్ని తొలగించి మధ్యకాలికంగా 30% మహిళా సిబ్బంది లక్ష్యం చేరాలన్నది తమ ధ్యేయమని ఆయన తెలిపారు. ఎస్‌బీఐలో ప్రస్తుతం 2.4 లక్షల మంది ఉద్యోగులున్నారు. బ్యాంకింగ్ రంగంలోనే కాకుండా దేశంలోని ఏ ఇతర సంస్థలో అయినా గరిష్ఠ ఉద్యోగుల సంఖ్య ఇదే. మహిళా ఉద్యోగుల సౌకర్యం కోసం తమ బ్యాంక్ క్రెష్ (శిశు రక్షణ కేంద్రం) అలవెన్స్, ఫ్యామిలీ కనెక్ట్ కార్యక్రమం, మాతృత్వ సెలవుల అనంతరం తిరిగి విధుల్లో చేరే మహిళలకు శిక్షణ, సిక్ లీవ్ పెంపు వంటి పలు సౌకర్యాలు కల్పిస్తున్నదని ఆయన వెల్లడించారు. మహిళలు తమ పూర్తి సామర్థ్యాలు వినియోగంలోకి తెచ్చేందుకు వీలుగా వారికి సంపూర్ణ సురక్షిత, సమ్మిళిత వాతావరణం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎస్‌బీఐలో పూర్తిగా మహిళలే నిర్వహిస్తున్న బ్రాంచీల సంఖ్య 340కి పైగా ఉండడమే మహిళల పట్ల తమ చిత్తశుద్ధికి నిదర్శనమని కిశోర్ అన్నారు.

ఓఎన్‌జీసీ: లాభాల్లో ఎంతో మిన్న, మార్కెట్ క్యాప్‌లో మాత్రం చిన్న

అగ్రస్థానం నుంచి 25వ స్థానానికి..

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) షేర్లపై మదుపరులు అంతగా మక్కువ చూపించటం లేదు. గత మూడేళ్లలో ఈ పీఎస్‌యూ దిగ్గజం రూ.1.16 లక్షల కోట్ల లాభాలు నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరానికి చూసినా ఓఎన్‌జీసీ అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.38,329 కోట్లు, ఏకీకృతం (స్టాండ్‌ఎలోన్)గా చూస్తే రూ.35,610 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇదే సమయంలో జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.697 కోట్లు మాత్రమే. అయినా గత వారాంతానికి స్టాక్ మార్కెట్లో జొమాటో మార్కెట్ క్యాప్ రూ.3.37 లక్షల కోట్లుగా ఉంటే ఓఎన్‌జీసీ మార్కెట్ క్యాప్ రూ.3.10 లక్షల కోట్లు మాత్రమే.

గతమెంతో ఘనం

పదమూడేళ్ల వెనక్కి వెళితే దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.2.44 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఓఎన్‌జీసీ అగ్రస్థానంలో ఉండేది. టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో ఉండేవి.



ఇప్పుడు రూ.18.7 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఆర్ఐఎల్ అగ్రస్థానంలో, రూ.10.95 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో టీసీఎస్ నాలుగో స్థానంలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ మాత్రం రూ.3.10 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో 25వ స్థానానికి పడిపోయింది.

మార్కెట్ వర్గాలు ఓఎన్‌జీసీ షేర్ల ప్రస్తుత విలువ దాని అసలు విలువను ప్రతిబింబించడం లేదంటున్నాయి. ఓఎన్‌జీసీకి ఎంఆర్‌పీఎల్ ఈక్విటీలో 71.63 శాతం, హెచ్‌పీసీఎల్ ఈక్విటీలో 54.9 శాతం, ఐఓసీ ఈక్విటీలో 14.20 శాతం, గెయిల్ ఇండియా ఈక్విటీలో 5 శాతం వాటా ఉంది. ఇవిగాక విదేశాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తిలో ఉన్న ఓఎన్‌జీసీ విదేశ్ పూర్తిగా ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ. ఈ సంస్థల్లో ఉన్న ఓఎన్‌జీసీ వాటాల విలువే ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం రూ.1.07 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఓఎన్‌జీసీ షేర్ల మార్కెట్ క్యాప్ మరో 33.3 శాతం పెరుగుతుంది. పీఎస్‌యూ కావడంతోనే ఇన్వెస్టర్లు ఓఎన్‌జీసీ షేర్లను సరిగా అంచనా వేయలేక పోతున్నారని చెబుతున్నారు.

బిజినెస్

24,800 దిగువన బేరిష్

(అక్టోబరు 13-17 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,881-25,331 పాయింట్ల మధ్యన కదలాడి 389 పాయింట్ల లాభంతో 25,285 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,800 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,057, 24,861, 24,957, 24,188 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,600 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,800
నిరోధ స్థాయిలు: 25,485, 25,585, 25,685 (25,385 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,085, 24,985, 24,885 (25,185 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	95
కర్నూలు	102	నెల్లూరు	100
విశాఖపట్నం	127	అనంతపురం	100
గోదావరి	119		

ఐసీఐసీఐ ప్రు కాంగ్లోమెరేట్ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్.. కాంగ్లోమెరేట్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఈక్విటీ ఆధారిత ఫండ్. ఈ ఫండ్ ప్రధానంగా కనీసం రెండు లిస్టెడ్ కంపెనీలతో ప్రమోటర్లు నిర్వహిస్తున్న గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టనుంది. దేశంలో వివిధ రంగాల్లో 71 కాంగ్లోమెరేట్ గ్రూప్ కంపెనీల నిర్వహణలో దాదాపు 240 కంపెనీలు ఉన్నాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్, తక్కువ క్యాపిటల్ వ్యయాలతో వృద్ధి పథంలో పయనిస్తున్న లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీలను ఎంచుకుని ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేయనుంది. ఈ పథకం ముగింపు తేదీ ఈ నెల 17. కనీస పెట్టుబడి రూ.1,000.

టాటా అసెట్ మేనేజ్‌మెంట్.. అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, సంస్థల కోసం టాటా ఇండియా డైనమిక్ ఈక్విటీ ఫండ్‌ను ప్రారంభించింది. ఈ ఫండ్ ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ ఈక్విటీ పథకాలు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి 500 డాలర్లు. గిఫ్ట్ సిటీ ఐఎఫ్ఎస్‌సీ నుంచి ఈ ఫండ్‌ను నిర్వహించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
13వ తేదీ		విజయవాడ	525
హైదరాబాద్	505	గోదావరి	510
వరంగల్	507	విశాఖపట్నం	500
చిత్తూరు	553	డజను గుడ్లు రూ. 72	

మరో కరెక్షన్‌కు ఆస్కారం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ 25,000 వద్ద బ్రేకౌట్ సాధించి 400 పాయింట్ల లాభంతో 25,300 సమీపంలో క్లోజైంది. గత కొద్ది రోజుల్లో 800 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించి ఇటీవల ఏర్పడిన గరిష్ఠ స్థాయిలకు చేరువవుతోంది. మిడ్‌క్యాప్-100 సూచీ 1,200 పాయింట్లు లాభపడి ఇటీవల గరిష్ఠ స్థాయి 59,000కు చేరువైంది. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. స్మాల్‌క్యాప్-100 సూచీ కూడా 255 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ ప్రస్తుతం సెప్టెంబరులో బలమైన కరెక్షన్‌లో ప్రవేశించిన గరిష్ఠ స్థాయి 25,300 వద్ద ఉంది. అప్రమత్తంగా ఉండాలి. గత శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో ఏర్పడిన బలమైన డౌన్‌ట్రెండ్ కారణంగా ఈ వారం నిఫ్టీ నెగెటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 25,000 వద్ద మరో పరీక్షకు గురి కానుంది.

బుల్లిష్ స్థాయిలు: పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో పడినా 25,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి లేదా కన్సాలిడేట్ కావాలి. ప్రధాన నిరోధం 25,300. ఆ పైన నిలదొక్కుకోగలిగితే తదుపరి టార్గెట్ 25,500.

బేరిష్ స్థాయిలు: 25,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం 1,000 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించిన ఈ సూచీ 56,600 వద్ద ముగిసి ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయిలకు చేరువలో ఉంది. రియాక్షన్‌లో పడినా సానుకూలత కోసం మద్దతు స్థాయి 56,000 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 55,400, 55,000. ప్రధాన నిరోధ స్థాయిలు 56,600, 57,300.

పాటర్న్: సానుకూలత కోసం నిఫ్టీ 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. మరోసారి 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొంటున్నందున ఇక్కడ బలం ప్రదర్శించినప్పుడే స్వల్పకాలిక సానుకూలత ఏర్పడుతుంది. గత నెలలో 25,300 వద్ద బలమైన టాప్ ఏర్పడింది. సానుకూలత కోసం దాన్ని ఛేదించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,210, 25,300
మద్దతు	25,100, 25,000

ఈ వారం ఆటుపోట్లలోనే!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడుదొడుకులు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు. రేర్ ఎర్త్ మెటల్స్ ఎగుమతులపై నిషేధం విధించిన చైనాపై డొనాల్డ్ ట్రంప్ టారిఫ్స్ విధించటం, ఇతర అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు సూచీలపై ప్రభావం చూపించే వీలుంది. ఈ నేపథ్యంలో మదుపరులు ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లోనే పెట్టుబడి పెట్టడం మంచిది. గత వారం నిఫ్టీ దాదాపు 2 శాతం మేర పెరిగి 25,285 పాయింట్ల వద్ద క్లోజైంది. సూచీ ఇదే స్థాయిల్లో కొన్నాళ్లు కన్సాలిడేట్ అయితే స్థిరత్వం వస్తుంది. ప్రస్తుతం నాన్ ఫెర్రస్ మెటల్స్, టెలికాం, వజ్రాభరణాలు, ఇన్‌ఫ్రా, బ్యాంకింగ్ రంగాలు బలాన్ని ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

డీఎల్ఎఫ్: కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. కన్సాలిడేషన్ కూడా జరుగుతోంది. ప్రస్తుతం కీలకమైన రూ.706 వద్ద మద్దతు లభించింది. స్వల్పకాల అప్‌ట్రెండ్ కొనసాగే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.740 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.825 టార్గెట్ ధరతో రూ.740 శ్రేణిలో డిప్స్ పద్ధతిలో అక్యుములేట్ చేసుకోవాలి. రూ.720 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ గ్రీన్ ఎనర్జీ: కొన్ని నెలలుగా కన్సాలిడేట్ అవుతున్న ఈ షేరు ప్రస్తుతం స్వలకాలిక అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. ఫండమెంటల్స్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.1,064 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,040 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,180 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,010 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డాక్టర్ రెడ్డీస్: స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ట్రయాంగిల్ ప్యాటర్న్ ఫామ్ అయ్యింది. ప్రైస్ యాక్షన్ టైట్‌గా సాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ ఇప్పుడిప్పుడే మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.1,264 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,250 శ్రేణిలో ప్రవేశించి రూ.1,4,50 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పవర్‌గ్రిడ్: ప్రస్తుతం ఈ కౌంటర్ టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. షార్ట్‌టర్మ్ వ్యూహంతో ఇందులో పొజిషన్ తీసుకోవచ్చు. గత శుక్రవారం రూ.289 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో రూ.280 పై స్థాయిలో ప్రవేశించి రూ.315/330 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.270 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బజాజ్ ఆటో: జీవిత కాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 45 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం స్టేజ్-2లో ఉంది. ప్రస్తుతం ఆటోమొబైల్ రంగం మూమెంటమ్‌లో ఉంది. గత శుక్రవారం రూ.8,946 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.8,850 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.9,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.8,750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.



ఫాలో ఆన్‌లో..

క్యాంప్‌బెల్, హోప్ అజేయ అర్ధ శతకాలు

కరీబియన్ల అనూహ్య పోరాటం

● విండీస్ 173/2
● తొలి ఇన్నింగ్స్‌లో 248 ఆలౌట్
● భారత్‌తో రెండో టెస్ట్

కుల్దీప్‌నకు ఐదు వికెట్లు

న్యూఢిల్లీ: ఊదేస్తామనుకొన్న భారత్‌కు.. ఫాలో ఆన్ ఆడుతున్న వెస్టిండీస్ కౌంటర్ అటాక్‌తో ఎదురు నిలిచింది. జాన్ క్యాంప్‌బెల్ (87 బ్యాటింగ్), షాయ్ హోప్ (66 బ్యాటింగ్) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. విండీస్ ఆటను నాలుగో రోజుకు తీసుకెళ్లింది. 97 పరుగుల వెనుకంజలో ఉన్న కరీబియన్లు టీమిండియా ఇన్నింగ్స్ విజయాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు. 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్‌లో పడిన విండీస్.. ఆదివారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 173/2 స్కోరు చేసింది. చేతిలో ఇంకా 8 వికెట్లు ఉండడంతో.. భారత్‌కు లక్ష్యాన్ని నిర్దేశించే దిశగా సాగుతోంది. ఓపెనర్ తేజ్‌నరైన్ చందర్‌పాల్ (10)ను సిరాజ్ పెవిలియన్ చేర్చగా.. అలిక్ అథనజె (7)ను సుందర్ బౌల్డ్ చేశాడు. అయితే, మరో ఓపెనర్ క్యాంప్‌బెల్, హోప్ మూడో వికెట్‌కు 138 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ఎదురుదాడి చేశారు. ఈ క్రమంలో విండీస్ తరఫున ఈ ఏడాది అత్యధిక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 140/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్ 248 పరుగులకు కుప్పకూలింది. షాయ్ హోప్ (36), అండర్సన్ ఫిలిప్స్ (24 నాటౌట్), కేరీ పియర్రీ (23) కొంతసేపు క్రీజులో నిలిచారు. కుల్దీప్ ఐదు, జడేజా మూడు వికెట్లు పడగొట్టారు. అయితే, టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగకుండా వెస్టిండీస్‌ను ఫాలో ఆన్ ఆడించింది. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసింది.



జేడెన్ సీల్స్‌కు జరిమానా

క్రమశిక్షణను ఉల్లంఘించిన విండీస్ పేసర్ సీల్స్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోతతోపాటు ఓ డిమెరిట్ పాయింట్‌ను అతడి ఖాతాలో చేర్చారు. భారత తొలి ఇన్నింగ్స్ 29వ ఓవర్‌లో తన బౌలింగ్‌లోనే బంతిని ఆపిన సీల్స్.. బ్యాటర్ జైస్వాల్‌వైపు విసిరేశాడు. అయితే, బంతి జైస్వాల్ ప్యాడ్‌లకు బలంగా తాకింది. దీంతో ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో ఆర్టికల్ 2.9 కింద అతడిపై మ్యాచ్ రెఫరీ చర్యలు తీసుకొన్నాడు.



కుల్దీప్ (5/82)

1 చేజ్-హోల్డర్ తర్వాత భారత్‌తో టెస్ట్‌లో ఒక పూర్తి సెషన్ బ్యాటింగ్ చేసిన జంటగా క్యాంప్‌బెల్-హోప్. 2016లో కింగ్‌స్టన్‌లో జరిగిన టెస్ట్‌లో ఐదో రోజు ఆఖరి సెషన్‌లో 19 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన ఛేజ్-హోల్డర్ విండీస్‌ను డ్రాతో గట్టెక్కించారు.

లిప్‌బామ్ ఫ్రెండ్లీ గొడవ..

ఎటువంటి మ్యాచ్ ఒత్తిడీ లేకపోవడంతో ఫీల్డింగ్ చేస్తున్న భారత ఆటగాళ్లు ఎంతో సరదాగా కనిపించారు. జడేజా జోకులు పేలుస్తుంటే.. కుల్దీప్ వికెట్ పడగొట్టినప్పడల్లా జైస్వాల్.. గిల్‌తో సంబరాలు చేసుకొన్నాడు. స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేస్తున్న రాహుల్.. జేబులోంచి లిప్ బామ్ తీసుకొని రాసుకొన్నాడు. కొంచెం ఆవలగా నిలబడిన గిల్.. రాహుల్ వద్దకు వచ్చి ఏదో అనడంతో రాహుల్ కూడా సరదాగా తిరిగి కౌంటర్ ఇచ్చాడు. ఆ తర్వాత ఇద్దరూ నవ్వుకున్నారు. ఈ సీన్ అభిమానుల దృష్టిలో పడడంతో.. నెట్‌లో వైరల్ అయింది.

1 భారత పర్యటనలో గత మూడు ద్వైపాక్షిక సిరీస్‌ల్లో.. ఆడిన ఆరు టెస్ట్‌ల్లో ఒక మ్యాచ్‌ను వెస్టిండీస్ నాలుగో రోజుకు తీసుకెళ్లడం ఇదే తొలిసారి.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 134.2 ఓవర్లలో 518/5 డిక్లేర్.

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 10, చందర్‌పాల్ (సి) రాహుల్ (బి) జడేజా 34, అథనజె (సి) జడేజా (బి) కుల్దీప్ 41, హోప్ (బి) కుల్దీప్ 36, చేజ్ (సి అండ్ బి) జడేజా 0, టెవిన్ ఇమ్లాచ్ (ఎల్బీ) కుల్దీప్ 21, గ్రీవ్స్ (ఎల్బీ) కుల్దీప్ 17, కరీ పైర్రీ 23, వారికన్ (బి) సిరాజ్ 1, ఫిలిప్స్ (నాటౌట్) 24, జేడెన్ సీల్స్ (ఎల్బీ) కుల్దీప్ 13; **ఎక్స్‌ట్రాలు: 28; మొత్తం: 81.5 ఓవర్లలో 248 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-21, 2-87, 3-106, 4-107, 5-156, 6-163, 7-174, 8-175, 9-221, 10-248; **బౌలింగ్:** బుమ్రా 14-4-40-1, సిరాజ్ 9-2-16-1, జడేజా 19-5-46-3, కుల్దీప్ యాదవ్ 26.5-4-82-5, సుందర్ 13-2-41-0.

వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (బ్యాటింగ్) 87, చందర్‌పాల్ (సి) గిల్ (బి) సిరాజ్ 10, అథనజె (బి) సుందర్ 7, హోప్ (బ్యాటింగ్) 66; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 49 ఓవర్లలో 173/2; వికెట్ల పతనం:** 1-17, 2-35; **బౌలింగ్:** సిరాజ్ 6-2-10-1, జడేజా 14-3-52-0, సుందర్ 13-3-44-1, కుల్దీప్ 11-0-53-0, బుమ్రా 4-2-9-0, జైస్వాల్ 1-0-3-0.



661 పరుగులు.. భారత్-ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్ల బాదుడుకు విశాఖ స్టేడియంలో పరుగుల వరదే పారింది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్ ధాటికి మిడిలార్డర్ తోడవ్వడంతో భారత్ ఏకంగా 330 పరుగులతో వహ్వా.. అనిపించింది. ఇక గెలుపు మనదే అని ఫ్యాన్స్ సంబరపడిన వేళ ప్రత్యర్థి ఆసీస్ మాత్రం ఎప్పటిలాగే తమ ప్రొఫెషనల్ ఆటతీరును చూపింది. లక్ష్యం ఎంత భారీదైనా తమ దూకుడు ముందు దిగదుడుపే అని నిరూపించింది. కెప్టెన్ అలీసా హీలీ ఆరంభం నుంచే కదం తొక్కుతూ అద్భుత శతకంతో ఛేదనకు మార్గం సుగమం చేసిన వేళ.. భారత బౌలర్ల పోరాటం చిన్నబోయింది.

330 చాల్లేదు

భారత్‌కు రెండో ఓటమి

1 మహిళల వన్డే వరల్డ్ కప్‌ల్లో భారత జట్టుకిదే అత్యధిక స్కోరు (330). అలాగే వన్డేల్లో ఆసీస్‌పై ఎక్కువ స్కోరు సాధించిన జట్టుగా భారత్ తొలి రెండు స్థానాల్లో నిలిచింది. ఇదే ఏడాది 369 రన్స్ సాధించగా, తాజాగా 330 పరుగులు సాధించింది.

మహిళల వన్డేల్లో అత్యధిక ఛేదనలు

లక్ష్యం	ఛేదించిన జట్టు	ప్రత్యర్థి	ఎప్పుడు
330	ఆస్ట్రేలియా	భారత్	2025
302	శ్రీలంక	దక్షిణాఫ్రికా	2024
289	ఆస్ట్రేలియా	న్యూజిలాండ్	2012
283	ఆస్ట్రేలియా	భారత్	2023
282	ఆస్ట్రేలియా	భారత్	2025

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌కు మరో ఝలక్. ఆదివారం డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో ఓడింది. అటు 331 పరుగుల రికార్డు ఛేదనను ఆస్ట్రేలియా తమ చాంపియన్ ఆటతీరుతో మరో 6 బంతులుండగానే ముగించడం విశేషం. కెప్టెన్ అలీసా హీలీ (107 బంతుల్లో 21 ఫోర్లు, 3 సిక్సర్లతో 142) విధ్వంసకర శతకంతో చెలరేగింది. ఇది భారత్‌కు వరుసగా రెండో ఓటమి కాగా.. ఆసీస్‌కు నాలుగు మ్యాచ్‌ల్లో మూడో విజయం. ఓ మ్యాచ్ రద్దయ్యింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 48.5 ఓవర్లలో 330 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన (66 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80), ప్రతీకా రావల్ (96 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 75) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. హర్లీన్ (38), జెమీమా (33), రిచా (32) రాణించారు. పేసర్ సదర్లాండ్‌కు ఐదు, సోఫీకి మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 49 ఓవర్లలో 331/7 స్కోరుతో గెలిచింది. పెర్రీ (47 నాటౌట్), గార్డ్‌నర్ (45), లిచ్‌ఫీల్డ్ (40) గెలుపులో భాగమయ్యారు. శ్రీచరణికి మూడు.. దీప్తి, అమన్‌జోత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హీలీ నిలిచింది.



ప్రతీకా (75) మంధాన (80)

1 మహిళల వన్డేల్లో వేగంగా (112 ఇన్నింగ్స్) 5000 పరుగులు పూర్తి చేసిన ప్లేయర్‌గా స్మృతి మంధాన. అలాగే ఈ ఏడాదిలో వెయ్యి రన్స్ పూర్తి చేసిన ఏకైక మహిళా బ్యాటర్‌గానూ నిలిచింది.
ఆసీస్ జట్టుపై వరుసగా ఐదుసార్లు 50+ స్కోర్లు నమోదు చేసిన ఏకైక మహిళా బ్యాటర్‌గా మంధాన.
వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఎక్కువ సిక్సర్లు (13) నమోదు కావడం ఇదే తొలిసారి.

మెరుపు ఛేదన: భారీ లక్ష్యం కళ్లముందున్నా ఆసీస్ ఎలాంటి బెరుకు లేకుండా ఇన్నింగ్స్ ఆరంభించింది. ఎనిమిదో ఓవర్‌లో హీలీ 6,4,4,4తో 19 రన్స్ రాబట్టింది. ఇక పదో ఓవర్‌లో లిచ్‌ఫీల్డ్ నాలుగు ఫోర్లతో రాణించి 17 రన్స్ సమకూర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 82 పరుగులతో నిలిచింది. అయితే శ్రీచరణి తన తొలి ఓవర్‌లోనే లిచ్‌ఫీల్డ్‌ను దెబ్బతీయడంతో మొదటి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు హీలీ బాదుడుకు 15 ఓవర్లలోనే జట్టు స్కోరు వందకి చేరింది. ఆ తర్వాత ఎలిస్ పెర్రీ 32 పరుగుల దగ్గర కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. ఈ సమయంలో బౌలర్లు పరుగులను కట్టడి చేయడంతో పాటు మూనీ (4), సదర్లాండ్ (0)లను వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చారు. 31వ ఓవర్‌లో 4,4,6తో చెలరేగి 84 బంతుల్లోనే హీలీ కెరీర్‌లో ఆరో శతకాన్ని పూర్తి చేసింది. ఇక అత్యంత ప్రమాదకరంగా మారిన హీలీ జోరుకు స్నేహ్ రాణా అద్భుత క్యాచ్‌తో శ్రీచరణి బ్రేక్ వేసింది. ఇక 36 బంతుల్లో 32 పరుగులు కావాల్సి ఉండగా ఆసీస్ చేతిలో నాలుగు వికెట్లున్నాయి. ఈ స్థితిలో పెర్రీ తిరిగి మైదానంలో అడుగుపెట్టింది. కిమ్ గార్త్ (14 నాటౌట్)ను అండగా చేసుకుని ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేసింది. ఇక 12 బంతుల్లో 13 రన్స్ కావాల్సి వేళ 49వ ఓవర్‌లో గార్త్ ఫోర్.. చివరి బంతికి పెర్రీ సిక్సర్‌తో ఆసీస్‌కు అద్భుత విజయాన్నందించారు.

ఆరంభం అదిరినా.. చివర్లో తడబాటు: ఈ మెగా టోర్నీలో ఇప్పటి దాకా తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేక పోయిన స్మృతి మంధాన ఫామ్‌ను అందుకుని తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. మరో ఓపెనర్ ప్రతీకా రావల్‌తో పాటు మిడిలార్డర్ కూడా తలో చేయి వేయడంతో భారత్ పరుగుల వరద పారించింది. కానీ ఆసీస్ బౌలర్ల ధాటికి కేవలం 36 పరుగుల తేడాతో చివరి ఆరు వికెట్లు కోల్పోవడంతో ఆశించిన స్కోరు చేయలేకపోయింది. ఇక టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆరంభంలో ఏడో ఓవర్ ముగిసే సరికి స్కోరు 26 మాత్రమే. కానీ ఆ తర్వాత మంధాన లయ అందుకుంది. అడపాదడపా బౌండరీలతో మంధాన 46 బంతుల్లోనే ఫిఫ్టీని అందుకుంది. కాసేపటికే ప్రతీకా కూడా అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. అయితే దూకుడు మీదున్న మంధాన స్లాగ్ స్వీప్‌నకు వెళ్లి లిచ్‌ఫీల్డ్‌కు క్యాచ్ ఇచ్చింది. ఈ దశలో ఆసీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసి ప్రతీకాతో పాటు వేగంగా ఆడుతున్న హర్మన్‌ప్రీత్ (22), హర్లీన్‌ల వికెట్లను కూడా భారత్ కోల్పోయింది. 42 ఓవర్లలోనే స్కోరు 287/4తో అత్యంత పటిష్టంగా కనిపించింది. కానీ ఈ ప్రమాదకర జోడీని పేసర్ సదర్లాండ్ విడదీసింది. రిచాను అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక ఇక్కడి నుంచి భారత వికెట్ల పతనం వేగంగా సాగింది. ఓ దశలో సునాయాసంగా 370 రన్స్ సాధిస్తుందనుకున్నప్పటికీ టెయిలెండర్లు అనవసర షాట్లతో వరుస విరామాల్లో పెవిలియన్‌కు చేరారు. దీంతో స్కోరు 330కే పరిమితమైంది.

స్కోరుబోర్డు

భారత్: ప్రతీకా రావల్ (సి) పెర్రీ (బి) సదర్లాండ్ 75, స్మృతి మంధాన (సి) లిచ్‌ఫీల్డ్ (బి) మోలినెక్స్ 80, హర్లీన్ (సి) సదర్లాండ్ (బి) మోలినెక్స్ 38, హర్మన్‌ప్రీత్ (సి) మోలినెక్స్ (బి) షుట్ 22, జెమీమా (సి) మూనీ (బి) సదర్లాండ్ 33, రిచా ఘోష్ (సి/సబ్) వారెహమ్ (బి) సదర్లాండ్ 32, అమన్‌జోత్ (సి) మోలినెక్స్ (బి) గార్డ్‌నర్ 16, దీప్తి శర్మ (సి) మూనీ (బి) మోలినెక్స్ 1, స్నేహ్ రాణా (నాటౌట్) 8, క్రాంతి గౌడ్ (సి/సబ్) వారెహమ్ (బి) సదర్లాండ్ 1, శ్రీచరణి (బి) సదర్లాండ్ 0, **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 48.5 ఓవర్లలో 330 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-155, 2-192, 3-234, 4-240, 5-294, 6-309, 7-320, 8-327, 9-330, 10-330; **బౌలింగ్:** కిమ్ గార్త్ 5-0-35-0, మెగాన్ షుట్ 6.1-0-37-1, గార్డ్‌నర్ 7-0-40-1, మోలినెక్స్ 10-1-75-3, సదర్లాండ్ 9.5-0-40-5, మెక్‌గ్రాత్ 4.5-0-43-0, అలనా కింగ్ 6-0-49-0.

ఆస్ట్రేలియా: అలిస్సా హీలీ (సి) రాణా (బి) శ్రీచరణి 142, లిచ్‌ఫీల్డ్ (సి) రాణా (బి) శ్రీచరణి 40, ఎలిస్ పెర్రీ (నాటౌట్) 47, బెత్ మూనీ (సి) జెమీమా (బి) దీప్తి 4, సదర్లాండ్ (బి) శ్రీచరణి 0, గార్డ్‌నర్ (బి) అమన్‌జోత్ 45, మెక్‌గ్రాత్ (ఎల్బీ) దీప్తి 12, మోలినెక్స్ (ఎల్బీ) అమన్‌జోత్ 18, కిమ్ గార్త్ (నాటౌట్) 14, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 49 ఓవర్లలో 331/7; వికెట్ల పతనం:** 1-85, 1-154, 2-168, 3-170, 4-265, 5-279, 6-299, 7-303; **బౌలింగ్:** అమన్‌జోత్ 9-0-68-2, క్రాంతి 9-1-73-0, స్నేహ్ రాణా 10-0-85-0, శ్రీచరణి 10-1-41-3, దీప్తి 10-0-52-2, హర్మన్‌ప్రీత్ 1-0-10-0.

కుర్రాళ్ల జోరు

న్యూజిలాండ్‌పై భారత్ గెలుపు
జొహోర్ కప్ జూనియర్ హాకీ

జొహోర్ బహ్రూ (మలేసియా): సుల్తాన్ జొహోర్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు జోరు కొనసాగిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 4-2తో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. అర్షదీప్ (2ని.), సునీల్ (15ని.), అరిజీత్ సింగ్ హుండాల్ (26ని.), రోషన్ (47ని.) భారత్‌కు గోల్స్ అందించారు. గస్ నెల్సన్ (41ని.), ఐడన్ మ్యాక్స్ (52ని.) న్యూజిలాండ్ తరఫున గోల్స్ చేశారు. టోర్నమెంట్‌లో భారత్‌కిది రెండో విజయం. శనివారంనాటి ఆరంభ మ్యాచ్‌లో గ్రేట్ బ్రిటన్‌పై 3-2తో నెగ్గిన సంగతి తెలిసిందే. మంగళవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడుతుంది.





కల్పన

మహిళా క్రికెట్‌కు గౌరవం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని ఓ స్టాండ్‌కు భారత మాజీ క్రికెటర్ మిథాలీరాజ్ పేరు, గేటుకు ఆంధ్రాకు చెందిన అంతర్జాతీయ మాజీ క్రికెటర్ రావి కల్పన పేరు పెట్టారు. మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌కు ముందు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఐసీసీ అధ్యక్షుడు జైషా, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, దేశంలో లక్షలాది మంది యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచిన మిథాలీరాజ్ పేరును ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఒక స్టాండ్‌కు పెట్టడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. స్టేడియంలో ఒక గేట్‌కు రావి కల్పన పేరు పెట్టడం క్రీడారంగానికి సముచిత గౌరవమేనన్నారు. పురుషులతో సమానంగా మహిళా సీనియర్ క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులు అందడం ఆర్థికంగా లాభదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శి సాన సతీష్, చాముండేశ్వర్‌నాథ్ పాల్గొన్నారు.



అన్‌సీడెడ్‌గా వచ్చాడు ట్రోఫీ పట్టేశాడు

షాంఘై మాస్టర్స్‌లో వాలెంటిన్ సంచలనం

షాంఘై (చైనా): టోర్నీ ఆరంభానికి ముందు అతనో అనామక ఆటగాడు.. పైగా, ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అతని స్థానం 204.. ఇంకేం, తొలి మ్యాచ్ నెగ్గడమే గగనం అనుకున్నారంతా! కానీ, అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ దిగ్గజం జొకోవిచ్‌లాంటి స్టార్లను చిత్తుచేస్తూ ముందుకు సాగిన అతను.. ఏకంగా టోర్నీ చాంపియన్‌గా నిలిచి అదరహో అనిపించాడు. అతనే, మొనాకోకు చెందిన 26 ఏళ్ల వాలెంటిన్ వాచెరోట్. ఏమాత్రం అంచనాలు లేని వాలెంటిన్.. షాంఘై మాస్టర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సింగిల్స్ ట్రోఫీ నెగ్గి సరికొత్త రికార్డు నమోదు చేశాడు. క్వార్టర్స్‌లో పదోసీడ్ హోల్గర్ రూన్‌కు, సెమీస్‌లో నాలుగో సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చిన వాలెంటిన్ ఫైనల్లో తనకు వరుసకు సోదరుడైన ఆర్థర్ రిండెర్‌నెచ్‌ను 4-6, 6-3, 6-3తో ఓడించి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీ చరిత్రలో టైటిల్ నెగ్గిన అతి తక్కువ ర్యాంకర్‌గా వాలెంటిన్ నయా చరిత్ర సృష్టించాడు.

గాఫ్‌కు వుహాన్ టైటిల్



అమెరికా టెన్నిస్ స్టార్ కొకొ గాఫ్.. వుహాన్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. చైనాలోని వుహాన్‌లో శనివారం జరిగిన మహిళల తుదిపోరులో మూడో సీడ్ గాఫ్ 6-4, 7-5తో తన దేశానికే చెందిన జెస్సికా పెగులపై గెలిచి ట్రోఫీ అందుకుంది. 21 ఏళ్ల గాఫ్‌కిది ఈ ఏడాది రెండో టైటిల్. అంతకుముందు ఫ్రెంచ్ ఓపెన్ గెలిచింది.

ఇక సింగిల్స్‌పై మనోళ్ల దృష్టి

నేటి నుంచి ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్

గువాహటి: మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చారిత్రక కాంస్య పతకం సాధించడంతో ఆత్మవిశ్వాసం ఇనుమడించిన భారత షట్లర్లు..ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భాగంగా సోమవారం నుంచి జరిగే సింగిల్స్ పోటీలపై దృష్టి సారించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మాదిరే సింగిల్స్‌లోనూ సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నారు. ఈసారి పోటీలలో..జూనియర్ వరల్డ్ నెంబర్ వన్ ర్యాంకర్ తన్వీ శర్మ, చైనా ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనల్ వరకూ వచ్చిన ఉన్నతి హుడాపై పసిడి పతక ఆశలు నిలిచాయి. ఆసియా అండర్-19 కాంస్య పతక విజేత తన్వీకి తొలి రౌండ్‌లో బై లభించింది. మరోవైపు..హాంకాంగ్ షట్లర్ లియు హీ కియుతో రెండో రౌండ్ ద్వారా ఎనిమిదో సీడ్ ఉన్నతి టోర్నమెంట్‌ను ఆరంభిస్తోంది. ఆసియా అండర్-19 కాంస్య పతక విజేత వెన్నెల, రక్షిత కూడా బరిలో ఉన్నారు. బాలుర సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ మహ్మద్ జాకీతో భారత ఆటగాడు లల్తాజువాలా మొదటి రౌండ్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాడు. జ్ఞాన దత్తా, 15వ సీడ్ సూర్యాక్ష్ రావత్ తొలి రౌండ్‌లో పరస్పరం ఢీకొననున్నారు. బాలుర డబుల్స్‌లో భార్గవ రామ్ అరిగెల/విశ్వతేజ్ గొబ్బూరు, భవ్య చాబ్రా/సుమిత్, విష్ణు కోడె/మిథిలేష్ కృష్ణన్ బరిలో ఉన్నారు.



పుణె 'టైబ్రేకర్' గెలుపు

న్యూఢిల్లీ: ఉత్కంఠను అదిమిపట్టిన పుణెరి పల్టన్ టైబ్రేకర్‌లో 6-5 స్కోరుతో దబాంగ్ ఢిల్లీని ఓడించింది. ప్రొ.కబడ్డీ లీగ్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత పుణె, ఢిల్లీ 38-38తో సమంగా నిలిచాయి. దాంతో టైబ్రేకర్ అనివార్యమైంది. ఈ విజయంతో పుణె పాయింట్ల పట్టికలో అగ్ర స్థానానికి చేరింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 43-32తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.



పాక్ 313/5

ఇమాముల్ సెంచరీ మిస్

● సౌతాఫ్రికాతో తొలి టెస్ట్

లాహోర్: దక్షిణాఫ్రికాతో ఆదివారం మొదలైన తొలి టెస్ట్‌లో ఓపెనర్ ఇమాముల్ హక్ (93), కెప్టెన్ షాన్ మసూద్ (76) అర్ధ శతకాలతో రాణించడంతో పాకిస్థాన్ భారీస్కోరు దిశగా సాగుతోంది. హక్, మసూద్‌తో పాటు రిజ్వాన్ (62 బ్యాటింగ్), సల్మాన్ ఆఘా (52 బ్యాటింగ్) సత్తా చాటడంతో మొదటి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 313/5 స్కోరు చేసింది. బాబర్ ఆజమ్ (23)తోపాటు ఓపెనర్ అబ్దుల్ షఫిక్ (2), సౌద్ షకీల్ (0) నిరాశపర్చారు. సెనురన్ ముత్తుసామి రెండు వికెట్లు పడగొట్టాడు.

ఆర్చరీ లీగ్ విజేత రాజస్థాన్

ఫైనల్లో యోధాస్ ఓటమి

న్యూఢిల్లీ: ఆర్చరీ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్ టైటిల్‌ను రాజ్‌పుతానా రాయల్స్ ఆఫ్ రాజస్థాన్ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్స్‌లో రాయల్స్ - పృథ్వీరాజ్ యోధాస్ జట్లు 4-4 స్కోరుతో సమంగా నిలవడంతో టై బ్రేకర్ అనివార్యమైంది. ఇందులో యోధాస్ ఆర్చర్లలో ఒక్కరు కూడా టార్గెట్‌లోని పసుపు చుక్కపై బాణాలను సంధించలేకపోయారు. రాయల్స్ ఆర్చర్లలో ఓజాస్, ఎల్లా గిబ్సన్ టార్గెట్‌కు సరిగ్గా గురి పెట్టి, లక్ష్యాన్ని ఛేదించడంతో ట్రోఫీ వారి సొంతమైంది. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా రాయల్స్‌కు ట్రోఫీ ప్రదానం చేశారు.

భారత్‌కు హాంకాంగ్ షాక్

ఆసియా టీమ్ టీటీ చాంపియన్‌షిప్

భువనేశ్వర్: ఆసియా టీటీ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టుకు హాంకాంగ్ షాకిచ్చింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆరో ర్యాంకర్ హాంకాంగ్ జట్టు 3-0తో నాలుగో ర్యాంకర్ భారత్‌పై ఘన విజయం సాధించింది. గత మూడు చాంపియన్‌షిప్‌లలో కాంస్య పతకాలు సాధించిన భారత జట్టు ఇక ఐదో స్థానం కోసం కొరియాతో తలపడనుంది.

ఆర్‌కే: ఎల్వీని బదిలీ చేయాలని ఎవరు చెప్పారు..?

క్యాబినెట్‌లో ఒక చిన్న సమస్య వచ్చింది. విలేజ్ కోర్టుల గురించి చర్చించాలి. క్యాబినెట్ భేటీకి ముందు సీఎంకు బ్రీఫింగ్ ఉంటుంది. సీఎం, సీఎస్ చర్చించిన తర్వాత ఎజెండా నిర్ణయిస్తారు. విలేజ్ కోర్టుల గురించి సవివర ప్రజెంటేషన్ ఇవ్వాలని.. ఆ తర్వాత క్యాబినెట్‌లో పెడదామని సీఎం అన్నారు. లా సెక్రటరీ వేరే పని ఉండడంతో వెళ్లిపోయారు. తర్వాతి రోజు వచ్చారు. సీఎం గారికి ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. నేను అనుమతివ్వలేదు. ఆయన వెంటనే సీఎస్ (ఎల్వీ) వద్దకు వెళ్లారు. ఆయన్ను సీఎం వద్దకు తీసుకెళ్లాలని సీఎస్ నాతో చెప్పారు. నేను ఇప్పుడు వద్దన్నాను. సీఎం కంఫర్టబుల్‌గా లేరని స్పష్టంగా చెప్పాను. ఇదే అసలు సమస్యగా మారింది. ఆయన్ను ఎందుకు ఆపారంటూ సీఎస్ నాకు మెమో జారీ చేశారు. ఈ విషయం నేను ఎవరికీ చెప్పలేదు.

ఆర్‌కే: మరి తర్వాత మిమ్మల్ని ఎందుకు పంపించేశారు..?

ఇది జరిగిన రెండున్నరేళ్ల తర్వాత సీఎం వద్దకు వెళ్లాను. 26 నుంచి 28 నెలల తర్వాత ఆఫీసర్‌కు ఎఫిషియన్సీ తగ్గుతుంది.. మూడేళ్లపాటు సీఎంవోలో పని చేశాను.. ఏ పోస్టులో కూడా ఇంత కాలం చేయలేదని చెప్పాను. మీ సొంత స్టేట్‌లో చాలా మం ది ఐఏఎస్‌లు చాలా కాలం నుంచి ఒకే పోస్టులో పని చేస్తున్నారు.. ఢిల్లీలో కూడా ఐఏఎస్‌లు ఒకే పోస్టులో చాలా కాలం నుంచి కొన సాగుతున్నారని ఆయన అన్నారు. మిగిలిన ఆఫీసర్ల వైపు చూస్తూ.. ప్రవీణ్ ఏం మాట్లాడతారో.. ఏ థియరీ మాట్లాడతారో ఆయనకే తెలియదని నవ్వుతూ చెప్పారు. మీరు అనుమతిస్తే ఢిల్లీ వెళ్లిపోతానని అన్నారు. ఆయన నీ ఇష్టమనేసి వెళ్లిపోయారు.



సీఎం చెబితే చేయాలంతే!

▸ ఆర్‌కేతో 'బిగ్ డిబేట్'లో రిటైర్డ్ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆర్‌కే: బాగా టెన్షన్‌గా ఉన్నట్లు ఉన్నారు..

టెన్షన్ కాదు సార్.. గత ఏడాది నుంచి జర్నీ వల్ల..

ఆర్‌కే: కోపంతో వీఆర్ఎస్ తీసుకున్నారా..?

అవును. కోపంతోనే వీఆర్ఎస్ ఇచ్చాను.

ఆర్‌కే: మొత్తానికి తప్పు చేశానని ఫీలవుతున్నారు..!

కానీ ఏ తప్పనేది తెలియదు.. ఏడాది కాలంగా ఖాళీగా ఉన్నాను. అందరినీ అడిగాను.. నేనెక్కడ తప్పు చేశానని! ఎవరి నుంచీ సమాధానం రాలేదు. నా దగ్గర కూడా జవాబు లేదు.

ఆర్‌కే: అన్ని హద్దులూ క్రాస్ చేసేశారన్నది మీ మీద నింద. ఐఏఎస్ శిక్షణ ఇచ్చినప్పుడు.. చట్టానికి, రాజ్యాంగానికి, నిబంధనలకు కట్టుబడి ఉండాలని చెబుతారు. సీఎంకు కాదు కదా..!

అవును సర్.. ఈ రోజు మీ దగ్గరకు రావడానికి కారణం ఏమిటంటే.. నాకు ఆంధ్రప్రదేశ్ మీద కమిట్‌మెంట్ ఉంది. నా లైఫ్‌లో 2.0 స్టార్ట్ అయింది. మళ్లీ ఏపీ వైపు అడుగు వేయాలని భావిస్తున్నా. కాబట్టి ఏపీతో మాట్లాడాలి. అది మీ ద్వారా ప్రతి ప్రశ్నకు జవాబు చెప్పాలనుకుంటున్నాను.

ఆర్‌కే: ఐఏఎస్‌గా రెస్పాన్సిబుల్‌గా ఉన్నారా.. లేదా అన్నదే ముఖ్యం.

అది చూసే వారి దృష్టి కోణంలో ఉంటుంది. నేను మొదటి నుంచీ ప్రవీణ్‌లానే ఉన్నాను. తెల్లకాగితాన్ని ఎర్ర కళ్లజోడు పెట్టుకున్న వారికి ఎర్రగా, నల్ల జోడు పెట్టుకున్న వారికి నల్లగా కనిపిస్తుంది... అంతే!

ఆర్‌కే: ప్రవీణ్ మాత్రమే ఎందుకు రంగు రంగుల్లో కనిపించారు..? 30 ఏళ్ల తర్వాత కోపంతో రాజీనామా చేశారు.. శిక్షణలో నేర్చుకున్నది ఇదేనా..?

మనం కోపంలో.. హ్యాపీనెస్‌లో ఏ నిర్ణయం తీసుకోకూడదని మొదటి ఏడాదిలోనే నేర్పుతారు. మేనేజ్‌మెంట్ ప్రిన్సిపుల్స్‌లో టెక్నికల్ సమస్యలు ఉండవు. ప్రతి మనిషికీ లిమిట్స్ ఉంటాయి.

ఆర్‌కే: సీఎం ఏది చెబితే అది చేస్తారా..? కొట్టి రమ్మంటే కొట్టివస్తారా?

ఏపీలో ఏ సీఎం అయినా.. జగన్, చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి.. ఎవరైనా.. ఎప్పుడూ ఎవరికీ ఎలాంటి డైరెక్షన్సూ ఇవ్వరు. జగన్ గానీ, చంద్రబాబు గానీ మీరు అది చేయండి.. ఇది చేయండి.. చేయకపోతే ట్రాన్స్‌ఫర్ చేసేస్తా అని ఎవరినీ అనరు. రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంది.. ఏం చేయాలి.. ఎలా చేయాలని మాత్రమే అడుగుతారు.

ఆర్‌కే: మీరు జగన్ దగ్గర పని చేసినప్పుడు ప్రభుత్వ భవనాలకు వైసీపీ కలర్స్ వేయించారుగా.. ఎలా వేయిస్తారు..? ఎంత ప్రజాధనం వృథా అయిందో మీకూ తెలుసు? నిబంధనలు అంగీకరించవని మీరెందుకు చెప్పలేదు?

నేను కేవలం ఉద్యోగిని. ఎంప్లాయ్‌గా కొన్ని లిమిట్స్ ఉంటాయి. రాజకీయ పార్టీలో ఒక వ్యక్తి చెప్పిన తర్వాత.. నేనెలా ఆపగలను? ప్రభుత్వంలో క్యాబినెట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా పని చేస్తుంది. మేం పొలిటికల్ సిస్టమ్‌కు అనుగుణంగా చెక్స్ అండ్ బ్యాలెన్స్ చేసుకోవాలి.

'కాదు' అన్నందుకే నాడు ఎల్వీపై జగన్ వేటు



ఆర్‌కే: చెక్ అండ్ బ్యాలెన్స్ కేవలం చట్టానికి లోబడి ఉండాలి. మీరంతా కలిసి సీఎంను ప్లీజ్ చేయడానికి.. అడ్మినిస్ట్రేషన్‌ను పాడు చేసేశారు..

మేం కేవలం ఎగ్జిక్యూటివ్ వ్యవస్థకు సాయం చేయడానికి ఉండాలి.

ఆర్‌కే: మీకే ఎందుకీ సమస్య వచ్చింది..? లిమిట్స్ క్రాస్ చేశారా.. లేదా..?

నేను వీఆర్ఎస్ ఇవ్వడానికి 2024లో 50 శాతం మాత్రమే నిర్ణయం తీసుకున్నాను. 2021లోనే మొదటి 50% నిర్ణయం తీసుకున్నాను. ఎందుకంటే కేంద్రంలో నాకు ప్రమోషన్ రాలేదు. ఇప్పటి వరకూ ఎవరి వద్దా ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. చంద్రబాబును గానీ, జగన్‌ను గానీ ఎవరినీ ప్లీజ్ చేయడానికి కూడా ప్రయత్నం చేయలేదు. అవసరమైతే పాలీగ్రాఫ్ పరీక్షకైనా సిద్ధం. కేంద్రానికి వెళ్లే విషయమై సీనియర్లతో సంప్రదించేవాడిని. అప్పుడు వారు.. ఐఏఎస్‌లో ఒక సిస్టమ్ ఉంది. నువ్వు సీనియర్స్‌తో మిస్‌బిహేవ్ చేస్తావా..? ఎల్వీ, ప్రీతి సుడాన్, పీవీ రమేశ్‌తో మిస్‌బిహేవ్ చేస్తే నిన్ను సెంట్రల్‌లో ఎంప్యానెల్ ఎలా చేస్తాం? నువ్వు ఆంధ్రా భవన్‌లో కూర్చుని వ్యతిరేక ప్రచారం(బ్లాక్ బ్యాడ్జ్) వేస్తావా? నీకసలు కామన్‌సెన్స్ ఉందా.. అని గట్టిగా చెప్పారు.

ఆర్‌కే: మేం ప్రచురించాం కదా!

అవును సర్.. నేను చెప్పిన తర్వాత కూడా మీరెందుకు సెక్రటరీని ఆపారని సీఎస్ మెమోలో పేర్కొన్నారు. పై రెండు పోస్టింగ్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయనీ మెమో ఇచ్చారు. ఆ తర్వాత... 'వెంటనే ఏపీలో ఎవరెవరు సీనియర్లు ఉన్నారో లిస్ట్ చెప్పు.. సీఎంకు సీఎస్, సీఎంవో రెండు కళ్లు. ఈ రెండింటి మధ్య సమన్వయం ఉండాలి. నీకు ఎవరితో కంఫర్ట్‌గా ఉంటుందో చెప్పు' అని జగన్ అన్నారు. నేను వెంటనే నీలం సాహ్ని మేడం అయితే బాగుంటుందని చెప్పాను. ఇద్దరం జగన్ వద్దకు వెళ్లాం.. ఆ రోజు ఆయన రెండు ఫైల్స్‌పై ఆయన సంతకం చేశారు. నీలం మేడంను ఏపీకి తీసుకురావడంతో పాటు ఎల్వీ సర్‌ను బాపట్లకు ట్రాన్స్‌ఫర్ చేస్తూ జీవో జారీ చేశారు. ఆ తర్వాత నేను సీఎం వద్దకు వెళ్లాను. ఏపీ చరిత్రలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌ల మధ్య సమస్య వచ్చినప్పుడు సీఎంగా మీరు ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చని చెప్పాను. అయితే సీనియర్‌ను బదిలీ చేసినప్పుడు.. జూనియర్‌నూ చేయాలని చెప్పాను. అలా చేస్తే మనమధ్య సంబంధాలు బాగోలేదని అనుకుంటారని అన్నారు.

ఆర్‌కే: మీ వీఆర్ఎస్‌ను సీఎం చంద్రబాబు వెంటనే ఆమోదించారు..!

ఆమోదించాలని నేనే అడిగాను.

ఆర్‌కే: వీఆర్ఎస్ తీసుకున్నందుకు పశ్చాత్తాపపడుతున్నారా?

ఎందుకు పశ్చాత్తాపపడాలి సర్? కానీ వీఆర్ఎస్ తీసుకున్నందుకు నాకంటే మా తల్లిదండ్రులు ఎక్కువ ఫీలవుతున్నారు. నా భార్యకు కూడా ఇష్టం లేదు.

ఆర్‌కే: జగన్ హయాంలో తప్పు చేసినందుకు ఇప్పుడు సస్పెండ్ చేస్తారని భయపడి వీఆర్ఎస్ తీసుకున్నారా?

నాకలాంటి భయమేమీ లేదు. ఈ రోజు కూడా కేసు పెట్టుకోవచ్చు. క్రిమినల్ కేసులు లైఫ్‌లో ఎప్పుడైనా పెట్టుకోవచ్చు.

ఆర్‌కే: రంగుల పేరుతో ప్రజల సొమ్ము వృథా.. నేనైతే ప్రాసిక్యూషన్ చేసేవాడిని.


సర్.. ఒక ప్రశ్న అడుగుతా. కొంత మంది ఒక ప్రోగ్రాం చేయాలంటే పెద్ద మీటింగ్‌లు పెడతారు. ప్రభుత్వంలో కొన్ని మీటింగ్స్‌లో పెద్ద స్టేజ్.. భారీగా చేయాలనుకుంటున్నారు. ఇది డబ్బు వృథా కాదా..?

ఆర్కే: అది వంద శాతం కరెక్టు. కానీ రంగుల విషయంలో నేషనల్స్ బిల్డింగ్స్ కోడ్ ఉంది కదా!

సీఎం ఎలా చెబితే అలా చేయాల్సిందే. పార్లమెంటరీ వ్యవస్థలో ముఖ్యమంత్రి అసెంబ్లీకి వెళ్లి, కొన్ని చట్టాలు చేస్తారు. ఎగ్జిక్యూటివ్ వ్యవస్థలో కూడా ముఖ్యమంత్రి హెడ్. సచివాలయంలోని అన్ని ఫైల్స్‌కు సీఎం ఆమోదం కచ్చితంగా ఉండాలి. అన్ని ఫైల్స్ ఆయనే ఆమోదిస్తారు.

ఆర్‌కే: మళ్లీ సర్వీస్‌లోకి రావాలనే ఆలోచన ఉందా..?

నేను కోపంలో చేశాను. 3 నెలల్లో వీఆర్ఎస్ వెనక్కి తీసుకుంటానని అడిగాను. నీరబ్‌కుమార్ ప్రసాద్ (అప్పటి సీఎస్) మాకు బంధువే. మళ్లీ సర్వీస్‌లోకి వస్తానని చెబితే.. సీఎం చంద్రబాబు మీమీద చాలా కోపంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ విషయంలో తనపై ఒత్తిడి తెస్తే సస్పెండ్ చేస్తానని సీఎం అన్నట్లు కొందరు నాతో అన్నారు. నేను రోజూ పేషీకి ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ ఇప్పించాలని అడిగేవాడిని. గతంలో చంద్రబాబు, నేను దగ్గరగా ఉండే వాళ్లం..! 2019లో సీఎం పేషీలోకి తీసుకుంటామన్నారు.



ఆర్‌కే: జగన్ ముందు మోకాళ్లపై ఎందుకు కూర్చున్నారు..?

జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజు కొత్త జిల్లాలు ప్రకటిస్తున్నారు. ఆ ఉదయం హడావుడిలో నేను వ్యాయామం చేసి రాలేదు. సీఎం చేరువకు వెళ్లి మాట్లాడితే నోటి దుర్వాసన వస్తుందనే భావనతో కొంత దూరంగా మోకాళ్లపై కూర్చోని మాట్లాడాను. అంతే.

ఆర్‌కే: మీకు రాజకీయ పిచ్చి ఉన్నట్లుంది..!

మా వారాణసీలో నన్ను గుర్తుపట్టే వారే లేరు. 30 ఏళ్ల నుంచి అక్కడకు వెళ్లలేదు. మా అమ్మ, నాన్న తప్ప నన్ను అక్కడెవ్వరూ గుర్తుపట్టరు. నాకెందుకు టికెట్ ఇస్తారు సర్? సీఎంలను ఇంప్రెస్ చేస్తే నాకేమొస్తుంది? ఎమ్మెల్యే, ఎంపీ సాధించాలనే ఆలోచన నాకు లేదు.

ఆర్‌కే: జగన్‌ను హీరోలా ఉంటారని ప్యాంపర్ చేసేవారంట..!

(నవ్వుతూ..) నేను చాలా మందిని ప్యాంపర్ చేసేవాడిని. సీఎం చంద్రబాబుతో పాటు మా సీనియర్లందరినీ చేసేవాడిని. వాళ్ల దగ్గరే ఎక్కువ సమయం గడుపుతున్నప్పుడు సంభాషణ మొత్తం సీరియస్‌గా మాత్రమే ఉండదు కదా.

ఆర్‌కే: ఎల్వీ సుబ్రహ్మణ్యంతో ఏమిటి సమస్య..?

2019 అక్టోబరులో నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రెండు ముఖ్యమైన పథకాల గురించి.. నాడు-నేడు, ఆర్బీకేల (రైతు భరోసా కేంద్రాలు) విషయంలో చాలా క్లియర్‌గా ఉన్నారు. నాడు-నేడు ప్రోగ్రాంలో భాగంగా పాత స్కూల్స్ చాలా అభివృద్ధి చేయాలని చెప్పారు. ఇదంతా ఎడ్యుకేషన్ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్ కదా అమలు చేయాల్సింది.. మీరు ఆయన్ను అడిగారా అని నేనన్నాను. ఆ తర్వాత... దీనిని విలేజ్ ఎడ్యుకేషన్ కమిటీ ద్వారా చేద్దాం.. అప్పుడు మంచి పేరు వస్తుందని రాజశేఖర్ చెప్పారు. తనకు టెక్నికల్ నాలెడ్జ్ ఉన్న వ్యక్తి కావాలని, తెలంగాణలో రిటైరైన ఐఏఎస్ మురళిని తనకివ్వాలని అడిగారు. సీఎం వెంటనే ఆయన్ను ఏపీకి తెప్పించాలన్నారు. తర్వాత రెండ్రోజులకు ఆర్బీకేలపై సమీక్ష చేశారు. అప్పుడు పూనం మాలకొండయ్య అగ్రికల్చర్‌కు ఇన్‌చార్జి స్పెషల్ సీఎస్‌గా ఉన్నారు. ఆర్బీకేల్లో అన్నీ ఉండాలి, ఫెర్టిలైజర్స్ నాణ్యమైనవి అందుబాటులో ఉంచాలని జగన్ స్పష్టంగా చెప్పారు. ఆమె వెంటనే.. 'సర్ నేను అగ్రికల్చర్ శాఖకు ఇన్‌చార్జిని మాత్రమే.. ఫుల్ చార్జ్ ఉంటే బాగా చేస్తాను' అని చెప్పారు. వెంటనే సీఎం ఆమోదించి, ఫైల్ మీద సంతకం చేసి సీఎస్‌కు పంపించారు. తర్వాతి వారం కూడా ఈ రెండు ప్రోగ్రామ్స్‌పై సీఎం సమీక్ష పెట్టారు. తాము అడిగినవి జరగలేదని సదరు అధికారులు చెప్పారు. 'మీరు అంతా స్పీడ్‌గా చేయమంటారు.. మీ దగ్గరే అంతా స్లోగా ఉంది. చిన్న పోస్టింగ్ ఇవ్వడానికి కూడా ఆలస్యమవుతోంది' అని రాజశేఖర్ అన్నారు. ముఖ్యమంత్రి వెంటనే నన్ను పిలిచి.. వెంటనే వెళ్లి సీఎస్(ఎల్వీ)ను అడగండని చెప్పారు. నేను సీఎస్ దగ్గరకు వెళ్లాను. సీఎం దగ్గర నుంచి మీకు రెండు నోట్లు వచ్చాయని.. వెంటనే వాటిని పంపించాలని చెప్పాను. 'పూనం గురించి మీకు ఐడియా లేదా..? ఆమెకు డిపార్ట్‌మెంట్ ఇచ్చి ప్రమోట్ చేయాలా?' అని ఆయన నన్ను ప్రశ్నించారు. మంచయినా.. చెడయినా సీఎం ఒక నిర్ణయం తీసుకున్నారు.. ఆయన చెప్పిన పని కచ్చితంగా చేయాలి. నిర్ణయం తీసుకున్నారు కాబట్టి జీవో ఇచ్చేస్తే సరిపోతుందని నేను చెప్పాను. కానీ ఆయన ఫైల్ పంపించబోనన్నారు. ప్రధానమంత్రి లెటర్ పంపిస్తే క్యాబినెట్ సెక్రటరీ నో చెప్పగలరా..? సీఎం చెబితే సీఎస్ చేయాల్సిందే. కానీ ఎల్వీ చేయనని స్పష్టంగా చెప్పేశారు. ఈ విషయం నేనెవరికీ చెప్పలేదు. రెండు వారాల తర్వాత మళ్లీ ఈ రెండు ప్రోగ్రామ్స్‌పై జగన్ వద్ద సమీక్ష జరిగింది. రెండు ట్రాన్స్‌ఫర్లు కూడా చేయలేకపోతున్నారు.. ఏమైందని ఆయన అడిగారు. నేను ఫైల్ సీఎస్ దగ్గర ఉందని చెప్పాను. ఆ విషయం నాతో చెప్పాలి కదా అని ఆయన అన్నారు. 'ఇది కూడా జరగక్కపోతే ఇంకెందుకు? నాకు సీఎం పోస్టు అవసరం లేదు. నేను వెళ్లిపోతాను. నేను దీని కోసమే వచ్చానా..? ఇది జరక్కపోతే 'వెళ్లిపోతాను' అంటూ కొంచెం ఎమోషనల్ అయ్యారు. జీఏడీ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నేను ఆ హోదాలో జీవో జారీ చేశాను. ఎవరైనా బాస్ చెప్పింది చేయాల్సిందే. ఆ ఆర్డర్లు ఇచ్చిన తర్వాత సీఎం వద్దకు ఎల్వీ రాలేదు.

ఐఏఎస్‌లు కఠినంగా వ్యవహరిస్తే..

పార్లమెంటరీ వ్యవస్థలో చట్టసభలతో పాటు ఎగ్జిక్యూటివ్‌కూ సమానమైన పవర్ ఉంటుంది. ఏపీ అయినా, తెలంగాణ అయినా.. 50-60 మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కఠినంగా వ్యవహరిస్తే.. ఏ ముఖ్యమంత్రీ నిబంధనలు దాటి ముందుకెళ్లాలనుకోరు. ఎవరూ లిమిట్స్ దాటరు. సీఎంగా నేను మా పార్టీ రంగులు వేయాలని చెబితే.. నిబంధనలు అనుమతించవని ఐఏఎస్ అధికారులు రాయాలి.

చంద్రబాబుకు సెక్రటరీ క్లాసు..!

సీఎం చంద్రబాబు మొదటిసారి ఎమ్మెల్యే అయిన కొత్తలో ఆరోగ్య శాఖ సెక్రటరీ దగ్గరకు ఓ ట్రాన్స్‌ఫర్ నిమిత్తం వెళ్లారు. ఆయన మీరు తొలిసారి ఎమ్మెల్యే అయ్యారా అని అడిగారు. ఈ లెటర్ ఎవరి కోసం తీసుకొచ్చారో.. ఆ వ్యక్తిని వెంటనే సస్పెండ్ చేస్తానన్నారు. ఎందుకంటే రికమండేషన్స్ ప్రోత్సహించకూడదు.. అతడు మీ ద్వారా రావడమే మొదటి తప్పు.. ఎమ్మెల్యేగా మీ పని కేవలం చట్టాలు చేసుకోవడమే.. ఆ వ్యక్తితో ఎక్కడ పనిచేయించుకోవాలో మేం చేయాల్సిన పని.. మీరు కొత్తగా ఎమ్మెల్యే అయ్యారు. కాబట్టి అతడిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని చెప్పి పంపించారు.

పీవీని నాటి సీఎస్ అడ్డుకున్నారు!

పీవీ నరసింహారావు సీఎంగా ఉన్నప్పుడు వల్లూరి కామేశ్వరరావు చీఫ్ సెక్రటరీగా ఉండేవారు. అప్పట్లో విజయవాడలో కొన్ని గొడవలవుతున్నాయి. కారెక్కి విజయవాడ వెళ్లాలని సీఎం అనుకున్నారు. అక్కడకు వెళ్లి పరిస్థితిని చక్కదిద్దాలనుకున్నారు. అది తెలిసి సీఎస్ కిందకు వచ్చి.. మీరు వెళ్లడానికి వీల్లేదన్నారు. నాకు పొలిటికల్ కంపల్షన్ ఉందని పీవీ అన్నారు. సీఎస్‌గా అక్కడ పరిస్థితి నాకు తెలుసు.. మీరు వెళ్తే పరిస్థితి మా చేతులు దాటిపోతుంది.. వెళ్లడానికి వీల్లేదని సీఎస్ అన్నారు. నేను వెళ్తానంటూ పీవీ కారెక్కారు. సీఎస్ వెంటనే ఆ కారు డ్రైవర్‌ను 'గెటవుట్ ఆఫ్ ది కార్' అన్నారు. డ్రైవర్ వెంటనే దిగేశాడు. సీఎంకు వెంటనే కోపం వచ్చి.. నువ్వు ఏం చేస్తున్నావని గట్టిగానే అడిగారు. వెంటనే సీఎస్ నేను మీ దగ్గర పని చేస్తున్నాను. కానీ అతడు నా కింద పని చేస్తున్నాడు.. 'అయామ్ హెడ్ ఆఫ్ ది అడ్మినిస్ట్రేషన్' అని చెప్పారు. ఆ తర్వాత సీఎస్‌ను పిలిచి పీవీ అభినందించారు. మీలాంటి అధికారులు ఉండాలని చెప్పారు.

\- ఆర్‌కే



ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తదితరులు

ఏర్పాట్లలో ఎక్కడా తగ్గొద్దు!

▸ ప్రధాని పర్యటనపై అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

▸ 16న మోదీ రాక.. కర్నూలులో సభ ఏర్పాట్లపై వర్చువల్‌గా సీఎం సమీక్ష

▸ పరిశీలించిన పల్లా, మంత్రి టీజీ

కర్నూలు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న రాష్ట్రానికి రానున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. తొలుత శ్రీశైలం మల్లికార్జున స్వామి సేవలో పాల్గొని, అనంతరం కర్నూలులో నిర్వహించనున్న 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' సభకు హాజరవుతారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ప్రధాని ఏర్పాట్లపై వర్చువల్ విధానంలో ఆదివారం సమీక్షించారు. గతంలో ప్రధాని అమరావతి, విశాఖపట్నంలో పర్యటించారని, అప్పట్లో జరిగిన ఏర్పాట్లకుమించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని, మోదీ పర్యటనను దిగ్విజయం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కర్నూలులో ప్రధాని పాల్గొనే సభా ప్రాంగణం నుంచి పీఎం ప్రోగ్రామ్స్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ఎ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ సహా పలువురు ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు. 16న ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి నేరుగా శ్రీశైలం చేరుకుంటారు. మల్లికార్జున జ్యోతిర్లింగం, భ్రమరాంబ శక్తిపీఠం ఉన్న శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం, కర్నూలు నగర శివారులోని ఓర్వకల్లు మండలం, నన్నూరు టోల్ ప్లాజా దగ్గర రాగమయూరి వెంచర్‌లో నిర్వహించే 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సభకు దాదాపు 3-4 లక్షల మంది ప్రజలు హాజరయ్యేలా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. "ప్రధాని మరో మూడు రోజుల్లో రానున్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఏర్పాట్లు పూర్తి చేయండి." అని ఆదేశించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, హెలీప్యాడ్ నిర్మాణం, వాహనాలకు పార్కింగ్, రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లు ఏ స్థాయిలో ఉన్నాయో జిల్లా అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. ప్రధాని సభకు తరలివచ్చే సభికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రవాణా, ఆహారం, తాగునీరు సౌకర్యాలు కల్పించాలని చంద్రబాబు ఆదేశించారు. భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. మరోవైపు, మంత్రి టీజీ భరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు ప్రధాని పర్యటన ఏర్పాట్లను ఆదివారం స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లలో మంత్రి టీజీ భరత్, అధికారులు

నాణ్యమైన వైద్యం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చవుతుందనో కాకుండా.. కాస్త ఎక్కువ ఖర్చయినా సరే నాణ్యత ధ్రువీకరణ పొందిన వైద్యసేవలు కావాలని ప్రజలు కోరుతున్నారని తేల్చింది. కరోనా తర్వాతి నుంచి ఈ పరిస్థితి పెరుగుతూ వస్తోందని పేర్కొంది. దేశంలో నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హస్పిటల్స్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు పొందిన ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్య పదిశాతంలోపే ఉందని నివేదిక వెల్లడించింది. ఇక నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్ (నాబా) గుర్తింపు పొందిన ప్రైవేటు డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు రెండులోపేనని తెలిపింది. దేశంలో పెద్ద పట్టణాల్లోని కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు రోగులకు సంబంధించిన వివరాలను ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డు(ఈఎంఆర్) రూపంలో భద్రపరుస్తున్నాయని వెల్లడించింది. అదే సమయంలో చిన్న పట్టణా లు, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రులు ఇంకా పేపర్ రికార్డులపైనే ఆధారపడుతున్నాయని వివరించింది.

సర్వేలో తేలిన అంశాలివీ..

- వైద్యసేవలకు సంబంధించి నిర్దిష్టమైన, అందరికీ అందుబాటులో ఉండే సమాచారం కావాలన్నవారు.. 83 శాతం
- నాణ్యత ధ్రువీకరణ ఉన్న వైద్యసేవల కోసం ఎక్కువ సొమ్ము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నవారు.. 90శాతం
- 2024 నాటికి దేశంలో ప్రతి వెయ్యి మంది జనాభాకు అందుబాటులో ఉన్న బెడ్లు.. 1.3
- వైద్యం కోసం ప్రజలు స్వయంగా భరించే వ్యయం.. 2005లో రూ.853.. 2024లో రూ.2,600
- దేశంలో ప్రతి లక్ష జనాభాకు ఉన్న ఎంబీబీఎస్ సీట్లు.. 2005లో 1.7.. 2024లో 8.3
- ప్రైవేట్ ఆస్పత్రులలో ఒక పడకకు రోజువారీ సగటు ఆదాయం రూ.30,000-రూ.40,000
- ఇదే మెట్రో నగరాల్లో రూ.70,000 వరకు..

దేశంలో 40 ఏళ్లు దాటినవారిలో..

- ఊబకాయంతో బాధపడుతున్నవారు 56శాతం
- అధిక రక్తపోటుతో బాధపడుతున్నవారు 50%
- ప్రీడయాబెటిక్ స్థితిలో ఉన్నవారు 11శాతం
- మానసిక ఒత్తిళ్లతో బాధపడుతున్నవారు 18%

మధ్యాదాయ, అధిక ఆదాయం ఉన్న 40 ఏళ్లుపైబడినవారిలో..

- ఊబకాయంతో బాధపడుతున్నవారు 67శాతం
- అధిక రక్తపోటుతో బాధపడుతున్నవారు 50%
- ప్రీడయాబెటిక్ స్థితిలో ఉన్నవారు 33శాతం
- మానసిక ఒత్తిళ్లతో బాధపడుతున్నవారు 33%
- గుండె దెబ్బతిన్న రోగుల్లో ఏడాదిలోనే చనిపోతున్నవారు.. భారత్‌లో 23శాతం.. చైనాలో 9 శాతం
- తీవ్రమైన కిడ్నీ వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తున్నది.. భారత్‌లో 52%.. డెన్మార్క్‌లో 80%
- రొమ్ము కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తున్నది.. భారత్‌లో 29శాతం.. అమెరికాలో 65శాతం..

టీడీపీ నేతను ఓడిస్తానని శపథం చేసిన పోలీసుకు అందలం!

▸ వైసీపీ హయాంలో రెచ్చిపోయిన సీఐ

▸ టీడీపీ మద్దతుదార్ల ఓట్ల తొలగింపు సహా ఆ పార్టీ నేతలకు చుక్కలు చూపిన వైనం

▸ నరసరావుపేట వన్‌టౌన్ సీఐగా తాజా పోస్టింగ్

నరసరావుపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీడీపీ నేతలను ఇబ్బందులకు గురిచేసి, ఆ పార్టీ అభ్యర్థిని ఎన్నికల్లో ఓడించి తీరుతానని శపథం చేసిన ఓ పోలీసు అధికారికి.. అదే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మంచి పోస్టింగ్ ఇచ్చి గౌరవించింది!. ఎన్నికల అక్రమాలకు పాల్పడి సస్పెన్షన్‌కు గురైన షేక్ ఫిరోజ్ అనే పోలీసు అధికారికి నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా పోస్టింగ్ ఇచ్చింది. ఈ నియామకాన్ని టీడీపీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. గత ఎన్నికలకు ముందు పర్చూరు నియోజకవర్గంలో ఫాం-7 ద్వారా టీడీపీ మద్దతుదారుల ఓట్లు తొలగించేందుకు బీఎల్‌వోలను బెదిరించారని ఫిరోజ్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఫిరోజ్‌తో పాటు మరో ముగ్గురు పోలీసులు కూడా ఇదే వ్యవహారం చేశారు. దీంతో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అప్పట్లో ఓట్ల అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో నాడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆ నలుగురు అధికారులను సస్పెండ్ చేశారు. వారిలో ఫిరోజ్‌ను తాజాగా నరసరావుపేటలో సీఐగా నియమించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఫిరోజ్‌ను ఇక్కడికి తీసుకురావడంలో పార్టీ నేత ఒకరు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. అక్రమార్కులకు సహకరించిన అధికారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా కీలక పోస్టింగ్ ఇవ్వడంపై టీడీపీ వర్గాలు భగ్గుమంటున్నాయి. పర్చూరులో వైసీపీ అభ్యర్థికి బహిరంగంగా మద్దతు ఇచ్చి, ఏలూరిని ఓడిస్తానని ప్రకటనలు గుప్పించిన అధికారికి నరసరావుపేటలో అందలం ఎక్కించడమేంటని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు.



సీఐ ఫిరోజ్

తరలెళ్లిపోతున్న పల్లె జనం

(మొదటి పేజీ తరువాయి)

50 నుంచి 100 కుటుంబాలకు పైగా ఇప్పటికే ఊరు వదిలి వెళ్లారు. ముఖ్యంగా తెలంగాణలోని మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు, ఏపీలోని గుంటూరు జిల్లాకు వెళ్తున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పది వేల కుటుంబాలు పొట్టచేత పట్టుకొని సుగ్గి బాటన సాగిపోయి ఉంటారని అనధికారిక అంచనా. దీంతో గ్రామాలన్నీ బోసిపోతున్నాయి. తల్లిదండ్రులతో పిల్లలు కూడా వెళ్లడంతో పాఠశాలల్లో హాజరు తగ్గిపోతోంది.



వలస వెళ్తున్న పిల్లలకు వీడ్కోలు పలుకుతున్న వృద్ధులు

కిలో పత్తి తీస్తే రూ. 15

కర్నూలు జిల్లాలో 5.62 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అత్యధికంగా పత్తిసాగు చేసిన జిల్లాల్లో గుంటూరు తర్వాతి స్థానం దీనిదే. అయితే అధిక వర్షాలకు తేమ ఎక్కువై చెట్టుపైన కాయలు నల్లగా మారి కుళ్లిపోయాయి. ఉన్న అరకొర పత్తి చెట్టుపైనే మొలకలొచ్చి నేలపాలయింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు పైగా దిగుబడి రూపంలో నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పెద్ద రైతులు పత్తితీత పనులకు పిలిచినా రూ. 300-400 మించి కూలి ఇవ్వడం లేదు. ఆరు నెలలుగా ఉపాధి హామీ కూలి డబ్బులు అందకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారం అవుతుండటంతో వలసబాట పట్టారు. మహబూబ్‌నగర్, వికారాబాద్, గుంటూరులో కిలో పత్తి తీస్తే రూ. 15 నుంచి రూ. 18 చొప్పున ఇస్తున్నారు. 'దంపతులిద్దరూ రోజుకు వంద కిలోల పత్తి తీస్తే రూ. 1,500 వస్తుంది. ఇద్దరు పిల్లలు కూడా పనిలోకి వెళితే మరో రూ.వెయ్యి సంపాదించవచ్చు. ఇలా రోజుకు సుమారు రూ. 2,500, నెలంతా కష్టపడితే దాదాపు రూ.50 వేల నుంచి 60 వేలు సంపాదించుకోవచ్చని వలస బాట పట్టారు. గుంటూరు జిల్లాలో పత్తి తీత పనులు అయిపోగానే మిరప కోత పనులు మొదలవుతాయి. నాలుగైదు నెలలు పనులు ఉంటాయని ఆ జిల్లాకు ఎక్కువ వెళ్తున్నారు.

ఆ ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే..

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణే ప్రధాన లక్ష్యంగా 2019లో నాడు టీడీపీ ప్రభుత్వం వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి నిధుల మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులను అటకెక్కించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకూ పనుల్లో కదలికలేదు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం పల్లెసీమల వలసలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణమే ఏకైక పరిష్కార మార్గమని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరెకరాలున్నా.. వలస బాటే

చింతకుంటకు చెందిన పుసులు యల్లప్ప, పద్మ దంపతులకు బోరుబావి కింద ఆరెకరాల పొలం ఉంది. 3 ఎకరాల్లో పత్తి, మరో 3 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. రూ.4 లక్షలకు పైగా అప్పు చేశారు. ధరలు పతనమవడంతో ఉల్లి పంటను పొలంలోనే వదిలేశారు. అధిక వర్షాలకు పత్తికూడా పాడైపోయింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక బడికి వెళ్లే ఇద్దరు పిల్లలను తీసుకొని వికారాబాద్‌కు వలస వెళ్తున్నానని యల్లప్ప చెప్పాడు.

డిజిటల్ ప్లంబింగ్‌తో విస్తృత పెట్టుబడులు

- బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ అభివృద్ధి
- 'ఆంధ్రజ్యోతి'తో సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) "డిజిటల్ ప్లంబింగ్"తో విశాఖపట్నానికి విస్తృత స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తాయని సిఫీ టెక్నాలజీస్ చైర్మన్ రాజు వేగేశ్న తెలిపారు. రుషికొండ ఐటీ పార్కులో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విశాఖ కాస్మోపాలిటన్ నగరమని, ప్రస్తుతం ఐటీలో ద్వితీయ శ్రేణి (టైర్-2) నగరంగా ఉందని, త్వరలో ప్రథమ శ్రేణి నగరాలతో పోటీ పడుతుందని చెప్పారు.

ప్రశ్న: డిజిటల్ ప్లంబింగ్ అంటే..?

రాజు వేగేశ్న: సముద్రం అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుళ్లతో విశాఖలోని సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను అనుసంధానం చేస్తాం. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న సమాచారాన్ని ఇక్కడికి తీసుకొస్తాం. అవసరమైన రాష్ట్రాలకు, దేశాలకు పంపిస్తాం. ఇలా డేటాని పంపింగ్ చేయడాన్ని 'డిజిటల్ ప్లంబింగ్'గా వ్యవహరిస్తాం. ఇందులో విశాఖ అగ్రస్థానంలో నిలవనుంది. డిజిటల్ ప్లంబింగ్ వల్ల మరిన్ని డేటా సెంటర్లు వస్తాయి. త్వరలోనే ఒక గిగావాట్, రెండు గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు ఏర్పాటవుతాయి. విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది.

భారీగా ఉద్యోగాలు వస్తాయా?

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఎలాగైతే ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేసి సమాజానికి అందిస్తున్నాయో.. డేటా సెంటర్లు కూడా ఆ విధంగానే పనిచేస్తాయి. వీటి వల్ల ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నా.. పరోక్షంగా ఎకో సిస్టమ్ అభివృద్ధి చెంది పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. ఐటీలో అగ్రస్థానంలో ఉన్న బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ ఎంతో అభివృద్ధి సాధిస్తుంది.

ఈ రంగంలో మీకున్న అనుభవం ఏమిటి?

భారత్‌లో 25ఏళ్ల క్రితమే డేటా సెంటర్లను సిఫీ ప్రారంభించింది. ముంబైలో 250 మెగావాట్లు, నోయిడాలో 130 మెగావాట్లు, చెన్నైలో మరో 130 మెగావాట్ల డేటా సెంటర్లు నిర్వహిస్తున్నాం. నాస్డాక్‌లో నమోదైన రెండు కంపెనీల్లో ఒకటి ఇన్ఫోసిస్ అయితే రెండోది సిఫీ. డేటా సెంటర్ ఆపరేషన్లు రెండేళ్లలో ప్రారంభించాలనే లక్ష్యంతో విశాఖ వచ్చాం. నేనూ ఏపీకి చెందినవాడినే. మంత్రి లోకేశ్ చాలాకాలం నుంచి తెలుసు. విశాఖ కాస్మోపాలిటన్ నగరం. ఇక్కడ అన్ని ప్రాంతాల వారు ఎటువంటి భేదభావాలు లేకుండా కలిసి మెలిసి ఉంటారు. ఇక్కడ అందమైన బీచ్‌లు ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. వీటన్నింటి కంటే మంచి పాలసీలు, పూర్తి సహకారం అందించే ప్రభుత్వం ఉండటం వల్లనే ముందుకొచ్చాం.

హైదరాబాద్‌కు దీటుగా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం రుషికొండ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో సిఫీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని లోకేశ్ జ్యోతి వెలిగించి ప్రారంభించి, ప్రసంగించారు. గత 17 నెలల్లో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా అందులో 50శాతానికి పైగా విశాఖ జిల్లాకే వచ్చాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు భారీగా రావడం ఇదే మొదటిసారని, ఇదంతా ఒక్కరోజులో సాధ్యం కాలేదని చెప్పారు. సుదీర్ఘ చర్చలు, అనేక మంది కీలకంగా వ్యవహరించడం వల్లనే వచ్చాయన్నారు. సిఫీ సంస్థను ఏపీకి రప్పించడానికి ఎనిమిదేళ్లు పట్టిందన్నారు. రాష్ట్రానికి విశాఖపట్నమే ఆర్థిక రాజధాని అని, అభివృద్ధి విషయంలో వికేంద్రీకృత విధానం అనుసరిస్తున్నామని చెప్పారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో ఒక్క విశాఖలోనే 5లక్షల ఐటీ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. టీసీఎస్‌కు ఎకరా భూమి 99 పైసలకే ఇస్తే విమర్శించారని, అయితే ఆ నిర్ణయం కారణంగా కాగ్నిజెంట్, యాక్సెంచర్, ఏఎన్ఎస్ఆర్, సత్వాల్, గూగుల్ వంటి పెద్ద సంస్థలు విశాఖకు వచ్చాయన్నారు. పెట్టుబడుల విషయంలో ఏపీ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతోనే కాకుండా ఇతర దేశాలతో కూడా పోటీ పడుతోందని చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) కేంద్రంగా ఏపీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఏ జీసీసీ అయినా ఏపీకే రావాలన్నారు.

బుల్లెట్ ట్రైన్ వేగం

ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కారు మాత్రమే కాదని, బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకుపోయే ప్రభుత్వమని లోకేశ్ అభివర్ణించారు. ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ఢిల్లీ వెళితే.. ఏపీకి వెళ్లాలని, అక్కడ వేగంగా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం ఉందని సూచిస్తున్నారని, అది రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. రైల్వే జోన్ సాధించుకున్నామని, విశాఖ స్టీల్ ప్లాంటు కష్టాల్లో ఉంటే కేంద్రం రూ.11,440 కోట్లు ఇస్తే రాష్ట్రం రూ.4 వేల కోట్ల సాయం అందిస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంటు ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌తో నడిస్తే ఇప్పుడు 3 బ్లాస్ట్ ఫర్నేసులతో 85% ఉత్పత్తి చేసే స్థాయికి చేరిందని తెలిపారు. మరో 3 నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని చెప్పారు. విశాఖ అభివృద్ధికి రాష్ట్ర మంత్రివర్గం బ్లాంక్ చెక్ ఇచ్చిందని, దాంతో దూకుడుగా వెళ్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు సిఫీ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. తొలిదశలో 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటు చేస్తారు.



సిఫీ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న లోకేశ్

4 జిల్లాలతో గ్రేటర్ విశాఖ

ఎకనమిక్ జోన్: లోకేశ్

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు 4 జిల్లాలతో 'గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. 'మహా విశాఖ ఆర్థిక మండలి' నిర్వహణ, విధివిధానాలపై సీఎం ప్రకటన చేస్తారని చెప్పారు. పరిశ్రమలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే నాటికి రోడ్లు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటుకానున్న పరిశ్రమలు, కంపెనీల ద్వారా 5లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన రూ.లక్ష కోట్ల పెట్టుబడుల్లో సగం గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్‌కు వచ్చాయన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలంటే గ్రేటర్ జోన్ ఆర్థిక వృద్ధి ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని వివరించారు. వచ్చేనెల 14, 15ల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సులో మరిన్ని కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. మంగళవారం సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నారని చెప్పారు. గూగుల్ సంస్థ ద్వారా దేశంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇదేనన్నారు. టీసీఎస్‌కు కేటాయించిన భూముల్లో వచ్చే నెలలో శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. డిసెంబరులో కాగ్నిజెంట్ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఈవో వస్తున్నారని తెలిపారు. దేశంలో అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఉమ్మడి విశాఖలో ఏర్పాటుకాబోతున్నదన్నారు.

యూజ్‌లెస్ ఫెలో.. ఎవడ్రా నువ్వు!

- ఎమ్మెల్యే బూర్లపై నోరు పారేసుకున్న మాల మహానాడు నేత గోళ్ల
- తురకపాలెం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే, మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులును మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ అసభ్య పదజాలంతో దూషించారు. తురకపాలెంలో వరుస మరణాల నేపథ్యంలో ఆదివారం ఆయా కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం 28మందికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో బాధితులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీచేశారు. ఈ సాయం ప్రభుత్వం చేస్తోందని, దళారులు డబ్బులు అడిగితే ఇవ్వద్దని సూచించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అరుణ్ కుమార్ ఎమ్మెల్యేను చూస్తూ అంత దౌర్భాగ్యం తమకు రాలేదన్నారు. ఒక సమయంలో నియంత్రణ కోల్పోయి ఎమ్మెల్యే వైపు వేలు చూపిస్తూ 'ఎవడ్రా నువ్వు.. యూజ్ లెస్ ఫెలో' అంటూ దూషించడంతో పాటు తిట్లపర్వం అందుకున్నారు. ఈ ఘటనతో కేంద్ర మంత్రి, అధికారులు షాకయ్యారు. ఎమ్మెల్యే మీదకు దూసుకువచ్చిన అరుణ్‌కుమార్‌ను పోలీసులు తీసుకువెళ్లి పోయారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు నాయకులను గ్రామస్థులు అడ్డుకున్నారు. మా ఊళ్లో మీ పెత్తనం ఏమిటని నిలదీశారు. కాగా, కొందరు బాధితులు తమకూ ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు.



ఎమ్మెల్యే బూర్లకు వేలు చూపిస్తూ మాట్లాడుతున్న గోళ్ల అరుణ్‌కుమార్

అమరావతిలో తొలి హెచ్‌వోడీ!

- నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- మంత్రి సహా మునిసిపల్ శాఖ డైరెక్టర్, సీఆర్‌డీఏ, ఏడీసీ విధులు ఇక్కడ నుంచే

అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో సచివాలయ భవనాల నిర్మాణం తర్వాత మొట్ట మొదటిగా మున్సిపల్‌శాఖ నిర్మించిన(హెచ్‌వోడీ) భవనం సిద్ధమైంది. ఆ శాఖ పాలనా వ్యవహారాలు, కార్యకలాపాలు ఇకపై ఇక్కడ నుంచే నిర్వహించనున్నారు. ఈ పాలనా భవనాన్ని సీఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించనున్నారు. రాజధానిలో పాలనా సౌలభ్యం కోసం మునిసిపల్ శాఖలోని అన్ని విభాగాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా సరికొత్త హంగులతో ఈ భవనాన్ని నిర్మించారు. రాజధాని అమరావతి పేరును ప్రతిబింబించేలా భవనం ముందు ఆంగ్ల అక్షరం 'ఏ'తో ఎలివేషన్‌ను తీర్చిదిద్దారు. ఇకపై అమరావతి నిర్మాణ పనులన్నీ ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తారు. అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్డు ఈ-3-ఎన్11 కూడలి వద్ద రాయపూడి సమీపంలో మున్సిపల్‌శాఖ ప్రధాన కార్యాలయం నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. మొత్తం 4.36 ఎకరాల్లో ఏడు అంతస్థుల్లో దీన్ని పూర్తిచేశారు. హెచ్‌వోడీలో మునిసిపల్ శాఖ మంత్రి చాంబర్ సహా సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్(ఏడీసీ) అధికారుల చాంబర్లు ఉన్నాయి. ఇక ప్రధాన కార్యాలయానికి పక్కనే 8 ఎకరాల్లో పార్కింగ్ ఏరియాతో కలిపి పీఈబీ(ప్రీ-ఇంజనీర్డ్ బిల్డింగ్) విధానంలో మరో 4 భవనాలు నిర్మించారు.



సీఆర్‌డీఏ నూతన కార్యాలయం లోపలి భాగం

ఏడు అంతస్థుల్లో.. ఏమేమి?

గ్రౌండ్ ఫ్లోర్: రిసెప్షన్, పబ్లిక్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్, రెస్టారెంట్, బ్యాంక్, ఏఐ కమాండ్ సెంటర్.
ఫస్ట్ ఫ్లోర్: సదస్సులు, సమావేశాలకు వివిధ హాళ్ల నిర్మాణం.
2, 3, 5 ఫ్లోర్లు: సీఆర్‌డీఏ కార్యాలయాలు.
నాలుగో ఫ్లోర్: మున్సిపల్‌శాఖ డైరెక్టర్ ఆఫీస్.
ఆరో ఫ్లోర్: అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీ) ఆఫీస్.
ఏడో ఫ్లోర్: మున్సిపల్‌శాఖ మంత్రి, ముఖ్యకార్యదర్శి చాంబర్లు. పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీ, ఏడీసీఎల్ ఆఫీసు.
టెర్రస్ పీఈబీ: డైనింగ్ హాల్.

హెచ్‌వోడీ సమగ్ర స్వరూపం!

- మొత్తం విస్తీర్ణం 4.32 ఎకరాలు.
- నిర్మాణం 3,07,326 చదరపు అడుగులు.
- జీ+7 అంతస్థులుగా నిర్మాణాలు.
- గ్రీన్ జోన్ 0.88 ఎకరాలు.
- పార్కింగ్ ప్రాంతం 1.36 ఎకరాలు.
- ఓపెన్ స్పేస్ 0.96 ఎకరాలు.
- ఎస్టీపీ 0.39 ఎకరాలు.
- 8 మంది సామర్థ్యంతో 7 లిఫ్టులు.
- ఫోర్ వీలర్స్, 170 టూవీలర్స్‌కు పార్కింగ్.

నాలుగు ఇతర భవనాలు

భవనం-1: మెప్మా కార్యాలయం.
భవనం-2: టిడ్కో, ఏపీయూఎఫ్ఐడీసీ.
భవనం-3: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రెరా అప్పిలేట్ అథారిటీ, గ్రీనింగ్ కార్పొరేషన్.
భవనం-4: రెరా, టౌన్‌ప్లానింగ్‌ఆఫీసులు.

- ఒక్కొక్క భవనం విస్తీర్ణం 41,500 చదరపు అడుగులు.
- ఈ 4 భవనాలకు సంబంధించి ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం.



'హోరు' సదస్సులో మాట్లాడుతున్న కవి ఖాదర్ మొహియుద్దీన్

కథలు, కవిత్వాలతో సమాజానికి మార్గదర్శనం

- ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ వెల్లడి

విజయవాడ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు కథలు, కవిత్వాలు రాస్తూ సమాజానికి మార్గదర్శనం చేస్తున్నారని ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ చెప్పారు. కవులు సామాజిక చైతన్యపు పంటలు వేస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాలులో 'హోరు' పేరుతో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన ఖాదర్ మాట్లాడుతూ విమర్శకు విమర్శ అతీతం కాదని వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తొమ్మిది విమర్శనా వ్యాస సంపుటిలపై సమీక్షా ప్రసంగాలు, రచయితల సమాధానపూర్వక ప్రసంగాలు కొనసాగాయి. అంబటి మురళీకృష్ణ శ్రీరాం పుప్పాల, సుంకర గోపాలయ్య, కోసూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

12 కొత్త నగర వనాలకు 12 కోట్లు

అమరావతి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా 12 నగర వనాల ఏర్పాటుకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. 2025-26 సంవత్సరానికి నగర వన యోజన(ఎన్‌వీవై) కింద రాష్ట్ర అభివృద్ధి సంస్థకు మొదటి విడతగా రూ.12.40 కోట్లు విడుదల చేసింది. తిరుపతి జిల్లా సత్యవేడు, పుదురు, శ్రీనివాసులు భూదానం, మామండూరు, అంజీరమ్మకనుమ, తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు, ఏలూరు జిల్లా చింతలపూడి, అనకాపల్లి జిల్లా ఆరిలోవ, వేమగిరి, మన్యం జిల్లా అడ్డాకులగూడ, ఎన్టీఆర్ జిల్లా వేదాద్రి, విజయనగరం జిల్లా పాతపట్నంలో నగర వనాలను ఏర్పాటు చేయనున్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*